ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం 25.10.2026 | సంపుటి : 13 సంచిక : 95 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల నిర్మాణంలో సీకెంట్ ఫైల్స్ వాడారు. సీకెంట్ ఫైల్స్ వాడకం వల్లే మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో సమస్యలు వచ్చాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో, అంతే కాంక్రీట్ మరమ్మతులకు అవసరం" - మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

# కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయలేం

## కరువు కష్టాలకు బీఆర్ఎస్సే కారణం

- మూడు బ్యారేజీల వైఫల్యాలను కప్పిపుచ్చేందుకే విషప్రచారం చేస్తున్నారు
- ఎల్‌నినోనూ రాజకీయ ప్రయోజనాలకు వాడుకుని గోబెల్స్‌ను మించిపోయారు
- పదేళ్లలో ప్రాజెక్టులు పూర్తిచేసి ఉంటే ఇప్పుడు రైతులకు కరువొచ్చేది కాదు
- మేడిగడ్డలో డిజైన్, నిర్మాణం, నిర్వహణ లోపాలను గత ప్రభుత్వ హయాంలోనే ఎన్‌డీఎస్‌ఏ గుర్తించింది
- మీడియా సమావేశంలో మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి వివేక్ స్పష్టీకరణ

హైదరాబాద్(జనంసాక్షి): కేసీఆర్ పాలనలో ఇరిగేషన్ ప్రాజెక్టులను సర్వనాశనం చేశారని మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "ఎల్‌నినో వల్ల ప్రజలు పడుతున్న ఇబ్బందులకు కారణం బీఆర్ఎస్ ప్రభుత్వమే. రాష్ట్ర ప్రజల కష్టాలకు కారణమైన వారే ప్రస్తుతం అబద్ధాలు చెబుతున్నారు. కేవలం కమీషన్ల కోసమే కాళేశ్వరం ప్రాజెక్టును కట్టారు. బీఆర్ఎస్ పాలనలోనే మేడిగడ్డ బ్యారేజ్ కూలిపోయింది. కేసీఆర్ తీరు వల్ల రాష్ట్రానికి తీవ్ర అన్యాయం జరిగింది. మిగతా 2లో..










# రేవంత్ రెడ్డి, ఫడణవీస్‌ల తుమ్మిడిహట్టిపై తొలి సమావేశం

## ప్రాజెక్టుపై చర్చించేందుకు రేపు ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రుల భేటి

### ముఖ్యమంత్రితో పాటు వెళ్లనున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి
### రేపటి కేఆర్ఎంబీ సమావేశం వాయిదా

హైదరాబాద్(జనంసాక్షి): తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర ప్రభుత్వంతో చర్చలకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ముంబయిలో చర్చలు జరగనున్నాయి. ఇందుకోసం సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, నీటిపారుదల శాఖ అధికారులు సోమవారం ముంబయి వెళ్లనున్నారు. తుమ్మిడిహట్టిపై మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడణవీస్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి భేటీ కానున్నారు. రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, అధికారులు పాల్గొనున్నారు. మరోవైపు సోమవారం జరగాల్సిన కృష్ణా నదీ యాజమాన్య బోర్డు సమావేశం వాయిదా పడింది. అదే రోజు ముంబయిలో మహారాష్ట్ర సీఎంతో రేవంత్‌రెడ్డి సమావేశం ఉన్నందున వాయిదా వేయాలని తెలంగాణ కోరింది. ఈ విజ్ఞప్తిపై స్పందించిన కేఆర్ఎంబీ సమావేశాన్ని వాయిదా వేశారు. సోమవారం జరగాల్సిన కృష్ణా బోర్డు సమావేశం మంగళవారానికి వాయిదా వేసింది. సాగునీటి ప్రాజెక్టులపై శుక్రవారం రేవంత్ రెడ్డి సమీక్ష సమావేశంలో భాగంగా తుమ్మిడిహెట్టిపై ప్రధానంగా చర్చించారు. 152 మీటర్ల ఎత్తున తుమ్మిడిహెట్టి బ్యారేజీ నిర్మాణానికి ఒప్పించేందుకు అవసరమైన పూర్తి వివరాలను సిద్ధం చేయాలని నీటిపారుదల శాఖ అధికారులను ఆదేశించారు. బ్యారేజీ ఎత్తుపై స్పష్టత వచ్చిన తర్వాత తుమ్మిడిహెట్టి నుంచి మిగతా 2లో..

## హైదరాబాద్ నగరం అత్యంత సురక్షితం

- ముఖ్యమైన పరిశోధనా సంస్థలకు నిలయం
- సముద్రతీరం లేకున్నా భారత నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోంది

: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి 2లో..

## కన్నెపల్లిని పరిశీలించండి

### నీటి కష్టాలను తీర్చండి:బీఆర్ఎస్

హైదరాబాద్(జనంసాక్షి): కన్నెపల్లి పంప్‌హౌస్‌ను నడిపి నీటికష్టాలను తీర్చాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. వారు మాట్లాడుతూ " పోయిన జూన్ నుంచే మాకు అతి తక్కువ నీళ్లొస్తున్నయ్.. మాకు సమస్య అవుతుంది.. ఏం చేద్దాం సార్ అని మాకు హైదరాబాద్‌లో మా ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయని ఎల్బీ నగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి అన్నారు. కన్నెపల్లి పంప్ హౌసును బీఆర్ఎస్ నాయకుల బృందం పరిశీలించింది. ఇప్పటికైనా కన్నెపల్లి మోటర్లు ఆన్ చేసి గ్రేటర్ హైదరాబాద్ తాగునీటి సమస్య, రైతుల సాగునీటి సమస్యలు తీర్చాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. ఇప్పుడే ఇట్ల తక్కువుంటే ఎట్లా సార్ అని నీళ్ల సమస్యపై ప్రజలు మా దగ్గరకు ఎన్నోసార్లు వచ్చారు. అప్పుడే మేం వెళ్లి వాటర్ వర్క్స్ ఎండీని కలిసి ఇప్పుడినుంచే ఇలాంటి సమస్య వస్తే రాబోయే ఎండాకాలాన్ని మీరు ఏ విధంగా టాకిల్ చేస్తారు? దానికేమైనా ప్రణాళిక మిగతా 2లో..








## వారాంతంలో ఇరాన్‌పై మరో 'ఎపిక్ ఫ్యూరీ'

### ఎలాంటి సైనిక ఒప్పందం కుదరకపోతే టెహ్రాన్‌పై మళ్లీ సైనిక చర్య : ట్రంప్

వాషింగ్టన్(జనంసాక్షి): ఈ వారాంతంలో ఇరాన్‌పై అమెరికా భీకర దాడులు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. టెహ్రాన్‌తో ఎలాంటి ఒప్పందం కుదరకపోతే తాము మరోసారి సైనిక చర్యకు దిగే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. మధ్యంతర ఎన్నికల ప్రచారంలో భాగంగా ఫ్లోరిడా ర్యాలీలో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. "పశ్చిమాసియాలో మరో చిన్న స్థాయి ఎపిక్ ఫ్యూరీ జరగొచ్చు" అని ట్రంప్ ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ వారాంతంలో ఇరాన్‌పై దాడులు జరిగే అవకాశం ఉందని తుర్కియేలోని అమెరికా రాయబారి టామ్ బారక్ ఇటీవల ఒక పాడ్‌కాస్ట్‌లో వ్యాఖ్యలు చేశారు. తొలుత వాటిని ట్రంప్ తోసిపుచ్చారు. "ఓ ఆయన (బారక్) మా రాయబారా..? ఆయన బాగా పలుకుబడి ఉన్న వ్యక్తి అనుకుంటా..? మిగతా 2లో..



### ట్రంప్ నోట మళ్లీ అదే పాట

భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ వాఖ్యలు

ప్రపంచ వ్యాప్తంగా 8 యుద్ధాలనూ ఆపానని వెల్లడి 2లో..



## నిప్పుతో చెలగాటమాడొద్దు

- మళ్లీ దాడి జరిగితే ఊరుకునేదిలేదు
- ఇక ఎలాంటి హద్దులు ఉండవు. కేబుళ్లు మిలిటరీ స్థావరాలు.. వేటినీ వదలబోం
- ట్రంప్ హెచ్చరికలపై ఇరాన్ వార్నింగ్

టెహ్రాన్(జనంసాక్షి): ఇదిలా ఉండగా అమెరికా హెచ్చరికల వార్తలపై ఇరాన్ తీవ్రంగా స్పందించింది. నిప్పుతో చెలగాటమాడొద్దంటూ వార్నింగ్ ఇచ్చింది. తమపై మరోసారి దాడులు జరిగితే గల్ఫ్ దేశాల్లోని సముద్రగర్భంలో ఉన్న కమ్యూనికేషన్ కేబుళ్లను ధ్వంసం చేస్తామని ఇప్పటికే హెచ్చరించింది. "ఇరాన్‌పై దాడి జరిగితే.. ఇక ఎలాంటి హద్దులు ఉండవు. కేబుళు మిలిటరీ స్థావరాలు.. మిగతా 2లో..

## భారత పర్యటనలో పోలండ్ ప్రధాని

### బెంగళూరులోని అంధుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించిన డొనాల్డ్ టుస్క్

బెంగుళూరు(జనంసాక్షి): మనసుకు హత్తుకున్న సంఘటనలు, ప్రదేశాలు, పనులు ఇలా ఏవైనా.. చిరకాలం గుర్తుండిపోతాయి. భవిష్యత్‌లో అలాంటి సందర్భం మరోసారి ఎదురైనప్పుడు పాత జ్ఞాపకాలను నెమరువేసుకుంటుంటాం. భారత్ పర్యటనకు వచ్చిన పోలండ్ ప్రధాని డొనాల్డ్ టుస్క్‌కు కూడా అదే అనుభవం ఎదురైంది. 16 ఏళ్ల క్రితం బెంగళూరు పర్యటనకు వచ్చిన డొనాల్డ్ టుస్క్.. అక్కడి అంధుల సంరక్షణ కేంద్రాన్ని సందర్శించారు. ఫ్రాన్స్, పోలండ్‌కు చెందిన కొందరు కలిసి ఈ కేంద్రాన్ని ఏర్పాటుచేశారు. దృష్టిలోపం ఉన్న చిన్నారులను సంరక్షిస్తున్నారు. అప్పట్లో అక్కడికి మిగతా 9లో..



## 'ఎక్స్'లోకి సోనియా గాంధీ

### భర్త రాజీవ్‌తో పరిచయంపై తొలిపోస్ట్



న్యూఢిల్లీ(జనంసాక్షి): కాంగ్రెస్ అగ్రనాయకురాలు సోనియా గాంధీ 'ఎక్స్'లో ఎంట్రీ ఇచ్చారు. త్వరలో విడుదల కానున్న తన ఆత్మకథ 'బిలాంగింగ్: ఎ జర్నీ ఆఫ్ లవ్' గురించి వీడియో రూపంలో తొలి పోస్ట్ పెట్టారు. ఈ సందర్భంగా తన భర్త, మాజీ ప్రధాని రాజీవ్ గాంధీతో ప్రేమ ప్రయాణాన్ని ప్రస్తావించారు. "కేంబ్రిడ్జ్‌లోని ఒక చిన్న గ్రీక్ రెస్టారంట్‌లో మా లవ్ జర్నీ ప్రారంభమైంది. రాజీవ్-నేనూ కలిసి.. ప్రేమ, నవ్వులు, ఎన్నో జ్ఞాపకాలతో మా ప్రపంచాన్ని ఏర్పాటు చేసుకున్నాం. నవంబర్ 10న ఆ ప్రపంచాన్ని మీకు పరిచయం చేస్తాను" అని తన పోస్ట్‌లో రాసుకొచ్చారు. ఇక, ఆ వీడియోలో రాజీవ్‌తో తన ప్రేమ ప్రయాణాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు. ఆయనొక అందమైన, సౌమ్యుడైన వ్యక్తి అని అన్నారు. వారిద్దరూ కలిసి దిగిన చిత్రాలను మిగతా 2లో..

## హైదరాబాద్ చెరువులకు మహర్దశ

### పర్యాటక కేంద్రాలుగా తమ్మిడికుంట, సున్నం చెరువులు

**నవంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు**

హైదరాబాద్(జనంసాక్షి): తమ్మిడికుంట, సున్నం చెరువులను నెలాఖరున లేదా నవంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉంది. హైదరాబాద్ నగరంలోని చెరువులు ఆక్రమణల చెర నుంచి విముక్తి పొంది, పునరుజ్జీవం దిశగా అడుగులు వేస్తున్నాయి. నగరంలోని జలవనరులను పరిరక్షించడంతో పాటు వాటిని ప్రజలకు ఆహ్లాదాన్ని అందించే ప్రదేశాలుగా తీర్చిదిద్దేందుకు హైడ్రా చర్యలు చేపడుతోంది. ఇప్పటికే వందకుపైగా చెరువుల్లో ఆక్రమణలను తొలగించగా, తొలి రెండు దశల్లో 20 చెరువులను అభివృద్ధి చేస్తోంది. వీటిలో మూడు చెరువుల అభివృద్ధి పనులు పూర్తికావడంతో అవి ఇప్పటికే ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా మాదాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువులు కూడా ప్రారంభోత్సవానికి సిద్ధమయ్యాయి.

**ప్రారంభోత్సవానికి సిద్ధమైన చెరువులు**

తమ్మిడికుంట, సున్నం చెరువుల అభివృద్ధి పనులను సైబరాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ జి.సృజన, హైడ్రా మిగతా 2లో..





### అక్రమ నీటి దందాపై హైడ్రా కొరడా

సున్నం చెరువు పరిధిలోని అక్రమ బోర్లను తొలగించిన సిబ్బంది 2లో..

## తమిళనాడులో భారీ వర్షాలు

### విరిగిపడ్డ కొండచరియలు.. స్తంభించిన రాకపోకలు



చెన్నై(జనంసాక్షి): తమిళనాడులోని పలు జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. మెట్టుపళయం-ఊటీ మార్గంలో భారీగా కొండచరియలు విరిగిపడ్డాయి. దీంతో కేరళకు చెందిన 150కి పైగా విద్యార్థులు చిక్కుకుపోయారు. పోలీసులు, రెస్క్యూ సిబ్బంది ఘటనాస్థలికి చేరుకొని వారిని కాపాడారు. ఆ మార్గంలో దాదాపు 10 చోట్ల కొండచరియలు విరిగిపడటంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. మరోవైపు బర్లియార్ సమీపంలో ప్రభుత్వ బస్సుపై చెట్టు, మట్టి పెళ్లలు విరిగిపడ్డాయి. ఎడతెరిపి లేని వానలకు దుండిగల్‌లోని అడక్కం గ్రామంలో రహదారులు ధ్వంసమై రాకపోకలు నిలిచిపోయాయి.

## అల్లూరిజిల్లాలో భారీ విషాదం

లారీలో నిల్వచేసిన జిలెటిన్ స్టిక్స్ పేలి ఏడుగురి మృతి 2లో..

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
25.10.2026

# తుమ్మిడిహట్టిపై తొలి సమావేశం

ఎల్లంపల్లి వరకు నీటిని తెచ్చే ప్రాజెక్టు రూట్ డిజైన్లు, భూసేకరణపై దృష్టి సారించాలని ఇరిగేషన్ ఇంజినీర్లను సీఎం ఆదేశించారు.గతంలో 148 మీటర్ల ఎత్తుకు మహారాష్ట్ర అంగీకరించిందని, అయితే అంత తక్కువ ఎత్తున బ్యారేజీ నిర్మిస్తే ఆశించినంత నీటిని తెచ్చుకొనే వీల్లేదని ప్రభుత్వం భావిస్తోంది. అందుకే 152 మీటర్ల ఎత్తున బ్యారేజీ నిర్మాణానికి మహారాష్ట్ర ప్రభుత్వాన్ని ఒప్పించేందుకు సిద్ధమవుతోంది. అందుకు అవసరమైన సాంకేతిక నివేదికలు, నీటి లభ్యత, ముంపు విస్తీర్ణం, ఇతర అంశాలకు సంబంధించిన పూర్తి వివరాలను సిద్ధంగా ఉంచాలని ఇప్పటికే అధికారులకు సూచించారు. మహారాష్ట్రతో చర్చల సందర్భంగా తెలంగాణ నీటి అవసరాలు, వాదనలను సమర్థవంతంగా వివరించనున్నారు.

# కన్నెపల్లి నుంచి నీళ్లు ఎత్తిపోయలేం

2025 ఏప్రిల్‌లో మేడిగడ్డపై ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ఇచ్చింది. మేడిగడ్డ తరహాలోనే అన్నారం, సుందిళ్లలోనూ పరిస్థితి ఉందని చెప్పింది. ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక ప్రకారం మూడు బ్యారేజీలను ఖాళీ చేయాలని నిర్ణయించాం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో నీరు నిలుపవద్దని ఎన్‌డీఎస్‌ఏ తుది నివేదిక చెప్పింది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అనేక లోపాలు ఉన్నాయని స్పష్టం చేసింది. మూడు బ్యారేజీల్లోనూ ఫౌండేషన్‌లో లోపాలు ఉన్నాయని చెప్పింది. ఫౌండేషన్ విషయంలో డీపీఆర్‌లో ఒకటి రాశారు.. నిర్మాణంలో మరొకటి చేశారు. బ్యారేజీల నిర్మాణంలో సీకెంట్ ఫైల్స్ వాడారు. అందువల్లే సమస్యలు తలెత్తాయి. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్లలో గేట్లు మూయవద్దని ఎన్‌డీఎస్‌ఏ చెప్పింది. బ్యారేజీల గేట్లు మూయకుంటే పంపులు రన్ చేసే అవకాశమే లేదు. కన్నెపల్లి నుంచి నీరు ఎత్తిపోయాలని బీఆర్‌ఎస్ నేతలు అవగాహన లేకుండా మాట్లాడుతున్నారు. బ్యారేజీ నిర్మాణానికి ఎంత కాంక్రీట్ అవసరమైందో.. అంత కాంక్రీట్ మరమ్మతులకు అవసరం” అని ఉత్తమ్ వివరించారు.

## కన్నెపల్లిని పరిశీలించండి

మీ దగ్గరుందా..? అని అడిగితే.. ఏం ప్రాబ్లమ్ లేదు.. అంతా బాగా చేస్తం. కొన్ని రోజులు ఇబ్బంది అయితదని చెప్పిర్రు. కానీ ఇబ్బంది కాకపోవడంతో ఆ రోజు జలమండలిని ముట్టడించి వాళ్లకు ఆరోజు సూచనలు చేశాం. మీరు మేడిగడ్డ నుంచి కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి హైదరాబాద్‌కు పంపింగ్ చేసుకుంటే సిస్టమ్ రెడీగా కేవలం బటన్ ఒత్తితే హైదరాబాద్‌కు నీళ్లొస్తయని చెప్పినం. సంవత్సరానికి 10 టీఎంసీల నీళ్లు హైదరాబాద్‌కు సరిపోతయి. మొత్తం హైదరాబాద్ నీటి సమస్య తీరుతదని చెప్పాం. కానీ ఈ రోజుకు కూడా అది అసలు వాడుకోలేదు.కన్నెపల్లి వద్ద మోటార్లు ఆన్ చేస్తే హైదరాబాద్‌కు నీళ్లు వచ్చేవి.. కానీ ఆన్ చేయలేదన్నారు.కన్నెపల్లి నుండి నీటిని లిఫ్ట్ చేసి ఉంటే హైదరాబాద్‌కు తాగునీటి సమస్య, శ్రీరాంసాగర్, నిజాంసాగర్ ఆయకట్టు కింద ఉన్న 20 లక్షల ఎకరాలకు సాగునీటి సమస్య వచ్చేది కాదన్నారు. మేడిగడ్డ వద్ద బాంబ్ బ్లాస్ట్ జరిగిన శబ్దం వచ్చిందని అధికారి కంప్లైంట్ ఇస్తే దాని మీద ఇప్పటివరకు విచారణ జరపలేదు. కుట్రతో బాంబ్ పెట్టి మేడిగడ్డ పిల్లర్లు పగలగొట్టారనే అనుమానాలు ఉన్నాయని అన్నారు.




# హైదరాబాద్ నగరం అత్యంత సురక్షితం

## ముఖ్యమైన పరిశోధనా సంస్థలకు నిలయం

- భారతదేశంలో ఒక వ్యూహాత్మకమైన ప్రదేశంగా కీలకమైన స్థానంలో నగరం
- సముద్రతీరం లేకున్నా భారత నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోంది
- రక్ష ఎక్స్‌పో కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

'తెలంగాణలో పెట్టుబడులపై మీ ప్రణాళికలను రెట్టింపు చేయండి. మీ లక్ష్య సాధనలో సహకరించడానికి నేను సిద్ధంగా ఉన్నా. తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చాలి. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలి. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 2047 నాటికి 10 శాతం సాధించాలన్నది నా లక్ష్యం. రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉన్నా పెట్టుబడుల విషయంలో లేవు. త్వరలోనే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 విడుదల చేయబోతున్నాం. రక్షణ రంగంలో దేశాన్ని అగ్రగామి శక్తిగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేద్దాం - సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌లో పాల్గొనాలని ఆహ్వానిస్తున్నామన్న సీఎం రేవంత్ రెడ్డి అంతర్జాతీయ వేదికగా రక్షా ఎక్స్‌పోను తీర్చిదిద్దాలన్నది తన ఆలోచన తెలిపారు. హైదరాబాద్ ఒక వ్యూహాత్మకమైన ప్రదేశంగా కీలకమైన స్థానంలో ఉందని, హైదరాబాద్ అత్యంత సురక్షితమైన నగరమని, సముద్రం లేకపోయినా నౌకాదళానికి రాష్ట్రం కీలకమైన సేవలు అందిస్తోందని స్పష్టం చేశారు. ఫలక్‌నుమా ప్యాలెస్‌లో ఏర్పాటు చేసిన రక్ష ఎక్స్‌పో-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.ఐటీఐలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్లుగా తీర్చిదిద్దామని, రక్షణ రంగంలో అగ్రగామిగా భారతదేశాన్ని చూడాలన్నది తమ ఆకాంక్ష అని, రక్షణ సాంకేతిక ఎగుమతులు చేసే దేశంగా భారత్ ఎదగాలని తెలిపారు. రక్షణ పరిశ్రమకు తెలంగాణ అతిపెద్ద పారిశ్రామిక కేంద్రంగా ఎదగాలని పేర్కొన్నారు.”తెలంగాణలో పెట్టుబడులపై మీ ప్రణాళికలను రెట్టింపు చేయండి. మీ లక్ష్య సాధనలో సహకరించడానికి నేను సిద్ధంగా ఉన్నా. తెలంగాణను 2034 నాటికి ట్రిలియన్ డాలర్ల ఆర్థిక శక్తిగా మార్చాలి. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దాలి. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 2047 నాటికి 10 శాతం సాధించాలన్నది నా లక్ష్యం. రాజకీయంగా భేదాభిప్రాయాలు ఉన్నా పెట్టుబడుల విషయంలో లేవు. త్వరలోనే ఏరోస్పేస్ అండ్ డిఫెన్స్ పాలసీ 2.0 విడుదల చేయబోతున్నాం. రక్షణ రంగంలో దేశాన్ని అగ్రగామి శక్తిగా తీర్చిదిద్దేందుకు కలిసి పనిచేద్దాం” అని అన్నారు.తెలంగాణ గ్లోబల్ సమిట్-2026లో భాగంగా డిసెంబరు 7, 8, 9 తేదీల్లో హైదరాబాద్‌లో భారీ స్థాయిలో రక్షా ఎక్స్‌పోను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించనుంది. ఈ సందర్భంగా ఫలక్‌నుమా ప్యాలెస్‌లో రక్ష ఎక్స్‌పో-2026 కర్టెన్ రైజర్ కార్యక్రమం నిర్వహించారు.

# వారాంతంలో ఇరాన్‌పై మరో 'ఎపిక్ ఫ్యూరీ'

కానీ, ఆ దాడుల వ్యాఖ్యల గురించి నాకు ఏమీ తెలియదు” అని అధ్యక్షుడు వ్యాఖ్యానించారు. అయితే, ఇప్పుడు స్వయంగా ట్రంప్ దాడుల గురించి హింట్ ఇవ్వడం గమనార్హం. దీంతో పశ్చిమాసియాలో మళ్లీ పరిస్థితులు ఉత్కంఠగా మారాయి.

## నిప్పుతో చెలగాటమాడొద్దు

వేటినీ వదలబోం” అని పేర్కొంది.ఈ ఏడాది ఫిబ్రవరి 28న ఆపరేషన్ ఎపిక్ ఫ్యూరీ పేరిట అమెరికా దాడులు చేసిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి పశ్చిమాసియాలో ఏదో ఒక రూపంలో ఘర్షణలు కొనసాగుతూనే ఉన్నాయి. చమురు సరఫరాకు అంతరాయాలు ఏర్పడటంతో ప్రపంచాన్ని ఇంధన వ్యయాల భయాలు వెంటాడుతున్నాయి.

# ట్రంప్ నోట మళ్లీ అదే పాట



వాషింగ్టన్(జనంసాక్షి): అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మళ్లీ పాత పాటే పాడారు. అణ్వాయుధాలు కలిగిన భారత్, పాకిస్థాన్ మధ్య యుద్ధాన్ని తానే ఆపానంటూ గొప్పలుపోయారు. అంతేకాకుండా ప్రపంచ వ్యాప్తంగా 8 యుద్ధాలను ఆపానని చెప్పుకొచ్చారు. అమెరికాలో మధ్యంతర ఎన్నికల సందర్భంగా ఫ్లోరిడాలో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా 'ఆపరేషన్ సిందూర్' అంశాన్ని ప్రస్తావించారు. గతేడాది ఏప్రిల్ 22న పహల్గామ్ ఉగ్రదాడికి ప్రతీకారంగా.. పాకిస్థాన్‌లోని ఉగ్రస్థావరాలపై మే 2025లో భారత్ ప్రతీకార దాడులు చేసిన సంగతి తెలిసిందే. ఐక్యరాజ్య సమితి నుంచి ఎలాంటి సహకారం లేకపోయినా.. యుద్ధాన్ని నిలువరించినట్లు చెప్పుకొచ్చారు.ఐక్యరాజ్యసమితికి ఒక్క ఫోన్ కాల్ కూడా చేయకుండా.. కేవలం దౌత్యపరమైన మార్గాల ద్వారానే ప్రపంచ వ్యాప్తంగా 8 యుద్ధాలను నిలువరించానని, అయినా నోబెల్ శాంతి బహుమతి రాలేదని నిరాశ వ్యక్తం చేశారు. మరోవైపు పాకిస్థాన్ విషయంలో మూడో దేశం జోక్యాన్ని భారత్ ఎప్పటికప్పుడు ఖండిస్తూనే ఉంది. ఆపరేషన్ సిందూర్ సమయంలోనూ అమెరికా మధ్యవర్తిత్వం ఏమీ లేదని ఇప్పటికే పలుమార్లు స్పష్టం చేసింది. పాకిస్థాన్ అభ్యర్థన మేరకు.. ఇరు దేశాల సైనిక ఉన్నతాధికారులు జరిపిన చర్చలు సఫలం కావడంతో మిలిటరీ చర్యను నిలిపివేసినట్లు పేర్కొంది. అయితే, ట్రంప్ మాత్రం ఈ అంశాన్ని తనకు అనుకూలంగా మార్చుకునేందుకు తాపత్రయపడుతున్నారు.

# అల్లూరి జిల్లాలో భారీ విషాదం

## లారీలో నిల్వచేసిన జిలెటిన్ స్టిక్స్ పేలి ఏడుగురి మృతి

అనంతగిరి (జనంసాక్షి): అల్లూరి జిల్లాలో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. అనంతగిరి మండలం పినకోట వద్ద రోడ్డు పనుల కోసం బ్లాస్టింగ్ చేపడుతున్నారు. ఇందు కోసం జిలెటిన్ స్టిక్స్‌ను నిర్వాహకులు తెప్పించారు. రోడ్డు పనుల కోసం వినియోగిస్తున్న లారీలో వీటిని ఉంచారు. ఆ వాహనంలో డీజిల్ నింపుతుండగా మంటలు చెలరేగాయి. మంటలు అంటుకుని జిలెటిన్ స్టిక్స్ పేలాయి. దీంతో అక్కడున్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. పేలుడు ధాటికి రెండు వాహనాలు ధ్వంసమయ్యాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్, ఐదుగురు కార్మికులు మృతి చెందగా.. అటు వైపుగా వెళ్తున్న ఓ టీచర్ కూడా ప్రాణాలు కోల్పోయారు. అధికారులు, పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. మృతులను టీచర్ సునీత(విశాఖ), మణి (దేవరాపల్లి), నారాయణ రావు(చీడ



కాడ), పవన్ కుమార్(కడప)గా గుర్తించారు. మిగిలిన వారి వివరాలు తెలియాల్సి ఉంది.ఈ ఘటనపై హోంమంత్రి అనిత స్పందించారు. అల్లూరి జిల్లా కలెక్టర్, ఎస్పీతో ఫోన్‌లో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

తెలంగాణ ప్రభుత్వం
ఫారం-VII
రూఢీ ప్రకటన

నెం.: 96/2026 తేది: 16.10.2026
నెం.: G/683/2023 తేది: 14.10.2026

(భూసేకరణ పునరుపాధి, పునరావాస కల్పనలో పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టము 2013 (కేంద్ర చట్టం 30/2013) యొక్క సెక్షన్ 19(1) మరియు రాష్ట్ర రూల్ 25(1)న నుసరించి)

తెలంగాణ ప్రభుత్వం/శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తిగారు ప్రజా ప్రయోజనార్థం అవసర నిమిత్తం 'RBLISP-RBLI-Package No.17లోని రంగసముద్రం బలేన్సింగ్ రిజర్వాయర్' నిర్మాణం కొరకు వనపర్తి జిల్లా, శ్రీరంగాపూర్ మండలములోని నాగరాల రెవెన్యూ గ్రామ పరిధిలో ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదాహరించిన భూమి 1986చ.మీ గల గ్రామకంఠంలోని లోని ఖాళీ స్థలం పట్టా/ప్రభుత్వ భూములు సేకరించనైనది.

పైన పేర్కొన్న ప్రాజెక్టు కోసం వనపర్తి జిల్లా మరియు శ్రీరంగాపూర్ మండలములోని నాగరాల గ్రామము పరిమితిలో గల ప్రామాణిక కొలత కంటే ఎక్కువ లేదా తక్కువ 1986చ.మీ గల గ్రామకంఠంలోనిలోని ఖాళీ స్థలం కొలిచే డివిజన్ భూమి, భూసేకరణ ద్వారా సేకరణ చేసే భూముల వివరములు క్రింది విధంగా గలవు.

షెడ్యూల్

గ్రామం : నాగరాల మండలం : శ్రీరంగాపూర్ జిల్లా : వనపర్తి

| క్ర. సం. | RS BR నెం. | భూమి స్వభావం | భూమి వర్గీకరణ | భూసేకరణచేయు ప్రతిపాదిత భూ విస్తీర్ణం చ.మీ | పట్టాదారు/అనుభవదారు పేరు మరియు తండ్రి / భర్త పేరు | చెట్లు/బోర్/పైప్‌లైన్ & ఇతరములు |
|---|---|---|---|---|---|---|
| 1 | 302 | పట్టా | మెట్ట | 84 | కే.రాధమ్మ తండ్రి రంగన్న | - |
| 2 | OS | పట్టా | మెట్ట | 634 | కే.ధర్మేందర్ తండ్రి నారాయణ | - |
| 3 | OS | పట్టా | మెట్ట | 634 | కుడుకుంట్ల హేమ శ్రీ తండ్రి కే.ధర్మేందర్ | - |
| 4 | OS | పట్టా | మెట్ట | 634 | కుడుకుంట్ల భరత్ కుమార్ తండ్రి కే.ధర్మేందర్ | - |
| మొత్తం విస్తీర్ణం ఎ-గు | | | | 1986చ.మీ | | |

సెక్షన్ 15 (కేంద్ర చట్టం 30/2013) ప్రకారం సంబంధిత భూమి యజమానుల/ఆసక్తి కలిగిన వారి నుండి వచ్చిన అభ్యంతరాలను పరిశీలించిన పిదప, సెక్షన్ 19(1) ప్రకారం రూఢీ ప్రకటన (డిక్లరేషన్) జారీ చేయునైనది. ఇట్టి భూసేకరణ కారణంగా పునరావాసం కల్పించవలసిన కుటుంబాలు ఉన్నాయి.

భూసేకరణలోని సదరు ప్రాజెక్ట్ యొక్క నిర్మాణ సమయంలో భూమిలో, బొగ్గు, ఇనుము, స్లెట్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూమిలలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్ట్‌కు నిర్మాణములకు ఉపయోగితమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును లేనిచో స్వీకరించబడవు.

భూమి యొక్క ప్లాన్ మరియు వివరములు శ్రీయుత జిల్లా కలెక్టర్, వనపర్తి/భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్, (భూసేకరణ), ఆర్.ఎల్.ఐ.ఎస్.పి-2, పెబ్బేర్, హెడ్ క్వార్టర్ ఐ.డి.ఓ.సి, వనపర్తి గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములలో కార్యాలయ పని వేళలలో పరిశీలించుకోవచ్చును.

సం/- ప్రత్యేక ఉప కలెక్టర్ భూసేకరణ ఆర్.ఎల్.ఐ.ఎస్.పి., యూనిట్-2, పెబ్బేర్.
సం/- అదనపు కలెక్టర్, వనపర్తి
సం/- జిల్లా కలెక్టర్, వనపర్తి

DIPR RO.NO: 1075/LA/PP/Advt/Pub/2026-27

## 'ఎక్స్'లోకి సోనియా

వీడియోలో చూపించారు.“ఆ రోజుల్లో ఇంగ్లాండ్‌లో ఆహారం అంత బాగుండేది కాదు. ఇప్పుడు ఉన్నన్ని రెస్టారంట్లు ఉండేవి కావు. అందుకే ఇటాలియన్ ఆహారం కోసం వెతుకుతూనే ఉండేదాన్ని. ఎట్టకేలకు ఒక గ్రీక్ రెస్టారంట్ దొరికింది. అక్కడకు ఐరోపా, భారతీయ విద్యార్థులు వస్తుండేవారు. అక్కడే కామన్ ఫ్రెండ్ ద్వారా రాజీవ్ తో పరిచయం ఏర్పడింది. తొలిసారి రాజీవ్‌ను చూడగానే ఆయనే నాకు తగినవాడు అనే భావన కలిగింది. ఆయనకు కూడా అలాగే అనిపించిందని తర్వాత నాకు అర్థమైంది. అలా మా పరిచయం స్నేహంగా, తర్వాత ప్రేమగా మారింది. ఆయన అందగాడే.. కానీ సౌమ్యంగా ఉండే మనస్తత్వమే నన్ను ఆకర్షించింది. అందుకే రాజీవ్‌ను తొలిసారి కలిసిన క్షణాన్ని ఎప్పటికీ మర్చిపోను” అని చిరునవ్వులు చిందించారు సోనియా..

## భర్త మరో మహిళతో సంబంధం పెట్టుకోవడం క్రూరత్వం కాదు : మద్రాస్ హైకోర్టు

చెన్నై(జనంసాక్షి):భర్త మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకోవడం భార్యపై క్రూరత్వం చూపడం కాదని మద్రాస్ హైకోర్టు తెలిపింది. బిడ్డతో కలిసి భార్య ఆత్మహత్య చేసుకున్న కేసులో భర్తను విడుదల చేయడాన్ని సవాలు చేస్తూ ఆ మహిళ సోదరుడు దాఖలు చేసిన అప్పీల్‌ను న్యాయమూర్తి జస్టిస్ సుందర్ మోహన్ విచారించారు. ఈ కేసులో రెండో ప్రతివాదికి వివాహేతర సంబంధం ఉందని రుజువైందని, వాస్తవాల ప్రాతిపదికన ఆ బంధం భార్యను ఆత్మహత్యకు ప్రేరేపించే స్వభావం ఉన్నది కాదని న్యాయస్థానం భావిస్తోందని తెలిపారు. ఇలాంటి కేసుల్లో భారతీయ శిక్షాస్మృతి సెక్షన్ 498ఏ కింద వివాహేతర సంబంధాన్ని తీవ్రమైన నేరంగా నిరూపించాల్సి ఉంటుందని, కానీ, అలా జరగలేదన్నారు. 2008లో వివాహం జరగ్గా వరకట్నం కోసం భర్త.. తన భార్యను చిత్రహింసలకు గురి చేశాడని సదరు మహిళ తరపు న్యాయవాది కోర్టు దృష్టికి తెచ్చారు. మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని, బిడ్డను పట్టించుకోకపోవడంతో ఏడాదిన్నర బిడ్డతో మహిళ ఆత్మహత్య చేసుకోవడంలో భర్త ప్రధాన నిందితుడని వాదనలు వినిపించారు. భార్యపై క్రూరత్వం చూపి ఆమెను ఆత్మహత్యకు ప్రేరేపించారన్నందుకు ఆధారాల్లేవని ట్రయల్ కోర్టు భర్తను విడుదల చేసిందన్నారు.

# హైదరాబాద్ చెరువులకు మహర్దశ

కమిషనర్ ఏవీ రంగనాథ్ పరిశీలించారు. చెరువుల కట్ట చుట్టూ తిరుగుతూ కాలిబాటలు, పార్కులు, ఓపెన్ జిమ్‌లు, బోటింగ్ సదుపాయాలను తనిఖీ చేశారు. పనుల పురోగతిని సమీక్షించి, ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ రెండు చెరువులను నెలాఖరున లేదా నవంబర్ మొదటి వారంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

### బెంగళూరు నమూనాలో అభివృద్ధి పనులు

బెంగళూరు నమూనాను అనుసరిస్తూ హైదరాబాద్ నగర అవసరాలకు అనుగుణంగా హైడ్రా చెరువులను అభివృద్ధి చేస్తోంది. చెరువుల చుట్టూ విశాలమైన కట్టలు నిర్మించడంతోపాటు వాటి పొడవునా పూల మొక్కలు, కాలిబాటలు, కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రజలు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆహ్లాదకరమైన వాతావరణంలో నడక సాగించేందుకు వీలుగా పార్కులు, ఇతర సౌకర్యాలను కల్పిస్తున్నారు. అలాగే చెరువుల్లోకి వరద నీరు చేరే ప్రాంతాల్లో పైపులైన్లు ఏర్పాటు చేసి, సెడిమెంటేషన్ ప్లాంట్ల ద్వారా నీటిలోని మట్టి, మలినాలను తొలగించే ప్రయత్నం చేస్తున్నారు.

### నీటి నిల్వ సామర్థ్యం పెంపుపై దృష్టి

అంబర్‌పేట బతుకమ్మకుంట, కూకట్‌పల్లి నల్లచెరువు, బమ్‌రుఖ్‌నుద్దౌలా చెరువుల్లో ఈ విధానం మంచి ఫలితాలనిచ్చినట్లు అధికారులు చెబుతున్నారు. ఉప్పల్ నల్ల చెరువులోనూ వరద నీరు చేరడంతో నీటి కళ సంతరించుకుంది. మరోవైపు చెరువుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించడం ద్వారా నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచుతున్నారు. కొన్ని చెరువుల్లో మూడు నుంచి ఐదు మీటర్ల లోతు వరకు పూడికను తొలగిస్తున్నారు.

### హైటెక్‌సిటీ ప్రాంతానికి పర్యావరణ ఉపశమనం

మాదాపూర్‌లోని తమ్మిడికుంట, సున్నం చెరువులు స్థానికంగా కీలకమైన జలవనరులు. వీటిలోని బోరుబావుల నుంచి హాస్టళ్లు, వాణిజ్య భవనాలకు ప్రైవేటు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేసేవారు. అయితే ఆక్రమణల తొలగింపు అనంతరం నిర్వహించిన నీటి పరీక్షల్లో ప్రమాదకర స్థాయిలో భార లోహాలు ఉన్నట్లు తేలడంతో అధికారులు నీటి పరీక్షల్లో ప్రమాదకర స్థాయిలో భార లోహాలు ఉన్నట్లు తేలడంతో అధికారులుఆయా బోరుబావులను మూసివేశారు. చెరువుల్లోని మురుగు, చెత్తను తొలగించి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ రెండు చెరువులను పర్యాటక కేంద్రాలుగా తీర్చిదిద్దడం ద్వారా స్థానికులకు ఆహ్లాదకరమైన వాతావరణం అందించడంతోపాటు నగర పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని హైడ్రా లక్ష్యంగా పెట్టుకుంది.

# నీటి వృథాకు పాల్పడితే రూ.5 వేల జరిమానా

## హైదరాబాద్‌లో తాగునీటి వృథాపై కఠిన చర్యలకు జలమండలి నిర్ణయం

## నీరు, విద్యుత్ వినియోగాన్ని తగ్గించేలా చర్యలు

హైదరాబాద్(జనంసాక్షి): హైదరాబాద్ నగరంలో తాగునీటి వృథాపై జలమండలి కఠిన చర్యలు చేపట్టాలని నిర్ణయించింది. జలమండలి ట్యాంకర్ల ద్వారా జరిగే నీటి వృథాపై ఆగ్రహం వ్యక్తం చేసిన ఎండీ అశోక్ రెడ్డి, వృథాను నివారించేందుకు ప్రత్యేక మార్గదర్శకాలను జారీ చేశారు. ట్యాంకర్ల ద్వారా నీటి వృథాకు పాల్పడితే నవంబర్ 1 నుంచి సంబంధిత ట్యాంకర్ యజమానికి రూ.5 వేల జరిమానా విధిస్తామని హెచ్చరించారు. అదే ట్యాంకర్ రెండో సారి నిబంధనలు ఉల్లంఘిస్తే, రిజిస్ట్రేషన్ రద్దు చేస్తామని స్పష్టం చేశారు. నీటి లీకేజీలు, మూతలు లేని ట్యాంకర్లను ఫిల్లింగ్ స్టేషన్ల వద్ద ఉపయోగించవద్దని అధికారులను అశోక్ రెడ్డి ఆదేశించారు.ట్యాంకర్లపై మూతలు సరిగా లేకపోవడం వల్ల రవాణా సమయంలో నీరు రోడ్డుపై వృథాగా పోతున్నట్లు జలమండలి గుర్తించింది. ఈ నేపథ్యంలో ట్యాంకర్లలో నీటిని నింపడం, రవాణా సమయంలో తప్పనిసరిగా పాటించాల్సిన నిబంధనలు అమలు చేయాలని ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్ విభాగాల జనరల్ మేనేజర్లను ఆదేశించారు. ట్యాంకర్లలో నీటిని నింపే ముందు లీకేజీలు, మూతల పరిస్థితిని పరిశీలించాలని, లోపాలను గుర్తిస్తే వాటిని సరిచేసే వరకు నీటిని నింపరాదని స్పష్టం చేశారు. ఈ విషయంలో ట్యాంకర్ల యజమానులు, డ్రైవర్లు బాధ్యతగా వ్యవహరించాలని ఎండీ అశోక్ రెడ్డి సూచించారు.ఎల్‌నినో కారణంగా నీటి ఎద్దడి, తీవ్రమైన తాగునీటి కొరతను అధిగమించడం కోసం హైదరాబాద్ జలమండలి కఠినమైన నిర్ణయాలు తీసుకుంటోంది. జలమండలి పరిధిలోని అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ వినియోగాన్ని కనీసం 20% మేర తగ్గించేలా చర్యలు చేపట్టాలని ఎండీ అశోక్ రెడ్డి అధికారులను ఆదేశించారు. నీటి పొదుపును ప్రజా ఉద్యమంగా మార్చాలంటే, ముందుగా జలమండలి కార్యాలయాల్లోనే ఆచరణలో పెట్టాలని సూచించారు. ఈ మేరకు అన్ని కార్యాలయాల్లో నీరు, విద్యుత్ పొదుపునకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. జలమండలి కార్యాలయాల్లో ఎయిర్ కండిషనర్ల ఉష్ణోగ్రతను తప్పనిసరిగా 25 డిగ్రీల సెల్సియస్ వద్దే



ఉంచాలని, సాయంత్రం 5 గంటల తర్వాత ఏసీల వినియోగాన్ని నిలిపివేయాలని స్పష్టం చేశారు. ఏసీల నుంచి వెలువడే నీటిని వృథాగా పోనివ్వకుండా సేకరించి మొక్కల పెంపకం, శుభ్రత, తాగునీరు అవసరం లేని పనులకు పునర్వినియోగించాలని సూచించారు.

## అక్రమ నీటి దందాపై హైడ్రా కొరడా

హైదరాబాద్(జనంసాక్షి): మాదాపూర్‌లోని సున్నం చెరువు పరిధిలో అక్రమ నీటి దందాపై హైడ్రా చర్యలు చేపట్టింది. అక్రమ బోర్లను హైడ్రా సిబ్బంది తొలగిస్తున్నారు. బస్తీ ఇళ్లలో గుట్టుగా బోర్లు వేసి.. భారీ పైపుల నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేశారు. ట్యాంకర్ల ద్వారా ఇక్కడి నుంచి నీటి సరఫరా చేస్తున్నారు. ప్రమాదకర లోహాలు ఉన్న నీటిని వాటర్ మాఫియా విక్రయిస్తోంది. దీంతో ఆ వాటర్ మాఫియాపై హైడ్రా చర్యలు చేపట్టింది. పైప్‌లైన్ నెట్‌వర్క్‌ను ధ్వంసం చేసింది.

# సల్మాన్‌ను పొగడటం వల్లే టైగర్ ష్రాఫ్‌పై కాల్పులు

ముంబై(జనంసాక్షి): బాలీవుడ్ నటుడు టైగర్ ష్రాఫ్‌పై కాల్పుల ఘటన ఇండస్ట్రీలో సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనలో రోజుకో కొత్త విషయం వెలుగులోకి వస్తోంది. 2022లో ఓ సినిమా ప్రమోషన్ సందర్భంగా టైగర్ ష్రాఫ్ సల్మాన్ ఖాన్‌ను ప్రశంసించడమే ఈ కాల్పులకు కారణంగా తెలుస్తోంది. ఈ మేరకు నిందితుల్లో ఒకరు పోలీసుల విచారణలో వెల్లడించినట్లు జాతీయ మీడియా కథనం పేర్కొంది.ఒక సినిమా ప్రచార కార్యక్రమంలో సల్మాన్ గురించి ష్రాఫ్ మాట్లాడుతూ.. “టైగర్ అనే పేరు ఎంత మందికైనా ఉండొచ్చు. కానీ, ఇండస్ట్రీలో మాత్రం ఒక్కరే టైగర్. ఆయనే సల్మాన్ ఖాన్” అని వ్యాఖ్యానించాడని నిందితుడు తెలిపినట్లు సమాచారం. ఆ వ్యాఖ్యల కారణంగానే అతడిని లక్ష్యంగా చేసుకున్నామని విచారణలో చెప్పినట్లు తెలుస్తోంది. ఇక, ఈ కేసులో నిందితుల బ్యాంక్ ఖాతాలపై పోలీసులు దృష్టి పెట్టారు. ఇప్పటివరకు అనుమానిత లావాదేవీలకు సంబంధించి ఆరు బ్యాంకు ఖాతాలను గుర్తించి పరిశీలిస్తున్నారు. ఈ నగదు బదిలీలు నేరుగా కాకుండా, మూడు వేర్వేరు దశల ద్వారా నిందితులకు చేరినట్లు దర్యాప్తు అధికారులు గుర్తించారు. రాజస్థాన్‌లోని కోటా రైల్వే స్టేషన్ వద్ద రైలులో ప్రయాణిస్తోన్న సమయంలో నిందితులను అరెస్ట్ చేసిన సంగతి తెలిసిందే. కాల్పుల అనంతరం పోలీసుల నుంచి తప్పించుకునేందుకు వీరు ఫోన్లు స్విచ్ ఆఫ్ చేశారు. కమ్యూనికేషన్ కోసం వాయిస్ ఓవర్ ఇంటర్నెట్ ప్రోటోకాల్స్‌ను ఉపయోగించి ఉంటారని పోలీసులు అనుమానిస్తున్నారు.మరోవైపు కాల్పుల ఘటన తర్వాత సినిమా సెట్లలో భద్రతను కఠినతరం చేయాలని ఫెడరేషన్ ఆఫ్ వెస్ట్రన్ ఇండియా సినీ ఎంప్లాయిస్ నిర్మాతలకు విజ్ఞప్తి చేసింది. షూటింగ్‌లలో ప్రముఖులు, సాంకేతిక నిపుణులు, నటుల భద్రతకు ప్రాధాన్యమివ్వాలని కోరింది. అధికారిక గుర్తింపు లేని వ్యక్తులను సిబ్బందిగా నియమించవద్దని హెచ్చరించింది.

## భైంసా డివిజన్‌లో దొంగల ముఠా అరెస్ట్

- ఐదుగురు పట్టివేత
- ఆలయాలు, ఇళ్లలో వరుస చోరీలకు పాల్పడిన ముఠా గుట్టురట్టు
- 170 తులాల వెండి, 13 గ్రాముల బంగారం, రూ.22 వేల నగదు స్వాధీనం



భైంసా, అక్టోబర్ 24 (జనంసాక్షి) : నిర్మల్ జిల్లా భైంసా డివిజన్ పరిధిలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్న ఐదుగురు సభ్యుల ముఠాను భైంసా రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. భైంసా, లోకేశ్వరం మండలాల్లోని ఆలయాలు, ఇళ్లలో చోరీలకు పాల్పడుతూ స్థానికులను భయాందోళనలకు గురిచేస్తున్న ముఠాను పోలీసులు పట్టుకున్నారు. నిందితుల నుంచి 170 తులాల వెండి, 13 గ్రాముల బంగారం, రూ.22 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్పీ జానకి షర్మిల ఆదేశాల మేరకు, ఏఎస్పీ సాయి కిరణ్ పర్యవేక్షణలో భైంసా రూరల్ పోలీసులు ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించారు. వరుస చోరీలపై దర్యాప్తు చేపట్టి ఐదుగురు నిందితులను అరెస్ట్ చేసి, వారి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నారు. డివిజన్ పరిధిలో దొంగల ముఠా పట్టుబడటంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. వరుస చోరీలకు అడ్డుకట్ట పడటంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## జూబ్లీహిల్స్-ఎన్ఎఫ్‌సీఎల్ కారిడార్ పనులు వేగవంతం చేయాలి

- సిగ్నల్ రహిత ట్రాఫిక్ కోసం జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ ఆదేశాలు



హైదరాబాద్ (జనంసాక్షి) : జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు సిగ్నల్ రహిత ట్రాఫిక్ సౌకర్యం కల్పించేందుకు చేపట్టిన 4.3 కిలోమీటర్ల ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి. కర్ణన్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రాజెక్టు పురోగతిని ఆయన సీనియర్ అధికారులతో కలిసి సమీక్షించారు. కేబీఆర్ పార్కు పరిసరాల్లో వన్‌వే ట్రాఫిక్ వ్యవస్థను క్రమబద్ధీకరిం చేందుకు పార్కు ప్రధాన ప్రవేశ ద్వారం, అగర్సేన్ జంక్షన్, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని సూచించారు. కేబీఆర్ పార్కు చుట్టూ విద్యుత్ తదితర మౌలిక సదుపాయాల మార్పిడి కోసం టీజీఎస్‌పీడీసీఎల్‌తో తక్షణమే సమన్వయం చేసుకోవాలని ఆదేశించారు. ముగ్ధ జంక్షన్ నుంచి ఎన్ఎఫ్‌సీఎల్ జంక్షన్ వరకు ఫౌండేషన్ రూపకల్పనకు అవసరమైన భూగర్భ సాంకేతిక పరిశోధనలను వేగవంతం చేయాలని కమిషనర్ స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ నుంచి ముగ్ధ జంక్షన్ మధ్య పునాదుల తవ్వకాలు, నిర్మాణానికి అవసరమైన ఉక్కు భాగాల తయారీ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.

## నిజామాబాద్ జిల్లా అభివృద్ధి పనులపై సీఎంతో భేటీ



- రైల్వే బ్రిడ్జిలకు నిధుల మంజూరుకు సీఎం అంగీకారం
- మాదానగర్ రైల్వే బ్రిడ్జి, ఆర్సపల్లి ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు నిధులపై చర్చ

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారు సుదర్శన్ రెడ్డి సమావేశమయ్యారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు నగేష్ రెడ్డి, నిజామాబాద్ జిల్లాకు చెందిన పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నిజామాబాద్ జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, పెండింగ్‌లో ఉన్న పలు ప్రాజెక్టుల పురోగతిపై చర్చించి సమీక్షించారు. ముఖ్యంగా నిజామాబాద్ జిల్లాలోని మాదానగర్ రైల్వే బ్రిడ్జి, ఆర్సపల్లి ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు అవసరమైన నిధుల కేటాయింపు అంశాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే ప్రజలకు రవాణా సౌకర్యాలు మెరుగుపడటంతో పాటు, ట్రాఫిక్ సమస్యలు గణనీయంగా తగ్గుతాయని నేతలు వివరించారు. నేతల విజ్ఞప్తులపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాదానగర్ రైల్వే బ్రిడ్జి, ఆర్సపల్లి ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలకు నిధుల మంజూరుకు అంగీకారం తెలిపినట్లు పేర్కొన్నారు. ఈ రెండు బ్రిడ్జిల నిర్మాణం పూర్తయితే నిజామాబాద్ జిల్లా ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు అందుబాటులోకి రావడంతో పాటు, ఆయా ప్రాంతాల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది.

## పోచంపల్లి చేనేత వారసత్వానికి పర్యాటక ప్రోత్సాహం



భూదాన్ పోచంపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి) : పోచంపల్లి ఇక్కత్ చేనేత వారసత్వాన్ని ప్రపంచానికి పరిచయం చేయడంతో పాటు గ్రామీణ సాంస్కృతిక పర్యాటకాన్ని అభివృద్ధి చేసే లక్ష్యంతో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి మార్గద ర్శకత్వంలో పోచంపల్లి ఎక్స్‌పీరియన్స్ టూర్స్ కార్యక్రమాన్ని నిర్వహి స్తున్నారు. నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అర్బన్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో చేపడుతున్న కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హైదరాబాద్ హెరిటేజ్ బృందానికి చెందిన సుమారు 30 మంది శనివారం పోచంపల్లిని సందర్శించారు. ఈ సందర్భంగా ఇక్కత్ మ్యూజియాన్ని సందర్శించి చేనేత వస్త్రాల తయారీ విధానం, చేనేత కార్మికుల నైపుణ్యాలను తెలుసుకున్నారు. స్థానిక చేనేత దుకాణాలు, వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి తెలంగాణ సంప్రదాయ భోజనాన్ని ఆస్వాదించారు. శిక్షణ పొందిన స్థానిక పర్యాటక మార్గదర్శకులు సాగర్, శ్వేత సందర్శకులకు పోచంపల్లిలోని చారిత్రక, సాంస్కృతిక విశేషాలను వివరించారు. స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, చేనేత కళకు మరింత గుర్తింపు తీసుకురావడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని అధికారులు తెలిపారు.

## కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి గోదావరి జలాలను ఎత్తిపోయాలి

- నీటిని సముద్రంలోకి వదిలేస్తూ హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తారా?
- నీటి సమస్య పరిష్కరించకపోతే రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తాం
- హైదరాబాద్ తాగునీటి సంక్షోభంపై కాంగ్రెస్ ప్రభుత్వానికి బీఆర్ఎస్ ఎమ్మెల్యేల హెచ్చరిక





కాళేశ్వరం, అక్టోబర్ 24 (జనంసాక్షి) : హైదరాబాద్‌లో తాగునీటి సంక్షోభాన్ని నివారించేందుకు కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి వెంటనే గోదావరి జలాలను ఎత్తిపోయాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోకపోతే హైదరాబాద్ ప్రజలతో కలిసి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన కన్నెపల్లి పంప్‌హౌస్‌ను బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, మాధవరం కృష్ణారావు, కె.పి. వివేకానంద గౌడ్, మర్రి రాజశేఖర్ రెడ్డి, బండారి లక్ష్మారెడ్డి, మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి సందర్శించారు. గోదావరి జలాలు పెద్ద మొత్తంలో దిగువకు ప్రవహిస్తూ సముద్రంలో కలుస్తున్నప్పటికీ, హైదరాబాద్ తాగునీటి అవసరాల కోసం వాటిని వినియోగించుకోవడంలో ప్రభుత్వం విఫలమవుతోందని వారు ఆరోపించారు. జూన్ నుంచి ఇప్పటివరకు సుమారు 750 టీఎంసీలకు పైగా గోదావరి జలాలు సముద్రంలో కలిశాయని నేతలు పేర్కొన్నారు. కనీసం 250 టీఎంసీల నీటిని ఎత్తిపోసినా జలాశయాలు, చెరువుల్లో నీటి నిల్వలు పెరిగేవని, భూగర్భ జలమట్టాలు మెరుగుపడటంతో పాటు హైదరాబాద్ తాగునీటి అవసరాలకు ఉపశమనం లభించేదని అభిప్రాయపడ్డారు.

### ప్రజలకు నీటి కష్టాలు.. ప్రభుత్వానికి పట్టదా?

కన్నెపల్లి పంప్‌హౌస్ వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు మాట్లాడుతూ, నీటి సంక్షోభాన్ని పరిష్కరించే అవకాశం ఉన్నప్పటికీ ప్రభుత్వం చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా కనీసం ఇప్పటికైనా గోదావరి జలాలను ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు. గతంలో కరోనా సమయంలోనూ మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజలకు నీరు, విద్యుత్ సహా అవసరమైన సేవలు అందేలా చర్యలు తీసుకున్నారని గుర్తుచేశారు. ఎమ్మెల్యే కె.పి. వివేకానంద గౌడ్ మాట్లాడుతూ, జూలైలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈ ప్రాంతాన్ని సందర్శించి గోదావరి జలాలు వృథాగా సముద్రంలోకి వెళ్తున్న విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారని గుర్తుచేశారు. ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తులో తలెత్తే నీటి సమస్యలపై అప్పుడే హెచ్చరించినట్లు తెలిపారు. నీటిని ఎత్తిపోసేందుకు సూచించిన ఇంజినీర్లకు బెల్టు ట్రీట్‌మెంట్ ఇస్తానని ముఖ్యమంత్రి బెదిరించారని వివేకానంద గౌడ్ ఆరోపించారు. ప్రజల నీటి సమస్యలను పరిష్కరించకుండా ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తే ప్రజలే ముఖ్యమంత్రికి తగిన సమాధానం చెబుతారని వ్యాఖ్యానించారు. హైదరాబాద్‌కు ఏడాది పాటు తాగునీరు అందించేందుకు సుమారు 10 టీఎంసీల నీరు సరిపోతుందని పేర్కొంటూ, కన్నెపల్లి నుంచి వెంటనే నీటిని ఎత్తిపోయాలని డిమాండ్ చేశారు.

### మూడు రోజులకు ఒకసారి కూడా సరిగ్గా రావడం లేదు

ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ, హైదరాబాద్‌లోని తన నియోజకవర్గంతో పాటు పలు ప్రాంతాల్లో ప్రజలు నీటి సరఫరా సరిగా లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మూడు రోజులకు ఒకసారి నీరు వస్తున్నా, తక్కువ పీడనంతో సరఫరా అవుతోందని ప్రజలు ఫిర్యాదు చేస్తున్నట్లు చెప్పారు. సింగూరు, మంజీరా జలాశయాల్లో నీటి నిల్వలు తగ్గుతున్నాయని వాటర్ బోర్డు అధికారులు చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం ముందస్తుగా జలాశయాల్లో తగినంత నీటిని నిల్వ చేసుకుని ఉంటే హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లోనూ ప్రస్తుత పరిస్థితిని నివారించవచ్చని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యమే కరువు పరిస్థితులకు కారణమవుతోందని ఆరోపించారు.

### మేడిగడ్డపై చర్యలేవీ?

ఎమ్మెల్యే డి. సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్లను లక్ష్యంగా చేసుకుని పేలుడు ఘటన జరిగినట్లు వచ్చిన ఆరోపణలపై ఫిర్యాదు చేసినప్పటికీ చర్యలు తీసుకోలేదని విమర్శించారు. మరమ్మతుల పనులు కూడా చేపట్టలేదని ఆరోపిస్తూ, కాళేశ్వరం ప్రాజెక్టుపై తప్పుడు ప్రచారంతో తెలంగాణ ప్రయోజనాలకు నష్టం కలిగిస్తున్నారని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై విమర్శలు చేశారు. హైదరాబాద్‌లో వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరిగిందని, అక్టోబర్ నెలలో రోజుకు సుమారు 7,000 ట్యాంకర్ బుకింగ్స్ జరుగుతున్నాయని సుధీర్ రెడ్డి పేర్కొన్నారు. ఇది వేసవి కాలాన్ని తలపించే పరిస్థితి అని, నగరంలో నీటి కొరత తీవ్రతకు నిదర్శనమని అన్నారు.

### కాళేశ్వరం నీటిని వినియోగించుకోవాలి

మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకట రమణారెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ వైఫల్యాలపై ప్రజల ప్రశ్నలను పక్కదారి పట్టించే రాజకీయాలతో తప్పించుకోలేరని విమర్శించారు. విలువైన గోదావరి జలాలు సముద్రంలో కలుస్తుండగా, హైదరాబాద్ తాగునీటి సంక్షోభం దిశగా వెళ్లడం ఆందోళనకరమని అన్నారు. ప్రభుత్వం వెంటనే కన్నెపల్లి పంప్‌హౌస్ నుంచి నీటిని ఎత్తిపోయి ప్రజలకు తాగునీటి భరోసా కల్పించాలని డిమాండ్ చేశారు.

## గోదావరి పుష్కరాలలో భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి

- రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



మంచిర్యాల ప్రతినిధి , అక్టోబర్ 24, (జనంసాక్షి) : గోదావరి పుష్కరాలలో భక్తులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ప్రభుత్వం దాదాపు 2 వేల కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేసిందని, గోదావరి పుష్కరాలు- 2027 లో భాగంగా పుష్కర స్నానాలకు వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అన్నారు. శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని విశ్వనాథ ఆలయాన్ని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, రాజస్వ మండల అధికారి శ్రీనివాస్ రావు, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ ధర్ని మధుకర్, మండల తహసిల్దార్ రఫతుల్లా, మార్కెట్ కమిటీ చైర్మన్ బానేష్, జిల్లా దేవాదాయ అధికారి రవి లతో కలిసి సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆలయ అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.... పుష్కర ఘాట్ల నిర్మాణం, ప్రధాన దేవాలయాల అభివృద్ధి, పునర్నిర్మాణ పనులను వేగవంతంగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. రాష్ట్రంలోని ప్రధాన దేవాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించిందని తెలిపారు. బాసర ఆలయానికి 354 కోట్ల రూపాయలు కేటాయించగా, అందులో 324 కోట్ల రూపాయలు ప్రభుత్వ నిధులు కాగా, మిగిలిన సుమారు 30 కోట్ల రూపాయలు విరాళాల రూపంలో సమకూరనున్నాయని తెలిపారు. కాళేశ్వరం ఆలయానికి 198 కోట్ల రూపాయలు, దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం ఆలయానికి 276 కోట్ల రూపాయలు, ధర్మపురి ఉగ్ర నరసింహస్వామి ఆలయ నిర్మాణ, పునర్నిర్మాణ పనులకు 10 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. దేవాలయాల అభివృద్ధితో పాటు పుష్కర ఘాట్లు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు సుమారు 1 వేయి కోట్ల రూపాయలు, ప్రధాన దేవాలయాల అభివృద్ధికి సుమారు 1 వేయి కోట్ల రూపాయలు కేటాయించడం జరిగిందని, కందకుర్తి, మంథని తదితర ప్రాంతాలలోని ఆలయాలు, ఘాట్ల అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని తెలిపారు. దేవాలయాలలో ఇప్పటికే సుమారు 40 శాతం పనులు పూర్తయ్యాయని, మిగిలిన పనులను పుష్కరాల నాటికి పూర్తి చేసే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. టెండర్ల ప్రక్రియ పూర్తయిన పనులను కాంట్రాక్టర్లు ప్రారంభించారని, పనుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సాధించడం జరుగుతుందని తెలిపారు. జిల్లా కలెక్టర్లు వారానికొకసారి సమీక్షలు నిర్వహిస్తూ పనుల పురోగతిని పర్యవేక్షిస్తున్నారని తెలిపారు. మంచిర్యాల జిల్లాలోని గూడెం గుట్ట ఆలయ అభివృద్ధికి 58 కోట్ల రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అక్కడి రాతి నిర్మాణ పనుల కారణంగా కొన్ని పనులకు అదనపు సమయం పట్టే అవకాశం ఉన్నప్పటికీ, పుష్కరాల సమయంలో భక్తులకు దర్శనానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందని తెలిపారు. పుష్కరాల సమయంలో తాత్కాలిక వసతి, ఇతర సౌకర్యాల ఏర్పాట్లకు సంబంధించి ప్రణాళికలు సిద్ధం చేయడం జరిగిందని తెలిపారు. 2027 జూన్ 26 నుంచి జూలై 7 వరకు జరగనున్న గోదావరి పుష్కరాలను విజయవంతం చేసేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సన్నద్ధమవుతోందని తెలిపారు. పట్టణంలోని కాలేజ్ రోడ్డులో గల గోదావరి తీరం వద్ద పుష్కర ఘాట్ ఏర్పాట్లను పరిశీలించారు.



## రాష్ట్రస్థాయి ఎస్‌జీఎఫ్ క్రికెట్ పోటీలకు జిల్లా జట్టు ఎంపిక

- ఎంపికలకు 224 మంది క్రీడాకారుల హాజరు

నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 (జనంసాక్షి): ఉమ్మడి నిజామాబాద్ జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-17 బాలుర క్రికెట్ జట్టు ఎంపికలు శనివారం నిజామాబాద్‌లోని నవ్యభారతి గ్లోబల్ స్కూల్‌లో నిర్వహించారు. ఈ ఎంపికలకు ఉమ్మడి నిజామాబాద్ జిల్లా నుంచి సుమారు 224 మంది క్రీడాకారులు హాజరయ్యారు. క్రీడాకారులను బ్యాటింగ్, బౌలింగ్, వికెట్ కీపింగ్, ఆల్‌రౌండర్ విభాగాలుగా విభజించి, వారి ప్రతిభ ఆధారంగా రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి అలివేణి మంగ తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 26వ తేదీ నుంచి మహబూబ్‌నగర్ జిల్లా గజ్వాల్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయి పోటీల్లోనూ రాణించి జిల్లా జట్టుకు విజయాన్ని అందించాలని ఆమె ఆకాంక్షించారు. ఈ ఎంపికలను జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు విజయ్ మోరే, అజ్మత్ ఖాన్, సిద్ధు, సాయిలు పర్యవేక్షించారు.

## కరుడుగట్టిన నేరస్తుడిపై పీడీ యాక్ట్



శేరిలింగంపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి) : అనేక దారుణాలకు ఒడిగడుతూ సమస్యాత్మక అసాంఘిక వ్యక్తిగా మారిన ఓ కరడుగట్టిన నిందితుడిపై సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పిడి యాక్ట్ నమోదయ్యింది. ఈ మేరకు కమిషనరేట్ కార్యాలయం వెల్లడించిన వివరాల ప్రకారం... ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం పశ్చిమగోదావరి జిల్లా కోడూరు మండలానికి చెందిన నాగారాజు రఘు వర్మ అలియాస్ నాగారాజు కార్తికేయ రఘు వర్మ అలియాస్ వంశీ అలియాస్ అల్లూరి విజయ రామ్ అలియాస్ కల్నల్ కార్తికేయ సింగ్(29) బ్రతుకుతెరువు నిమిత్తం నగరానికి వలస వచ్చి మొదట్లో డ్రైవర్ గా పని చేయడం జరిగిందని, ఈ క్రమంలో సులువుగా డబ్బు సంపాదించడంతోపాటు విలాసవంతమైన జీవితాన్ని గడపాలని ఉద్దేశంతో నేరవృత్తిలోకి దిగడం జరిగింది. ఇతను ఓ పోలీసు అధికారిగా తనను తాను పరిచయం చేసుకొని స్థానికుల మోసం చేయడం ప్రవృత్తిగా మార్చుకోవడంతో ఇతని ద్వారా మోసపోయిన బాధితులు అందించిన ఫిర్యాదుల మేరకు కమిషనరేట్ పరిధిలోని వివిధ పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు కావడం జరిగింది. అమాయకులను ఆసరాగా చేసుకుని వారి ఆలోచనలను తెలుసుకోవడం ద్వారా వారికి చట్టపరమైన మద్దతును అందిస్తానని, వివిధ కేసుల నుండి వారికి ముక్తిని అందిస్తానని నమ్మబల్కుతూ భారీగా డబ్బులను వసూలు చేయడం అతని నైజంగా పోలీసులు అభివర్ణించారు. దీంతోపాటు కొంతమంది వ్యక్తులను అపహరించడంతోపాటు తుపాకులు చూపించి తీవ్రంగా భయపెట్టి వారి వద్దనున్న నగదును దోచుకోవడంలో కూడా సిద్ధహస్తుడని పోలీసు అధికారులు వెల్లడించారు. 2017 నుండి 2026 మధ్య కాలంలో ఇతను మోసం, కిడ్నాప్, దోపిడీ, బలవంతపు వసూళ్లు, నేరపూరిత బెదిరింపులు మరియు 'ఆర్మ్స్ యాక్ట్, 1959' (ఆయుధ చట్టం) కింద నమోదైన మొత్తం 14 నేరాల్లో నిందితుడిగా నమోదు కావడం జరిగిందని, గతంలో కూడా సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 2021 మరియు 2024 సంవత్సరాల్లో ఇతనిపై పిడి యాక్ట్ చట్టాన్ని ప్రయోగించినట్లు అధికారులు పేర్కొన్నారు. పలుమార్లు జైలుకు వెళ్లినప్పటికీ జైలునుండి విడుదలైన తర్వాత కూడా ఇతను తన నేరపూరిత కార్యకలాపాలను కొనసాగిస్తుండడంతో తాజా కేసులకు సంబంధించి, సైబరాబాద్‌లోని జగద్గిరిగుట్ట పోలీసులు ఇతనిని అరెస్టు చేసి జైలుకు తరలించారు. గతంలో తీసుకున్న నివారణ చర్యలు(పిడి చట్టం) ఉన్నప్పటికీ, ఇతను పదేపదే నేరాలకు పాల్పడుతుండటాన్ని పరిగణనలోకి తీసుకున్న అధికారులు, మరోసారి ఇతనిపై పిడి చట్టాన్ని ప్రయోగించి చర్లపల్లి జైలుకు తరలించినట్లు వివరించారు.




## టోల్ ప్లాజా నిర్వాహకుల నిర్లక్ష్యం

- కొద్దిపాటి వాహనాలు ఆగితేనే నరకాయాతన!

మాడుగులపల్లి, అక్టోబర్ 23 ( జనం సాక్షి ): నల్గొండ జిల్లా మాడుగులపల్లి మండల కేంద్రంలో ఉన్న టోల్ ప్లాజా నిర్వాహకుల తీరు వాహనదారులకు శాపంగా మారుతోంది. టోల్ గేట్ వద్ద కొద్దిపాటి వాహనాలు ఆగితే చాలు, ద్విచక్ర వాహనదారులు వెళ్లడానికి అక్షరాలా నరకాయాతన పడాల్సి వస్తోంది. టోల్ ప్లాజా వద్ద సరైన లేన్లు లేకపోవడం, రోడ్డు ఇరుకుగా ఉండటంతో ఏ చిన్న ట్రాఫిక్ జామ్ ఏర్పడినా టూ వీలర్స్, ఆటోలు ముందుకు కదలలేని దుస్థితి నెలకొంది టూ వీలర్ వెళ్లాలంటేనే కష్టమే వెళ్ళేది ఎలా? అని ఎవరైనా ప్రశ్నిస్తే, అక్కడి సిబ్బంది నుంచి సమాధానం చెప్పే నాథుడే కరువయ్యాడు. నిత్యం రాకపోకలు సాగించే ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు ఈ ఇరుకైన రోడ్డు కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు అధికారులు, నిర్వాహకుల వైఖరిపై ప్రయాణికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రభుత్వ అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించి, ఈ టోల్ గేట్ నిర్వహణ తీరుపై దృష్టి పెట్టాలని వాహనదారులు కోరుతున్నారు. తక్షణమే స్పందించి రోడ్డును వెడల్పు చేయాలని, ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# విశ్వసనీయతే పెట్టుబడి.. దానికి తూట్లు!

**ఒకప్పుడు భారత ఎన్నికల కమిషన్ ప్రపంచ ప్రజాస్వామ్యాలకు 'ప్రమాణ ప్రామాణికం' (గోల్డ్ స్టాండర్డ్). కోట్లాది మంది ఓటర్లు, భిన్న భాషలు, సంస్కృతులు, సామాజిక వైవిధ్యం మధ్య ఎన్నికలను నిర్వహించి, ఫలితాలపై ప్రజల్లో నమ్మకం కలిగించిన ఘనత దానిది. దశాబ్దాల నిష్పక్షపాత నిర్ణయాలు, రాజకీయ ఒత్తిళ్లకు లొంగని వైఖరి ఆ ప్రతిష్టను నిర్మించాయి. కానీ నేడు అదే సంస్థ విశ్వసనీయతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇది సాధారణ విమర్శ కాదు.. ప్రజాస్వామ్యానికి ప్రమాద ఘంటిక.**

సంపాదకీయం

ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ హయాంలో కమిషన్ వ్యవహారశైలిపై ప్రతిపక్షాలు, పౌర సమాజ సంస్థలు, మాజీ ఎన్నికల అధికారులు లేవనెత్తుతున్న ప్రశ్నలు తీవ్రమైనవి. ఓటర్ల జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణలో పారదర్శకత ఎక్కడ? అర్హులైన ఓటర్ల పేర్లు తొలగిపోకుండా రక్షణ చర్యలు ఏమిటి? తొలగింపులకు కారణాలు, అభ్యంతరాలకు సమాధానాలు ఎందుకు స్పష్టంగా లేవు? ఓటు హక్కును కాపాడాల్సిన సంస్థే సందేహాలకు తావిస్తే, ప్రజలు ఎవరిని నమ్మాలి?

ప్రశ్నలకు ఆధారాలతో సమాధానం చెప్పాల్సిన కమిషన్ విమర్శకులనే ప్రమాణపత్రాలు కోరుతోందన్న ఆరోపణలు, కఠిన పదజాలంతో స్పందిస్తోందన్న విమర్శలు దాని స్థాయికి తగవు. సీసీటీవీ దృశ్యాలు, ఓటర్ల సమాచారం వంటి అంశాల్లో వివరాలు అందుబాటులో లేకపోతే అనుమానాలు పెరగడం సహజం. **జవాబుదారీతనం** నుంచి తప్పించుకుంటూ **విశ్వసనీయత**ను ఆశించడం సాధ్యం కాదు. ప్రశ్నలను అణచడం సమాధానం కాదు; పారదర్శకతే సమాధానం.

ఐక్యరాజ్యసమితి నిపుణులు వ్యక్తం చేసినట్లు వార్తలొస్తున్న ఆందోళనలను జాతీయ గౌరవంపై దాడిగా కొట్టిపారేయడం పరిష్కారం కాదు. విమర్శ ఎక్కడి నుంచి వచ్చిందన్నది ముఖ్యం కాదు; అందులోని ప్రశ్నలకు వాస్తవాలతో సమాధానం చెప్పగలమా అన్నదే ముఖ్యం. అంతర్జాతీయ ప్రతిష్ట ప్రసంగాలతో నిలవదు. ప్రజాస్వామ్య సంస్థల పనితీరుతోనే నిలుస్తుంది.

ఎన్నికల కమిషనర్ల నియామక ప్రక్రియలోనూ స్వతంత్రతపై ప్రశ్నలు ఉన్నాయి. సుప్రీంకోర్టు సూచించిన ఎంపిక కమిటీలో ప్రధాన న్యాయమూర్తికి స్థానం లేకుండా చట్టం మార్చడంపై కార్యనిర్వాహక వర్గం ప్రభావం పెరుగుతుందన్న విమర్శలు వచ్చాయి. నియామక ప్రక్రియపై సందేహాలు, నిర్ణయాలపై అనుమానాలు కలిసినప్పుడు సంస్థ స్వతంత్రతపై ప్రజలకు నమ్మకం ఎలా కలుగుతుంది? స్వతంత్రత అనేది పేరులో ఉండటం కాదు; నిర్ణయాల్లో కనిపించాలి.

ఎన్నికల కమిషన్ రాజకీయ ఆటలో ఆటగాడు కాదు.. నిష్పక్షపాత మధ్యవర్తి. ఒక పక్షం పట్ల మెతక వైఖరి, మరో పక్షంపై కఠిన చర్యలున్నాయనే అనుమానం వచ్చినా ఎన్నికల విశ్వసనీయత దెబ్బతింటుంది. ఎన్నికల్లో గెలవడం ఒక విషయం; ఆ విజయం న్యాయంగా వచ్చిందని ప్రజలు నమ్మడం మరో విషయం. రెండోది లేకపోతే మొదటిదానికి ప్రజాస్వామ్య విలువ తగ్గుతుంది.

ఎన్నికలు నిర్వహించడమే ప్రజాస్వామ్యం కాదు. ప్రతి అర్హుడి ఓటు భద్రంగా ఉండాలి. ప్రతి ఫిర్యాదుకు న్యాయమైన పరిష్కారం దొరకాలి. ప్రతి పక్షానికీ ఒకే నిబంధనలు వర్తించాలి. సమాన అవకాశాలు కల్పించాల్సిన సంస్థే పక్షపాత అనుమానాలకు గురైతే ప్రజాస్వామ్యానికి రక్షణ ఎక్కడ? కమిషన్‌పై నమ్మకం క్షీణిస్తే వివాదాలు పెరుగుతాయి; సంస్థలపై విశ్వాసం దెబ్బతింటుంది; చివరకు ప్రజాస్వామ్య ప్రక్రియే ప్రశ్నార్థకమవుతుంది. కమిషన్ ఇప్పటికైనా తన వైఖరిని సరిదిద్దుకోవాలి. ప్రత్యేక సమగ్ర సవరణ విధివిధానాలు, ఓటర్ల పేర్ల తొలగింపుల వివరాలు, కారణాలను బహిరంగపరచాలి. అర్హులైన ఒక్క ఓటరు కూడా హక్కు కోల్పోకుండా సమర్థవంతమైన అప్పీళ్ల వ్యవస్థను ఏర్పాటు చేయాలి. రాజకీయ పార్టీల ప్రశ్నలకు ఒకే ప్రమాణంతో, ఆధారాలతో సమాధానం చెప్పాలి. విమర్శకులపై ఆగ్రహం చూపడం కాదు, ప్రజల్లో విశ్వాసం కల్పించడమే లక్ష్యంగా ఉండాలి.

భారత ఎన్నికల కమిషన్ సంపాదించిన ప్రామాణిక సంస్థ ప్రతిష్ట ప్రభుత్వాల సొత్తు కాదు; ప్రజలు దశాబ్దాలుగా అందించిన విశ్వాసం. ఆ పెట్టుబడిని కాపాడాల్సిన బాధ్యత కమిషన్‌దే. విశ్వసనీయతను ఆదేశాలతో సాధించలేరు; పారదర్శకత, జవాబుదారీతనం, స్వతంత్రతతోనే నిలబెట్టగలరు. ఎన్నికల కమిషన్ విశ్వసనీయత కోల్పోతే నష్టపోయేది ఒక సంస్థ మాత్రమే కాదు.. భారత ప్రజాస్వామ్యమే. ఓటు హక్కుకు భరోసా ఇవ్వాల్సిన సంస్థ, ఓటరికి అనుమానాలు మిగిల్చే స్థితికి దిగజారకూడదు. ఇదే ఇప్పటి అత్యవసర హెచ్చరిక.

# ఎలనినోకు కృత్రిమ అడ్డుకట్ట సాధ్యమేనా!?

*ప్రకృతిని జయించాలనే మానవ ప్రయత్నాలకు అంతులేదు.కానీ ప్రకృతి సమతుల్యతను దెబ్బతీస్తే దాని పరిణామాలు మానవాళికే ముప్పుగా మారతాయి. ఒకవైపు మండే ఎండలు, మరోవైపు కరువు.. ఇంకోవైపు కుండపోత వర్షాలు, వరదలు! ప్రపంచ వాతావరణంలో చోటుచేసుకుంటున్న ఈ విపరీత మార్పులకు ఎల్‌నినో వంటి సహజ వాతావరణ పరిణామాలు తోడవుతున్నాయి. వీటి తీవ్రతను తగ్గించేందుకు ప్రకృతిలోనే కృత్రిమ మార్పులు చేయవచ్చా? సముద్ర మేఘాలను ప్రకాశవంతం చేసి ఎల్‌నినో ప్రభావాన్ని బలహీనపరచగలమా? అనే ప్రశ్నలకు శాస్త్రవేత్తలు పరిశోధనల ద్వారా సమాధానాలు అన్వేషిస్తున్నారు. అయితే, ప్రకృతిని సరిదిద్దే ప్రయత్నమే మరో ప్రకృతి విపత్తుకు దారితీయకుండా జాగ్రత్తపడటం అత్యంత కీలకం.*



ఎల్‌నినో అనేది పసిఫిక్ మహాసముద్రంలోని మధ్య, తూర్పు భూమధ్యరేఖ ప్రాంతాల్లో సముద్ర ఉపరితల జలాలు అసాధారణంగా వేడెక్కే సహజ వాతావరణ పరిణామం. సాధారణంగా తూర్పు నుంచి పడమరకు వీచే వాణిజ్య పవనాలు బలహీనపడినప్పుడు సముద్రంలోని వేడి జలాల పంపిణీలో మార్పులు చోటుచేసుకుంటాయి. ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఉష్ణోగ్రతలు, వర్షపాతం, వ్యవసాయం, జలవనరులపై ప్రభావం పడుతుంది.

అయితే ఎల్‌నినో ప్రభావం అన్ని ప్రాంతాల్లో ఒకేలా ఉండదు. కొన్ని చోట్ల కరువు, తీవ్రమైన వేడి పరిస్థితులు ఏర్పడితే, మరికొన్ని ప్రాంతాల్లో అధిక వర్షాలు, వరదలు సంభవించవచ్చు. ఇప్పటికే కొనసాగుతున్న మానవ ప్రేరిత వాతావరణ మార్పులు ఈ ప్రభావాలను మరింత తీవ్రతరం చేసే అవకాశం ఉంది.

ఈ నేపథ్యంలో ఎల్‌నినో వంటి పరిణామాలను అడ్డుకోవడానికి లేదా వాటి తీవ్రతను తగ్గించడానికి జియో ఇంజినీరింగ్ అనే భావనపై శాస్త్రవేత్తలు దృష్టి సారిస్తున్నారు. ఇందులో ప్రధానంగా మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ (MCB), స్ట్రాటోస్ఫియరిక్ ఏరోసోల్ ఇంజెక్షన్ (SAI) అనే రెండు విధానాలు చర్చలో ఉన్నాయి.

**ఏమిటీ మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్?**

సముద్రంపై ఏర్పడే కొన్ని తక్కువ ఎత్తులోని మేఘాలు సూర్యకాంతిని అంతరిక్షంలోకి పరావర్తనం చేస్తాయి. ఈ మేఘాల ప్రకాశాన్ని కృత్రిమంగా పెంచితే, అవి మరింత సూర్యకాంతిని వెనక్కి పంపగలవన్నది మెరైన్ క్లౌడ్ బ్రైటెనింగ్ విధానం వెనుక ఉన్న ప్రధాన ఆలోచన.

2019-2020లో ఆస్ట్రేలియాలో సంభవించిన కార్చిచ్చుల కారణంగా వాతావరణంలోకి భారీగా సూక్ష్మరేణువులు విడుదలయ్యాయి. వాటి ప్రభావంతో దక్షిణ పసిఫిక్ ప్రాంతంలో మేఘాల లక్షణాలు మారి, లానినా తరహా పరిస్థితులకు అనుకూలమైన వాతావరణ మార్పులు చోటుచేసుకున్నట్లు పరిశోధనలు సూచించాయి. ఈ సహజ పరిణామాన్ని ఆధారంగా చేసుకొని, సముద్ర మేఘాలను కృత్రిమంగా ప్రకాశవంతం చేస్తే ఎల్‌నినో తీవ్రతను తగ్గించవచ్చా? అనే అంశంపై శాస్త్రవేత్తలు అధ్యయనం చేస్తున్నారు.

2025లో ప్రచురితమైన ఒక పరిశోధనలో కంప్యూటర్ నమూనాల ఆధారంగా ఈ విధానం ఎల్‌నినో--లానినా చక్రంపై చూపగల ప్రభావాలను పరిశీలించారు. 2026 జూలైలో సైన్స్ అడ్వాన్సెస్ పత్రికలో ప్రచురితమైన మరో అధ్యయనం 1997--98, 2015--16లో సంభవించిన బలమైన ఎల్‌నినో ఘటనలను లక్ష్యంగా చేసుకొని అనుకరణలు నిర్వహించింది. ఎల్‌నినో బలపడే ప్రారంభ దశలో మేఘాలను ప్రకాశవంతం చేయడం దాని తీవ్రతను తగ్గించగలదని పరిశోధకులు గుర్తించారు. అయితే ఇవి ప్రధానంగా కంప్యూటర్ నమూనాల ఆధారంగా వచ్చిన ఫలితాలే తప్ప, వాస్తవ ప్రపంచంలో ఈ విధానం సురక్షితంగా, సమర్థంగా పనిచేస్తుందని నిరూపణ కాలేదు.

**ఎలా పనిచేస్తుంది?**

ప్రత్యేక పరికరాలు లేదా నౌకల ద్వారా సముద్రపు నీటిని అతి సూక్ష్మమైన ఉప్పు తుంపర్లుగా వాతావరణంలోకి విడుదల చేయడం ఈ విధానంలో ప్రతిపాదించిన ప్రధాన ప్రక్రియ. ఈ సూక్ష్మరేణువులు మేఘాల్లోని నీటి బిందువుల ఏర్పాటును ప్రభావితం చేసి, కొన్ని పరిస్థితుల్లో మేఘాల ప్రతిఫలన సామర్థ్యాన్ని పెంచగలవు. దీంతో సూర్యకాంతి ఎక్కువగా అంతరిక్షంలోకి పరావర్తనం చెంది, సముద్ర ఉపరితలానికి చేరే సౌరశక్తి తగ్గవచ్చు. తూర్పు ఉపఉష్ణమండల పసిఫిక్ ప్రాంతంలో సముద్ర జలాలు చల్లబడితే, సముద్రం–వాతావరణం మధ్య జరిగే పరస్పర చర్యల్లో మార్పులు చోటుచేసుకోవచ్చు. వాణిజ్య పవనాలు బలపడటానికి, ఎల్‌నినోను బలపరిచే ప్రక్రియలు బలహీనపడటానికి ఇది దోహదపడవచ్చని నమూనా అధ్యయనాలు సూచిస్తున్నాయి.

అయితే సముద్ర ఉష్ణోగ్రతలు, పవనాలు, మేఘాలు, వర్షపాతం ఒకదానితో మరొకటి సంక్లిష్టంగా ముడిపడి ఉంటాయి. కాబట్టి ఒక ప్రాంతంలో ఉష్ణోగ్రతను తగ్గించడం వల్ల ప్రపంచవ్యాప్తంగా ఆశించిన ఫలితాలే వస్తాయని చెప్పలేం.

**స్ట్రాటోస్ఫియరిక్ ఏరోసోల్ ఇంజెక్షన్ అంటే?**

ఈ విధానంలో సల్ఫర్ డయాక్సైడ్ వంటి పదార్థాలను వాతావరణంలోని స్ట్రాటోస్ఫియర్ అనే ఎత్తైన పొరలోకి ప్రవేశపెట్టి, సూర్యకాంతి పరావర్తనాన్ని పెంచాలని ప్రతిపాదిస్తున్నారు. భారీ అగ్నిపర్వత విస్ఫోటనాల తరువాత వాతావరణంలో ఏర్పడే కొన్ని శీతలీకరణ ప్రభావాలను ఇది అనుకరించాలనే ఆలోచనతో రూపొందింది.

దీనివల్ల భూమికి చేరే సౌరశక్తిలో కొంత భాగం తగ్గవచ్చు. అయితే ఎల్‌నినోను ప్రత్యేకంగా నియంత్రించడంలో ఈ విధానం ఎంతవరకు ప్రభావవంతమో స్పష్టమైన నిర్ధారణ లేదు. కొన్ని నమూనా అధ్యయనాల్లో ఎల్‌నినో–లానినా చక్రంపై దీని ప్రభావం పరిమితంగా ఉన్నట్లు తేలింది. అంతేకాకుండా, వర్షపాతం, ప్రాంతీయ ఉష్ణోగ్రతలు, పర్యావరణ వ్యవస్థలపై దీర్ఘకాలిక ప్రభావాలు ఇంకా పూర్తిగా అర్థం కాలేదు.

**ముప్పులనూ విస్మరించలేం!** వాతావరణాన్ని కృత్రిమంగా మార్చే ప్రయత్నాలు ఆశించిన ఫలితాలనే ఇస్తాయని భావించడం ప్రమాదకరం. ఒక ప్రాంతంలో వేడిని తగ్గించే ప్రక్రియ మరో ప్రాంతంలో వర్షపాతాన్ని మార్చవచ్చు. కరువు ముప్పును తగ్గించాలనే ప్రయత్నం కొన్ని చోట్ల అధిక వర్షాలు లేదా మరో రకమైన వాతావరణ అసమతుల్యతకు కారణం కావచ్చు.

ఎల్‌నినో తీవ్రతను తగ్గించే ప్రయత్నం అనుకోకుండా లానినా పరిస్థితులను ముందుకు తీసుకురావడం లేదా వాటి తీవ్రతను పెంచడం కూడా సాధ్యమేనని తాజా నమూనా పరిశోధనలు హెచ్చరిస్తున్నాయి. లానినా సమయంలోనూ కొన్ని ప్రాంతాల్లో వరదలు, మరికొన్ని ప్రాంతాల్లో కరువు వంటి సమస్యలు తలెత్తుతాయి. సముద్ర జీవవైవిధ్యం, పగడపు దిబ్బలు, వన్యప్రాణులు, వ్యవసాయం వంటి రంగాలపై కూడా అనూహ్య ప్రభావాలు పడవచ్చు. అంతేకాదు, ఇలాంటి సాంకేతిక పరిజ్ఞానాన్ని ఏ దేశం ప్రయోగించాలి? దాని వల్ల ఇతర దేశాలకు నష్టం జరిగితే బాధ్యత ఎవరిది? ఫలితాలను ఎవరు పర్యవేక్షించాలి? అనే ప్రశ్నలకూ అంతర్జాతీయ స్థాయిలో సమాధానాలు అవసరం. శాస్త్రీయ పరిశీలన, పారదర్శకత, ప్రపంచ దేశాల సమ్మతి లేకుండా ఇలాంటి ప్రయోగాలకు తొందరపడటం సమంజసం కాదు.

**పరిష్కారం పరిశోధనతో పాటు ప్రకృతి పరిరక్షణలోనూ ఉంది!**

భారత్‌వంటి వ్యవసాయాధారిత దేశాలకు ఎల్‌నినో ప్రభావాలపై ముందస్తు అంచనాలు అత్యంత అవసరం. వాతావరణ శాఖ హెచ్చరికలను రైతులకు సకాలంలో చేరవేయడం, పంటల ప్రణాళికను మార్చుకునే అవకాశాలు కల్పించడం, నీటి నిల్వలను పెంచడం, చెరువులు-కుంటలను పునరుద్ధరించడం, భూగర్భజలాల వినియోగాన్ని నియంత్రించడం వంటి చర్యలు తక్షణ ప్రాధాన్యం పొందాలి.

వర్షాధార వ్యవసాయంలో తక్కువ నీటితో పండే పంటలను ప్రోత్సహించడం, సూక్ష్మ సేద్య పద్ధతులను విస్తరించడం, పట్టణాల్లో వర్షపు నీటి సంరక్షణను తప్పనిసరి చేయడం, కరువు సమయంలో తాగునీటి సరఫరాకు ముందస్తు ప్రణాళిక రూపొందించడం ప్రభుత్వాల బాధ్యత. అదే సమయంలో అటవీ విస్తీర్ణాన్ని పెంచడం, కాలుష్యాన్ని తగ్గించడం, శిలాజ ఇంధనాల వినియోగాన్ని క్రమంగా తగ్గించడం ద్వారా దీర్ఘకాలిక వాతావరణ మార్పులను ఎదుర్కోవాలి. ఎల్‌నినోను కృత్రిమంగా బలహీనపరిచే విధానాలపై మరింత పరిశోధన అవసరమే. కానీ వాటిని వాతావరణ మార్పులకు శాశ్వత పరిష్కారంగా భావించరాదు. శాస్త్రీయ పరిశోధనలతోపాటు సహజ వనరుల సంరక్షణ, ముందస్తు విపత్తు నిర్వహణ, అంతర్జాతీయ సహకారానికి సమాన ప్రాధాన్యం ఇవ్వాలి.

లిప్రకృతిని జయించాలనే అహంకారం కంటే, ప్రకృతితో సమన్వయంగా జీవించాలనే విజ్ఞత,ఇంగిత జ్ఞానం మానవాళికిలి ఎంతో అవసరం.ఎల్‌నినోను విచ్ఛిన్నం చేయగలమా అనే ప్రశ్నకు సమాధానం అన్వేషించే క్రమంలో, మనమే ప్రకృతి సమతుల్యతను విచ్ఛిన్నం చేయకుండా జాగ్రత్తపడాలి. సాంకేతికతను బాధ్యతతో వినియోగిస్తూ,పర్యావరణ పరిరక్షణను జీవన విధానంగా మార్చుకున్నప్పుడే భవిష్యత్ తరాలకు సురక్షితమైన భూమిని అందించగలం.

**మేకిరి దామోదర్**
సామాజిక విశ్లేషకులు,
జిల్లా: వరంగల్.
ఫోన్:9573666650.



## ముత్యాల మూట

గతాన్ని తలచి
దుఃఖించకు
వర్తమానం లో
జీవించు సుఖించు
భవిష్యత్తు లో
భయంతో పారిపోకు...
ముత్యాల మూట
మూడు మాటలు
జీవన బాటలు
తెరలు తొలిగితే
వరలు భవిషత్

**రేడియమ్**
**9291527757**

# కలేకూరి ప్రసాద్..



పిడికెడు ఆత్మగౌరవం నుంచి సమసమాజ స్వప్నం దాకా!
కవిత్వాన్ని కత్తిగా మలిచిన స్వరం.. అక్షరాన్ని ఉద్యమంగా మార్చిన కలం.. అణచివేతకు ఎదురొడ్డి నిలిచిన ఆత్మగౌరవ పతాకం!

అంటరానితనపు చీకట్లను ప్రశ్నిస్తూ.. కులాధిపత్యపు కోటలను బద్దలుకొట్టాలని ఆకాంక్షిస్తూ.. మనిషిని మనిషిగా గుర్తించే సమాజం కోసం తన అక్షరాలను అంకితం చేసిన ప్రజాకవి కలేకూరి ప్రసాద్ జయంతి సందర్భంగా ప్రత్యేక వ్యాసం.

ఒక కవి పుట్టుక కాదు..
ఒక ప్రశ్న పుట్టుక!

కొంతమంది కవులు ప్రకృతిని వర్ణిస్తారు. మరికొందరు ప్రేమను అక్షరబద్ధం చేస్తారు. ఇంకొందరు జీవితంలోని సుఖదుఃఖాలను కవిత్వంలోకి తీసుకొస్తారు. కానీ కొంతమంది కవులు మాత్రం సమాజం తనలో దాచుకున్న గాయాలను బయటపెడతారు. మనుషుల మధ్య గోడలుగా నిలిచిన వ్యవస్థలను ప్రశ్నిస్తారు. చరిత్ర అంచుల్లోకి నెట్టివేయబడిన ప్రజల తరఫున మాట్లాడుతారు. అణచివేతకు గురైన మనిషి కన్నీటికి భాషనిస్తారు. అతని ఆగ్రహానికి గొంతుకవుతారు. అతని ఆత్మగౌరవాన్ని సామాజిక ఆకాంక్షగా మలుస్తారు. కలేకూరి ప్రసాద్ ఈ కోవకు చెందిన కవి. ఆయన కవిత్వాన్ని చదువుతుంటే కేవలం పదాల సౌందర్యం కనిపించదు. వాటి వెనుక శతాబ్దాలుగా పేరుకుపోయిన సామాజిక అవమానం కనిపిస్తుంది. అణచివేతకు గురైన ప్రజల ఆవేదన వినిపిస్తుంది. అవమానాన్ని భరించబోమనే ఆత్మగౌరవ ప్రకటన ప్రతిధ్వనిస్తుంది. సమానత్వం కోసం పోరాడాలనే ఆలోచన పాఠకుడి మనసులో కదలికను సృష్టిస్తుంది.

కవిత్వం అంటే అందమైన పదాల అమరిక మాత్రమే కాదని, అది ఒక సామాజిక బాధ్యత కూడా కావచ్చని ఆయన తన రచనల ద్వారా నిరూపించారు. కలేకూరి ప్రసాద్‌ను స్మరించుకోవడమంటే ఒక ప్రసిద్ధ కవిని గుర్తుచేసుకోవడం మాత్రమే కాదు. తెలుగు సాహిత్యంలో దళిత జీవితాన్ని, కులవివక్షను, సామాజిక న్యాయ ఆకాంక్షను కేంద్రంలోకి తీసుకొచ్చిన ఒక బలమైన సృజనాత్మక శక్తిని తిరిగి ఆవిష్కరించుకోవడం. ఆయన జయంతి సందర్భంగా మనం వేసుకోవాల్సిన ప్రశ్న కూడా ఇదే.

కలేకూరి కలం ప్రశ్నించిన కులవ్యవస్థ నిజంగా బలహీనపడిందా? ఆయన ఆకాంక్షించిన ఆత్మగౌరవం అట్టడుగు ప్రజలకు సంపూర్ణంగా దక్కిందా? మనిషిని మనిషిగా గౌరవించే సమాజం నిర్మాణమైందా? ఈ ప్రశ్నలకు సమాధానాలు వెతకడంలోనే కలేకూరి ప్రసాద్‌ను స్మరించుకోవడంలోని అసలైన ప్రయోజనం ఉంది.

కంచికచర్ల నుంచి తెలుగు సమాజపు చైతన్య క్షేత్రం దాకా 1962 అక్టోబర్ 25న కృష్ణా జిల్లా కంచికచర్లలో కలేకూరి ప్రసాద్ జన్మించారు. ఆయన తల్లిదండ్రులు లలితా సరోజిని, శ్రీనివాసరావు. వారిద్దరూ ఉపాధ్యాయులు. బాల్యం, విద్యాభ్యాసం, సమకాలీన సామాజిక వాతావరణం ఆయన వ్యక్తిత్వ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాయి. అయితే కలేకూరి జీవితాన్ని అర్థం చేసుకోవాలంటే ఆయన వ్యక్తిగత జీవిత విశేషాలతోపాటు, ఆయన పెరిగిన సమాజంలోని కుల సంబంధాలను కూడా పరిశీలించాలి. భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ కులవ్యవస్థ అంతరించిపోలేదు. రాజ్యాంగం సమానత్వాన్ని ప్రకటించినప్పటికీ గ్రామీణ సమాజంలో కులాధిపత్యం కొనసాగింది. విద్యావకాశాలు పెరుగుతున్నప్పటికీ సామాజిక గౌరవం అందరికీ సమానంగా దక్కలేదు. ప్రజాస్వామ్య వ్యవస్థ ఏర్పడినప్పటికీ అట్టడుగు వర్గాలపై దాడులు, వివక్ష, అవమానాలు కొనసాగాయి. ఈ వైరుధ్యాల మధ్యే తెలుగు దళిత సాహిత్యం కొత్త రూపాన్ని సంతరించుకుంది. అంటరానితనం, కులవివక్ష వంటి సమస్యలను కేవలం సంస్కరణల కోణంలో కాకుండా, సమాజ నిర్మాణంతో ముడిపడిన సమస్యలుగా చూడాల్సిన అవసరం పెరిగింది. దళితులు తమ జీవితాలను తామే రాసుకోవాలని, తమ చరిత్రను తామే చెప్పుకోవాలని, తమ ఆత్మగౌరవాన్ని తామే ప్రకటించుకోవాలని ఒక కొత్త సాహిత్య చైతన్యం ముందుకొచ్చింది. కలేకూరి ప్రసాద్ ఈ చైతన్యానికి కేవలం సాక్షి మాత్రమే కాదు. తన రచనలతో, ఉద్యమ భాగస్వామ్యంతో దానికి బలాన్ని చేకూర్చిన వ్యక్తి.

ఆయన సాహిత్యంలో కనిపించే ఆగ్రహం వ్యక్తిగత అసహనానికి పరిమితం కాదు. అది ఒక సామాజిక వ్యవస్థలోని అన్యాయాలపై వ్యక్తమైన నిరసన. ఆయన కవిత్వంలోని ఆవేదన వ్యక్తిగత దుఃఖానికి మాత్రమే ప్రతీక కాదు. అది తరతరాలుగా అవమానించబడిన ప్రజల చారిత్రక అనుభవాల ప్రతిధ్వని. ఈ నేపథ్యం తెలియకుండా కలేకూరి ప్రసాద్‌ను కేవలం భావోద్వేగ కవిగా మాత్రమే చూడటం ఆయన సాహిత్య పరిధిని కుదించడమే అవుతుంది.

కంచికచర్ల కోటేశు ఘటన..
ఒక మనిషిని కదిలించిన సామాజిక గాయం

కలేకూరి ప్రసాద్ జీవితాన్ని, సాహిత్యాన్ని ప్రభావితం చేసిన ఘటనల్లో కంచికచర్ల కోటేశు హత్య ఒకటి. కులాధిపత్యానికి ఎదురుగా నిలిచిన దళిత యువకుడి జీవితాన్ని బలిగొన్న ఈ ఘటన తెలుగు సమాజంలో తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. కులవ్యవస్థ మనిషి జీవితాన్ని ఎంత అమానవీయంగా నియంత్రించగలదో, ఒక వ్యక్తి స్వేచ్ఛను సామాజిక ఆధిపత్యం ఎలా శిక్షించగలదో ఈ ఘటన గుర్తుచేస్తుంది. కలేకూరి ప్రసాద్‌ను ప్రభావితం చేసిన సామాజిక అనుభవాల్లో ఈ ఘటనకు ప్రత్యేక స్థానం ఉందని ఆయన గురించి వచ్చిన జీవిత విశ్లేషణలు పేర్కొంటున్నాయి. కోటేశు ఒక వ్యక్తి మాత్రమే కాదు. కులాధిపత్యానికి బలైన అనేక మంది జీవితాల ప్రతీకగా ఆయన జ్ఞాపకం నిలిచింది.

ఒక సమాజంలో మనిషి తనకు నచ్చిన జీవితాన్ని గడపడానికి, తన ఇష్టానుసారం సంబంధాలను ఏర్పరచుకోవడానికి, తన ఆత్మగౌరవంతో జీవించడానికి కూడా కులాధిపత్యం అనుమతి కోరాల్సిన పరిస్థితి ఉంటే, ఆ సమాజపు ప్రజాస్వామికతను ప్రశ్నించాల్సిందే. కోటేశు ఘటన వెనుక ఉన్న సామాజిక వాస్తవికత కలేకూరి ప్రసాద్ ఆలోచనల్లో చెరగని ముద్ర వేసింది. అందుకే ఆయన కవిత్వంలో కులవివక్ష ఒక సాధారణ సామాజిక సమస్యగా కనిపించదు. అది మనిషి ప్రాథమిక హక్కులపై జరుగుతున్న దాడిగా కనిపిస్తుంది. అంటరానితనం ఒక ఆచారంగా కాకుండా, మనిషి గౌరవాన్ని నిరాకరించే వ్యవస్థగా కనిపిస్తుంది. ఇక్కడే కలేకూరి కవిత్వానికి రాజకీయ ప్రాధాన్యం ఏర్పడుతుంది. అన్యాయాన్ని చూసి బాధపడటం ఒక స్థాయి. ఆ అన్యాయాన్ని సృష్టిస్తున్న వ్యవస్థను గుర్తించడం మరో స్థాయి. దాన్ని మార్చడానికి ప్రజలను చైతన్యపరచడం మరింత ఉన్నతమైన స్థాయి. కలేకూరి ప్రసాద్ సాహిత్యం ఈ మూడో స్థాయికి చేరువైన సాహిత్యం.

విప్లవోద్యమం నుంచి దళిత ఆత్మగౌరవ ఉద్యమం దాకా

కలేకూరి ప్రసాద్ రాజకీయ, సాహిత్య ప్రస్థానాన్ని పరిశీలిస్తే వామపక్ష విప్లవోద్యమంతో ఆయనకు ఉన్న అనుబంధాన్ని ప్రత్యేకంగా గుర్తించాలి. ఆయన జననాట్యమండలి, విప్లవ రచయితల సంఘం వంటి సాంస్కృతిక, సాహిత్య సంస్థలతో పనిచేశారు. పీపుల్స్ వార్ ఉద్యమంతోనూ కొంతకాలం అనుబంధం కొనసాగించారు. ఆ కాలంలో తెలుగు సమాజంలో విప్లవ సాహిత్యం ప్రజల సమస్యలను కొత్త దృక్పథంతో ముందుకు తెచ్చింది. భూస్వామ్య దోపిడీ, శ్రమ దోపిడీ, పేదరికం, భూమి సమస్యలు, రాజకీయ అణచివేత వంటి అంశాలు సాహిత్యంలో ప్రధాన స్థానం పొందాయి. ప్రజల జీవితాలను మార్చాలంటే సామాజిక వ్యవస్థలో మూలమైన మార్పులు అవసరమనే భావన విప్లవ సాహిత్యానికి ప్రేరణగా నిలిచింది. కలేకూరి ప్రసాద్ కూడా ఈ సాహిత్య, రాజకీయ వాతావరణంలో తన ఆలోచనలను పదును పెట్టుకున్నారు.

అయితే భారతీయ సమాజంలోని కుల సమస్యను కేవలం వర్గ దోపిడీ సమస్యగా మాత్రమే అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. కులం ఆర్థిక సంబంధాలతో ముడిపడి ఉన్నప్పటికీ, అది సామాజిక గౌరవం, వివాహ సంబంధాలు, నివాసం, సాంస్కృతిక ఆధిపత్యం, వృత్తులు, మానవ సంబంధాలను కూడా నియంత్రిస్తుంది.

మిగితా తరువాయి సంచికలో..

**డాక్టర్ మోటె చిరంజీవి**
సామాజికవేత్త, విశ్లేషకులు
సెల్ : 9949194327



# ఎండిన పంటలు, తడిసిన కళ్లు

## రైతు ఆత్మహత్యల విషాద గాథలు



వరి చేలు కళకళలాడాల్సిన భూమిలో ఎండిన మట్టి గడ్డలు, రైతు బతుకులు బిక్కచిక్కిపోతున్న దృశ్యాలు నేటి తెలంగాణ వాస్తవికత. ఒకప్పుడు పచ్చని పైరుతో కళకళలాడిన పొలాలు, ఒక్కసారిగా మారిన వాతావరణ పరిస్థితులతో, నిరంతర వర్షాలతో, ఆగని ఎండలతో ఎండిపోతున్నాయి. ప్రకృతి ఒక వైపు ఆగ్రహాన్ని ప్రదర్శిస్తుంటే, మరోవైపు పెరిగిన దినుసుల ధరలు, పండిన పంటను చేతికి అందించని మార్కెట్ వైఫల్యాలు రైతు జీవితాన్ని దుర్భరం చేస్తున్నాయి. ఇటీవలి కాలంలో ఎర్రా వరి సాగు చేసిన రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు, వాటి వెనుక దాగిన లోతైన సామాజిక ఆర్థిక కారణాలను తెలుపుతూ ఒక గ్రామీణ రైతు బాధను వినిపించే వార్త హృదయ విదారకంగా ఉంది. ఎండిన పంటలతో పాటు, రైతుల ఆశలు కూడా ఎండిపోతుంటే, ఈ వ్యవస్థలో ఏదో పెద్ద లోపం ఉందని మనం గుర్తించాలి.

ఈ సంక్షోభానికి మూలం కేవలం ప్రకృతి మాత్రమే కాదు, మన వ్యవసాయ విధానాల్లో ఉన్న లోపాలే. వర్షాధారిత వ్యవసాయం నుంచి వాణిజ్య పంటల వైపు రైతులు మళ్లుతున్నప్పుడు, వాటికి అనుగుణంగా మార్కెట్ సౌకర్యాలు, రైతు సంరక్షణ చర్యలు కల్పించడంలో ప్రభుత్వ యంత్రాంగం విఫలమవుతోంది. పంట నష్టపోయిన రైతుకు అందాల్సిన పరిహారం, రాయితీలు, పెట్టుబడి సాయం సకాలంలో అందకపోవడం వల్ల రైతు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నాడు. పంట కోతలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఎదురయ్యే ఇబ్బందులు, తగిన ధర రాకపోవడం వంటి సమస్యలు రైతు మనస్థైర్యాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ పరిస్థితుల్లో, సాగు వ్యయం మాత్రం ఆకాశాన్ని తాకుతోంది; విత్తనాలు, ఎరువులు, కూలీల ఖర్చులు భారీగా పెరిగిపోయాయి. ఒకవైపు అధిక పెట్టుబడి, మరోవైపు పంట దిగుబడి తగ్గడం, తుదకు పంట ఎండిపోవడం–ఈ త్రిముఖ సమస్యల మధ్య రైతు నిస్సహాయుడవుతున్నాడు. ఒక రైతు కుటుంబం ఆత్మహత్య చేసుకోవడం అంటే, అది కేవలం ఒక వ్యక్తి మరణం కాదు; ఒక తరం ఆశలు, ఒక గ్రామ ఆర్థిక వ్యవస్థ పతనం కావడం. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో వరి పంట వేసిన ప్రతి రైతు ఈ తరహా మానసిక వేదనను ఎదుర్కొంటున్నాడు. పంట కోతకు వచ్చినప్పుడు ఆనందించాల్సిన రైతు, కూలీల కొరత, యంత్రాల అద్దెల భారంతో కుంగిపోతున్నాడు.

కేవలం రైతు సంక్షోభం అని చెప్పడం కంటే, ఇది ఒక వ్యవసాయ వ్యవస్థ సంక్షోభం. తెలంగాణలోని ఎర్రా వరి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఇందుకు నిదర్శనం. ఎండిన పంటలతో పాటు, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు కూడా రైతుకు నష్టాన్ని తప్పించలేకపోతున్నాయి. పంట నష్టపోయిన రైతులను ఆదుకోవడానికి ప్రభుత్వం కేవలం పరిహారం ప్రకటించడం సరిపోదు; పంట బీమా పథకాలను సమర్థవంతంగా అమలు చేయాలి, రైతులకు తక్షణమే ఆర్థిక సహాయం అందించాలి. అలాగే, ప్రకృతి వైపరీత్యాలను తట్టుకోగల పంటల రకాలను అభివృద్ధి చేయడం, సాగునీటి వనరులను పెంచడం, మార్కెట్ మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం వంటి దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి. రైతు ఆత్మహత్యలకు పరిష్కారం కావాలంటే, ప్రభుత్వాలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, సమాజం కలిసి కట్టుగా పనిచేయాలి. అప్పుడే రైతు బతుకు బంగారు బతుకుగా మారుతుంది; లేకపోతే, ఎండిన పంటలతో పాటు రైతుల కన్నీళ్లే మిగిలిపోతాయి.

**డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్**
**9849328496.**



## ఎఫ్ఎంజి ఇంటర్న్‌లకు సమాన స్టైపెండ్ ఇవ్వాలి

- ఎఫ్ఎంజి ఇంటర్న్‌షిప్ విద్యార్థులు




ముషీరాబాద్, అక్టోబర్ 24 (జనం సాక్షి) : తెలంగాణలోని ప్రభుత్వ వైద్య కళాశాలలు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రుల్లో విధులు నిర్వహిస్తున్న విదేశీ వైద్య పట్టభద్రుల ఇంటర్న్‌లు స్టైపెండ్‌లో వివక్షను ఎదుర్కొంటున్నారని, వారికి సమానమైన స్టైఫెండ్ ఇవ్వాలని ఎఫ్ఎంజిఇ ఇన్టర్న్‌షిప్ విద్యార్థులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద గల ధర్నా చౌక్ లో ఎఫ్ఎంజిఇ ఆధ్వర్యంలో ఇన్టర్న్ షిప్ విద్యార్థులు మహాధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం తమకు నెలకు రూ.5,000 మాత్రమే ఇస్తుండగా, ప్రభుత్వ మెడికల్ కాలేజీల హౌస్ సర్జన్‌లకు నెలకు రూ.29,792 అందుతున్నట్లు పేర్కొన్నారు. దీంతో నెలకు రూ.24,792 వ్యత్యాసం ఉంటోందని తెలిపారు. ఎఫ్ఎంజిఈ పరీక్షలో ఉత్తీర్ణులై, నిబంధనల ప్రకారం ఇంటర్న్‌షిప్ చేస్తున్న తాము కూడా ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఓపీడీ, వార్డులు, అత్యవసర విభాగాలు, ఐసీయూల్లో విధులు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. రాత్రి విధులతో పాటు రోగుల సంరక్షణ, కేస్‌షీట్ల నిర్వహణ వంటి బాధ్యతలు నిర్వర్తిస్తున్నామని తెలిపారు. తమ విధులు, బాధ్యతలను పరిగణనలోకి తీసుకుని ఇతర సమాన వర్గాల ఇంటర్న్‌లతో సమానంగా స్టైపెండ్ చెల్లించాలనీ ప్రభుత్వాన్ని కోరుతున్నామన్నారు. ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, వైద్య విద్యా సంచాలకులు (ఐవీజు) స్పందించి, స్టైపెండ్ నిబంధనలను సమీక్షించి, స్పష్టమైన ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేయాలని విజ్ఞప్తి చేశారు. మాకు జాలి కాదు.. న్యాయం కావాలనీ, సమాన పనికి సమాన గౌరవం న్యాయమైన స్టైపెండ్, కల్పించాలనీ డిమాండ్ చేశారు.

## పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- రోడ్లపై ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం

గద్వాల నడిగడ్డ, ఆగస్టు 24 (జనం సాక్షి) : రోడ్లపై జరిగే ప్రమాద బాధితులకు నగదు రహిత వైద్య సేవలు అందించే పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హైదరాబాదు నుంచి వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ లో పీఎం రాహత్ పథకం రోడ్డు ప్రమాద బాధితులకు ఆసుపత్రి చికిత్స,భరోసాతో కూడిన వైద్య సేవల పథకం అంశాపై మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ జాతీయ రోడ్డు ప్రమాద బాధితులకు సకాలంలో వైద్య సహాయం అందించి,ప్రాణాలను కాపాడేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న పీఎం రాహత్ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి అన్ని శాఖల అధికారులను ఆదేశించారు.ఈ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల పాటు ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించాలని సూచించారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే రోడ్డు ప్రమాద కేసులను సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలన్నారు. బాధితుల వివరాల ధ్రువీకరణ కోసం ఆసుపత్రుల నుంచి వచ్చే అభ్యర్థనలపై పోలీసులు వెంటనే స్పందించాలని ఆదేశించారు.వాహనం బీమా పరిధిలో ఉన్న సందర్భాల్లో నిబంధనల ప్రకారం బీమా సంస్థల ద్వారా చికిత్స ఖర్చులను నేరుగా ఆసుపత్రులకు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఆసుపత్రులకు సంబంధించిన చికిత్స ఖర్చులకు సంబంధించిన క్లెయిమ్‌లను జిల్లా కలెక్టర్లు సంబంధిత పోర్టల్ ద్వారా క్రమం తప్పకుండా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆమోదించాలన్నారు.ఆమోదించిన క్లెయిమ్‌లను తదుపరి చెల్లింపుల కోసం ప్రభుత్వ ఆర్థిక నిర్వహణ పోర్టల్‌కు పంపించి, అందుబాటులో ఉన్న నిధుల మేరకు ఆసుపత్రులకు చెల్లింపులు సకాలంలో జరిగేలా పర్యవేక్షించాలని ఆదేశించారు.రాష్ట్ర ఆరోగ్య ప్రాధికార సంస్థ నుంచి అందే క్లెయిమ్‌లను జిల్లా కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించి, నిబంధనల ప్రకారం ఆమోదించాలని ఆదేశించారు. నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారాన్ని నమోదు చేయడం, పీఎం రాహత్ పథకం కింద క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. జిల్లా మేజిస్ట్రేట్ బాధ్యతల బదిలీ సమయంలో సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో అధికారిక ఇ-మెయిల్ చిరునామా, మొబైల్ నంబర్ వివరాలను తప్పనిసరిగా నవీకరించాలని పేర్కొన్నారు.జిల్లా రోడ్డు భద్రతా కమిటీలో జాతీయ సమాచార కేంద్రం జిల్లా సమాచార అధికారిని సభ్యుడిగా చేర్చి,రోడ్డు ప్రమాద కేసుల నమోదు,పథకం అమలుకు అవసరమైన సాంకేతిక సహకారం పొందాలని ఆదేశించారు.ప్రజలకు పథకంపై విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సంబంధిత మొబైల్ అనువర్తనం ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారాన్ని నమోదు చేయడం, చికిత్స ఖర్చుల చెల్లింపుల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.జిల్లా కలెక్టర్ నియమించిన ఫిర్యాదుల పరిష్కార అధికారి పథకానికి సంబంధించిన ఫిర్యాదులను పరిశీలించి,సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని తెలిపారు.వైద్య ఆరోగ్య శాఖ, పోలీస్ శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ కేసుల ధ్రువీకరణ,ఆమోద ప్రక్రియలను వేగవంతం చేయాలన్నారు. బాధితులకు చికిత్సలో జాప్యం జరగకుండా, అనవసరంగా ఆసుపత్రుల నుంచి డిశ్చార్జ్ చేసే పరిస్థితులు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.జిల్లా కలెక్టర్లు పథకం అమలును క్రమం తప్పకుండా సమీక్షిస్తూ,అర్హులైన బాధితులకు సకాలంలో వైద్య సేవలు అందేలా, ఆసుపత్రులకు చికిత్స ఖర్చుల చెల్లింపులు ఆలస్యం కాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఐడిఓసి వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి పలు శాఖల జిల్లా అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని మాట్లాడారు. ఈ సమావేశంలో ఆర్టీఓ రాధిక , డిపో మేనేజర్ శ్రవణ్, ఆర్ అండ్ బి ప్రగతి, డీఎంహెచ్ఓ సంధ్య కిరణ్మయి,ఇతర అధికారులు,తదితరులు పాల్గొన్నారు.



## ప్రజలకు నాణ్యమైన తాగునీరు అందించాలి

- జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

గద్వాల నడిగడ్డ, ఆగస్టు 24 (జనం సాక్షి) : జిల్లా ప్రజలకు నాణ్యమైన తాగునీటిని అందించే విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం ధరూర్ మండలం జూరాల ప్రాజెక్టు నందు జిల్లా మిషన్ భగీరథ కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ నీటి శుద్ధి ప్రక్రియ,నాణ్యత పరీక్షలు, రసాయనాల వినియోగం,సిబ్బంది హాజరు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..నీటి నాణ్యతను ఎప్పటికప్పుడు పరీక్షించి,ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పీహెచ్,టర్బిడిటీ, క్లోరిన్ స్థాయిలను నమోదు చేయాలని సూచించారు. ముడినీటి నాణ్యత ఆధారంగా జార్ టెస్టులు నిర్వహించి, అవసరమైన రసాయనాలను సరైన మోతాదులో వినియోగించాలని సూచించారు. నీటి నాణ్యత పరీక్షలు,రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యంపై సంబంధిత ఔట్‌సోర్సింగ్ ఏజెన్సీతో పాటు బాధ్యులకు షోకాజ్ నోటీసులు జారీ చేయాలని కలెక్టర్ ఆదేశించారు.ప్లాంటులో సిబ్బంది హాజరును క్రమం తప్పకుండా తనిఖీ చేసి,ఏజెన్సీ చూపిస్తున్న సిబ్బంది సంఖ్యకు,విధుల్లో ఉన్నవారి సంఖ్యకు వ్యత్యాసం లేకుండా చూడాలని ఆదేశించారు.సిబ్బంది హాజరు, విధుల నిర్వహణను పరిశీలించిన తర్వాతే ఏజెన్సీ బిల్లులు చెల్లించాలని సూచించారు. ప్లాంటులో పనిచేస్తున్న సిబ్బంది అందరి హాజరును మీ ప్రమాణం యాప్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని, హాజరు వివరాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని ఆదేశించారు.రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించి, వివరాలు నమోదు చేయడంతో పాటు సంబంధిత అధికారులు,ఏజెన్సీ ప్రతినిధుల సంతకాలు ఉండేలా చూడాలని ఆదేశించారు. నీటి సరఫరా సమయంలో అక్రమ కనెక్షన్లు ఏర్పాటు చేసుకోకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. నీటిని నిబంధనల ప్రకారం వినియోగించుకునేలా ప్రజలకు వివరించాలని, అక్రమ కనెక్షన్ల వల్ల ఇతరులకు నీటి సరఫరాలో ఇబ్బందులు కలగకుండా చూడాలని సూచించారు.నీటి సరఫరా వ్యవస్థను నిరంతరం పర్యవేక్షిస్తూ,అక్రమ కనెక్షన్లు గుర్తించినప్పుడు నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సురక్షితమైన తాగునీరు అందేలా అన్ని చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో మిషన్ భగీరథ ఈ.ఈ శ్రీధర్ రెడ్డి ,ఇరిగేషన్ ఈ ఈ సంజీవ ప్రసాద్, ధరూర్ తహసీల్దార్ నందిని,ఇంజినీర్లు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## భూ వివాదం నేపథ్యంలో హత్యాయత్నం

- తొమ్మిది మంది నిందితులు అదుపులోకి
- షాబాద్ ఇన్స్పెక్టర్ లక్ష్మిరెడ్డి



షాబాద్, అక్టోబర్ 24 (జనం సాక్షి) : మండల పరిధి లోని హైతాబాద్ లో గల సర్వే నంబర్ 202లోని భూమి మరియు ఇతర భూములకు సంబంధించిన దీర్ఘకాలిక వివాదం నేపథ్యంలో రెండు వర్గాల మధ్య ఘర్షణ శుక్రవారం చోటుచేసుకుంది. సమీప మసీదులో చర్చల కోసం సమావేశమైన సమయంలో ఈ ఘటనకు పాల్పడిన అగాధకులు. పోలీసుల దర్యాప్తు ప్రకారం, చాంద్ పాషా మరియు అతని కుమారులైన సోహెల్, ఫైజల్‌లపై దాడి చేయడానికి నిందితులు ముందస్తు పథకం వేసుకున్నట్లు వెల్లడైంది. ఈ క్రమంలో రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్‌పై ఆయుధాలతో అక్కడికి చేరుకుని వారిపై దాడికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఘర్షణ సమయంలో ముజఫర్ ఉద్దీన్ ఒక వ్యక్తిపై కత్తితో దాడి చేసినట్లు దర్యాప్తులో వెల్లడైంది. అనంతరం జరిగిన ఘర్షణలో వాహనాలు కూడా ధ్వంసమయ్యాయి. ఈ కేసులో షాబాద్ పోలీసులు తొమ్మిది మంది నిందితులను అదుపులోకి తీసుకున్నారు. పంచుల సమక్షంలో నిర్వహించిన విచారణలో భాగంగా రెండు కార్లు, ఒక మోటార్ సైకిల్, రెండు క్రికెట్ బ్యాట్‌లు, కత్తి మరియు పలు మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో దర్యాప్తు కొనసాగుతోంది. చట్టప్రకారం తదుపరి చర్యలు తీసుకోబడతాయి అని తెలిపారు.

## ఎస్ఐఆర్ ను వ్యతిరేకిస్తూ బాలానగర్‌లో ప్రజాసంఘాల నిరసన

- సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్



బాలానగర్, అక్టోబర్ 24 (జనం సాక్షి) : బాలానగర్ మండల కేంద్రంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) ను వ్యతిరేకిస్తూ, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షులు దీప్లా నాయక్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు పి. జగన్ పాల్గొని మాట్లాడారు. బంగ్లాదేశ్ నుంచి వచ్చిన రోహింగ్యాల పేరుతో దేశంలో 13 కోట్ల మంది ఓట్లను తొలగించి ఓటు హక్కును కాలరాసే విధంగా ఎన్నికల కమిషన్ చైర్మన్ ఏకపక్ష నిర్ణయం తీసుకోవడాన్ని దేశవ్యాప్తంగా ప్రజలు, యువత వ్యతిరేకిస్తున్నారని అన్నారు. బీజేపీకి వ్యతిరేకంగా ఓటు వేసే వారిని లక్ష్యంగా చేసుకుని దళితులు, ఆదివాసీలు, ముస్లింలు, గిరిజనుల ఓట్లను ప్రధానంగా తొలగిస్తున్నారని ఆరోపించారు. కేంద్రంలో ఏ ఎన్నిక జరిగినా బీజేపీ గెలిచేలా కుట్రలు జరుగుతున్నాయని ప్రజలు గ్రహించి రోడ్లపైకి వస్తున్నారన్నారు. దేశ ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని ధ్వంసం చేసేలా ఎన్నికల కమిషన్ వ్యవహరిస్తోందని, పశ్చిమ బెంగాల్, బీహార్ ఎన్నికల్లో ఇది రుజువైందన్నారు. రాజ్యాంగం కల్పించిన హోదాలో పనిచేయాల్సిన ఎన్నికల కమిషన్ బీజేపీకి లొంగిపోయిందని, జ్ఞానేష్ కుమార్ చీఫ్ ఎలక్షన్ కమిషనర్ గా పనికిరారని ప్రజాస్వామ్యవాదులు, మేధావులు, విద్యావంతులు, యువకులు ఆందోళనలు చేస్తున్నా సుప్రీంకోర్టు స్పందించడం లేదన్నారు. ఎన్నికల కమిషన్, సుప్రీంకోర్టు ఇలా వ్యవహరిస్తే ప్రజలకు వాటిపై నమ్మకం పోయి ప్రజాస్వామ్యం మిగలదని, వెంటనే జ్ఞానేష్ కుమార్ రాజీనామా చేసి దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నాగరాజు, యాదయ్య, ఆటో వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు జంగయ్య, ఏరియా నాయక్, గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ నాయకురాలు లక్ష్మమ్మ, నీలమ్మ, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వైఫల్యాలకు ఓటుతో సమాధానం చెప్పాలి

ఖైరతాబాద్, అక్టోబర్ 24 (జనం సాక్షి) : రానున్న మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ పట్టభద్రుల శాసన మండలి ఎన్నికల్లో అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఖైరతాబాద్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇంచార్జ్ మన్నె గోవర్ధన్ రెడ్డి(ఎంజీఆర్) పిలుపునిచ్చారు.శనివారం ఖైరతాబాద్ నియోజకవర్గం లోని ఖైరతాబాద్ డివిజన్ ఎర్రమంజిల్ కాలనీలో పట్టభద్రులకు ఓటరు నమోదు దరఖాస్తు ఫారాల ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంజీఆర్ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. ఆరు గ్యారెంటీలు, ఇతర హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, విద్యావంతులు, నిరుద్యోగులు, యువతతో పాటు వివిధ వర్గాల ప్రజల ఆశలను వమ్ము చేసిందని ఆరోపించారు.ప్రజలు ఎదుర్కొం టున్న సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ, తమ అభిప్రాయాన్ని ఓటు ద్వారా తెలియజేయడానికి పట్టభద్రుల ఎన్నికలు కీలకమని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి పట్టభద్రుడు ఓటరు నమోదు ప్రక్రియను నిర్లక్ష్యం చేయకుండా పూర్తి చేసుకోవాలని సూచించారు. ప్రజా సమస్యలపై పోరాడే నాయకులకు, ప్రజల గొంతుకగా నిలిచే అభ్యర్థులకు పట్టభద్రులు మద్దతుగా నిలవాలని కోరారు. రానున్న పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వ పాలనకు ప్రజలు తగిన సమాధానం చెబుతారని ఎంజీఆర్ ధీమా వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో బిట్ల శ్రీనివాస్ రాజు, రామచందర్, సుధాకర్, ప్రభాకర్ రెడ్డి, నరసింహ, రావుల విజయ్, ధనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం - 2026 పోస్టర్‌ను ఆవిష్కరించిన జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే



అమీర్పేట్ / జూబ్లీహిల్స్, ఆగస్టు 24 (జనం సాక్షి) : హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో నిర్వహించిన శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం - 2026 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే శ్రీ వి. నవీన్ యాదవ్ గారు పాల్గొని సమ్మేళనం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వాహక కమిటీ ప్రతినిధులు, ప్రజాప్రతినిధులు మాట్లాడుతూ.. నవంబర్ 4వ తేదీ నుంచి శ్రీకృష్ణ సదర్ ఉత్సవాలు ప్రారంభం కానున్నాయని, రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. యాదవుల ఐక్యత, సంప్రదాయాలు, సంస్కృతిని ప్రతిబింబించేలా ఈ ఉత్సవాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ యాదవ సంఘాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ జిల్లాల నాయకులు, సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలి

శామీర్‌పేట్, అక్టోబర్ 24 (జనం సాక్షి) : తెలంగాణ రాష్ట్రంలోని కార్మికుల సమస్య పరిష్క రించాలని కోరుతూ ఈ నెల 25,26న ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తుందని మూడు చింతలపల్లి మున్సిపల్ కార్మికులు మున్సిపల్ ఆఫీస్ వద్ద, జగన్ కూడా ఆఫీస్ వద్ద ధర్నా పోస్టర్ని విడుదల చేశారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్ మాట్లాడుతూ 25న పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికులు, 26న రాష్ట్రంలో ఆశ ,అంగన్వాడి ,మధ్యాహ్న భోజనం, బిల్డింగ్ కన్స్ట్రక్షన్ వర్కర్స్, ఆటో, మున్సిపల్ కార్మికుల పాల్గొంటారని తెలియజేశారు. మున్సిపల్ కార్మికుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎన్ శ్రీనివాస్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు . మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయ్యాలని, రెండవ పీఆర్సీని ప్రకటించాలని, కనీస వేతనాన్ని నెలకు 30,000 రూపాయలు నిర్ణయించాలని, డీఏ అమలు చేయాలని యూనియన్ నాయకులు కోరారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో వేలాది మంది కార్మికులు పారిశుద్ధ్యం, చెత్త సేకరణ, రవాణా తదితర కీలక విధులు నిర్వ హిస్తున్నారు. ప్రజల ఆరోగ్యాన్ని కాపాడుతూ పట్టణాల పరిశుభ్రత కోసం నిరంతరం శ్రమిస్తున్న కార్మికులకు సరైన వేతనాలు, ఉద్యోగ భద్రత, సామాజిక భద్రత కల్పించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం అన్యాయమని యూనియన్ పేర్కొందన్నారు.కార్మికుల సమస్యలను పరిష్క రించాల్సిన ప్రభుత్వం వారి న్యాయమైన డిమాండ్లను పట్టించుకోకపోవడం వల్ల కార్మికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పెరుగు తున్న ధరలకు అనుగుణంగా వేతనాలు, కుటుంబ పోషణ భారంగా మారింది. ఉద్యోగ భద్రత, పెన్షన్, ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య సదుపాయాలు వంటి హక్కులను సమర్థవంతంగా అమలు చేయాలని యూనియన్ డిమాండ్ చేసింది. ప్రధాన డిమాండ్ల సాధన కోసం అక్టోబర్ 26న హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద నిర్వహించనున్న ధర్నాలో మున్సిపల్ కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పిలుపునిచ్చిందన్నారు. కార్మికుల ఐక్యతతోనే న్యాయమైన హక్కులను సాధించగలమని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యూనియన్ నాయకులు కోరారు.ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి కె . ఉన్నికృష్ణన్ మున్సిపల్ జిల్లా నాయకులు ప్రశాంత్,శ్రీను, రమేష్ ,బలేష్ , బిక్షపతి, మున్సిపల్ కార్మికులు పాల్గొన్నారు.



## ఎస్ఐఆర్ ప్రక్రియను నిలిపివేయాలి

- జడ్చర్లలో ప్రజా సంఘాల నిరసన



జడ్చర్ల, అక్టోబర్ 24 (జనంసాక్షి) : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్.ఐ.ఆర్) పేరుతో అక్రమంగా ఓట్లను తొలగిస్తున్నారని ఆరోపిస్తూ శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సి.ఐ.టి.యు, కె.వి.పి.ఎస్, డి.వై.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో జడ్చర్ల నేతాజీ చౌరస్తాలో నిరసన నిర్వహించారు. ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను రద్దు చేయాలని, కేంద్ర ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్‌ను పదవి నుండి తొలగించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా నాయకులు దీప్లా నాయక్, పోలే జగన్, పి. నాగరాజు మాట్లాడుతూ ఎస్.ఐ.ఆర్ పేరుతో దేశవ్యాప్తంగా తొలగించిన 13.50 కోట్ల ఓట్లను వెంటనే పునరుద్ధరించాలన్నారు. రాజ్యాంగంలోని 326వ అధికరణ ప్రకారం పౌరులందరికీ ఓటు హక్కు కల్పించాలని, పత్రాల పేరుతో పేదలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీల ఓట్లను తొలగించడం దుర్మార్గమన్నారు. ఈ ప్రక్రియను నిలిపివేయకపోతే నిరసనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లక్ష్మీదేవి, బాల్ చెన్నయ్య, సాయిలు, యాదయ్య, కృష్ణయ్య, గగరిన్ తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల ఓటు నమోదుపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి

**వనపర్తి రూరల్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో అర్హులైన పట్టభద్రులందరూ తమ ఓటు హక్కును నమోదు చేసుకునేలా అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డిని ఆయన స్వయంగా కలిసి, పట్టభద్రుల ఓటు నమోదు ప్రక్రియపై అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేయాలని కోరారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హుడైన పట్టభద్రుడు తన ఓటును నమోదు చేసుకోవడం బాధ్యతగా భావించాలని అన్నారు. జిల్లా స్థాయిలోని అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు తమ పరిధిలోని అర్హులైన పట్టభద్రులకు ఓటు నమోదు ప్రాధాన్యతను వివరించి, వారంతా నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు.

పట్టభద్రుల ఓటు నమోదు బాధ్యతగా తీసుకోవాలి

అనంతరం వనపర్తి పట్టణంలోని గర్ల్స్ హైస్కూల్, ఇతర ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నిరంజన్ రెడ్డి పర్యటించారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులతో మాట్లాడి



పట్టభద్రుల ఓటు నమోదు ఆవశ్యకతను వివరించారు. తమతో పాటు తమకు తెలిసిన అర్హులైన పట్టభద్రులందరూ ఓటు నమోదు చేసుకునేలా అవగాహన కల్పించాలని కోరారు. ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో వజ్రాయుధం వంటిదని, దానిని సద్వినియోగం చేసుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేలా సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### కలెక్టర్, ఎస్పీలకు శుభాకాంక్షలు

నూతన జిల్లాల ఏర్పాటుకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా నిర్వహిస్తున్న దశాబ్ది ఉత్సవాలను పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, జిల్లా ఎస్పీ సునీతా రెడ్డిలను మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు పలుస రమేష్ గౌడ్ కలెక్టర్ ఆదర్శ్ సురభిని, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్ ఎస్పీ సునీతా రెడ్డిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, పలుస రమేష్ గౌడ్, నందిమల్ల అశోక్, గంధం పరంజ్యోతి, కురుమూర్తి యాదవ్, విజయ్ కుమార్, గంధం బాలపీరు, జాత్రు నాయక్, గులాం ఖాదర్ ఖాన్, కె. మాణిక్యం, భాను ప్రకాష్ రావు, వెంకట్ సాగర్, ఉంగ్లం తిరుమల్, నాగన్న యాదవ్, ధర్మా నాయక్, మహేశ్వర్ రెడ్డి, జోహెబ్ హుస్సేన్, సయ్యద్ జమీల్, సూర్యవంశం గిరి, చిట్యాల రాము, నీలస్వామి, పెద్దముక్కల రవి, బొబ్బిలి ప్రేమ్ కుమార్, అస్లాం, లక్ష్మణ్ గౌడ్, శివ గౌడ్, ఖాదర్ పాల్గొన్నారు.

# సర్పంచ్‌పై కాంగ్రెస్ నాయకుల దాడి



**సిర్గాపూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** సిర్గాపూర్ మండలంలోని సంగెం గ్రామ బీఆర్ఎస్ పార్టీకి చెందిన సర్పంచ్‌పై ఆయన భార్యతో పాటు కుటుంబ సభ్యులపై కాంగ్రెస్ నాయకులు చేసిన దాడి ఘటన తీవ్ర ఆగ్రహం కలిగిస్తోంది.ఇటువంటి దాడులు ప్రజాస్వామ్యానికే మచ్చగా అభివర్ణించిన జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ నాయకులు గుర్రపు మచ్చేందర్.. అధికారంలో ఉన్నామనే అహంకారంతో దౌర్జన్యాలకు పాల్పడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని హెచ్చరించారు. ప్రజాప్రతినిధులకే రక్షణ లేకపోతే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ, పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని అన్నారు. అనంతరం ఆ కుటుంబాన్ని పరామర్శించి వారికి ధైర్యం చెప్పిన బీఆర్ఎస్ నాయకులు జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ గుర్రపు మచ్చేందర్, వారితో పాటుగా ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

## పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం



**వనపర్తి రూరల్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పోలీస్ అమరవీరుల దినోత్సవం సందర్భంగా నిర్వహిస్తున్న వారోత్సవాల్లో భాగంగా ఆయన పోలీస్ అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన పోలీస్ అమరవీరుల ఫొటో గ్యాలరీని పరిశీలించారు. ఈ సందర్భంగా నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ... సమాజంలో శాంతిభద్రతలను కాపాడుతూ ప్రజల రక్షణ కోసం పోలీసులు నిరంతరం విధులు నిర్వహిస్తున్నారని కొనియాడారు. ప్రజల ప్రాణ, ఆస్తుల రక్షణతో పాటు సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు పోలీస్ శాఖ అత్యంత బాధ్యతాయుతంగా పనిచేస్తోందన్నారు. విధి నిర్వహణలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొంటూ ప్రజాసేవకు అంకితమవుతున్న పోలీసుల సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. దేశం కోసం, ప్రజల రక్షణ కోసం ప్రాణత్యాగం చేసిన పోలీస్ అమరవీరుల సేవలను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఆయన అన్నారు. అమరుల కుటుంబాలకు సమాజం అండగా నిలవాలని, వారి సంక్షేమానికి తోడ్పడటంతో పాటు అమరవీరుల ఆశయాల సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పోలీస్ అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తినిస్తాయని, వారి సేవలను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని నిరంజన్ రెడ్డి పేర్కొన్నారు.

# రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.5 లక్షల వరకు నగదు రహిత వైద్యం

- పీఎం రాహత్ పథకాన్ని పకడ్బందీగా అమలు చేయాలి
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన క్షతగాత్రులకు నగదు రహితంగా అత్యవసర వైద్య చికిత్సలు అందించి, వారి ప్రాణాలను కాపాడేందుకు ఉద్దేశించిన ప్రధానమంత్రి రాహత్ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. పీఎం రాహత్ పథకం అమలు, విధివిధానాలపై శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు జిల్లా కలెక్టర్లు, పోలీసు, వైద్య శాఖల ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా పథకం అమలులో వైద్య శాఖ, ఆరోగ్యశ్రీ, పోలీసు శాఖలతో పాటు జిల్లా కలెక్టర్ల బాధ్యతలను వివరించారు. రోడ్డు ప్రమాదంలో ఎవరైనా గాయపడితే వెంటనే 112 లేదా 108కు సమాచారం అందించి, సమీపంలోని ప్రభుత్వ లేదా ప్రైవేటు ఆసుపత్రికి తరలించాలని అధికారులు సూచించారు. ఆరోగ్యశ్రీ పరిధిలోని ఆసుపత్రుల్లో క్షతగాత్రుల వివరాలను టీఎంఎస్ పోర్టల్‌లో నమోదు చేసి, నగదుతో సంబంధం లేకుండా అత్యవసర వైద్య చికిత్సలు అందిస్తారు. ఈ వివరాలను సంబంధిత పోలీస్ స్టేషన్‌కు పంపిస్తారు. స్టేషన్ హౌస్ ఆఫీసర్ ప్రమాద స్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, ఆసుపత్రికి నివేదిక అందజేస్తారు. ఈ పథకం కింద ఒక్కో ప్రమాద బాధితుడికి రూ. 1.5 లక్షల వరకు అత్యవసర వైద్య చికిత్సలు అందించి ప్రాణాలను కాపాడటం ప్రధాన లక్ష్యమని అధికారులు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి జిల్లా కలెక్టర్ ఖాతాకు నిధులు జమ కాగా, వాటిని సంబంధిత ఆసుపత్రులకు చెల్లించే విధానం అమల్లో ఉంటుందని వివరించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ ఆదర్శ్ సురభి మాట్లాడుతూ, వనపర్తి జిల్లాలో ప్రభుత్వ ఆసుపత్రులతో పాటు శ్రీ సరోజినీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, సుధా నర్సింగ్ హోమ్, రాహుల్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్, త్రినేత్ర హాస్పిటల్ తదితర మొత్తం తొమ్మిది ఆసుపత్రులు పీఎం రాహత్ పథకంలో నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో ఎక్కడ రోడ్డు ప్రమాదం జరిగినా బాధితులకు వెంటనే పథకం కింద అత్యవసర వైద్యం



అందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య అధికారిని ఆదేశించారు. అలాగే, తమ పరిధిలో జరిగే రోడ్డు ప్రమాదాలను పోలీసులు సకాలంలో ధ్రువీకరించి, సంబంధిత ఆసుపత్రులకు నివేదికలు పంపేలా చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖ అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్, డీఎస్పీ బాలాజీ నాయక్, డీఆర్వో రాంరెడ్డి, సెక్షన్ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

- పాఠశాలల్లో కల్తీ ఆహారం ఘటనలు జరిగితే కఠిన చర్యలు
- కలెక్టర్ ఆదర్శ్ సురభి

**వనపర్తి, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** జిల్లాలోని అన్ని పాఠశాలలు, వసతి గృహాల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. కల్తీ ఆహారం కారణంగా విద్యార్థులు అస్వస్థతకు గురైనట్లు తెలిస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శనివారం వీడియో కాన్ఫరెన్స్ హాల్లో విద్యాశాఖ, సంబంధిత శాఖల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై సమీక్షించారు. సెలవుల అనంతరం విద్యాసంస్థలు పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించే విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని స్పష్టం చేశారు. జిల్లాలోని అన్ని పీఎం శ్రీ



పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో (కేజీబీవీ) విద్యార్థినులకు కరాటే వంటి ఆత్మరక్షణ విద్యల్లో శిక్షణ ఇచ్చేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. పీఎం శ్రీ పాఠశాలలకు మ్యాథ్స్ కిట్లు, సైన్స్ కిట్లు, కెరీర్ గైడెన్స్ కోసం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకోవాలని ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. వివిధ పథకాల కింద పాఠశాలలు, జూనియర్ కళాశాలలకు మంజూరైన అదనపు గదులు, మరుగుదొడ్ల తదితర నిర్మాణ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పనులు పూర్తయిన వెంటనే సంబంధిత కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. వనపర్తి జిల్లాలో మరుగుదొడ్లు లేని పాఠశాల లేదా కళాశాల ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రతి విద్యాసంస్థలో ఉపయోగంలో ఉండే మరుగుదొడ్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా మరుగుదొడ్లు లేని పాఠశాలలు, కళాశాలలు ఉంటే వివరాలతో నివేదిక అందించాలని, వాటికి వెంటనే మంజూరు ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి యాదయ్య, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి నాగేంద్ర కుమార్, టీఎస్ ఈడబ్ల్యూఐడీసీ కార్యనిర్వాహక ఇంజినీర్ వెంకటరెడ్డి, మండల విద్యాధికారులు, క్లస్టర్ ఇన్‌చార్జిలు తదితరులు పాల్గొన్నారు.

## మున్సిపల్ కార్మికులకు రూ.30 వేల కనీస వేతనం ఇవ్వాలి

- పెండింగ్ పీఆర్సీని వెంటనే ప్రకటించాలి
- సీఐటీయూ



**నర్సాపూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** మున్సిపల్ కార్మికులకు బాగా పెండింగ్‌లో ఉన్న రెండో పీఆర్సీని వెంటనే ప్రకటించి, కనీస వేతనాన్ని రూ. 30 వేలకు పెంచాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కడారి నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో శనివారం నర్సాపూర్ మున్సిపల్ మేనేజర్ మధుసూదన్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు సరైన ఆరోగ్య, భద్రతా సౌకర్యాలు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగాలు కల్పించాలని, నిబంధనల ప్రకారం నియామకాలు చేపట్టాలని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా 60 వేల మందికి పైగా మున్సిపల్ కార్మికులు ఔట్‌సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతుల్లో పనిచేస్తున్నారని తెలిపారు. వారికి ఉద్యోగ భద్రత, ఆరోగ్య సదుపాయాలు లేకపోవడంతో విధి నిర్వహణలో ప్రమాదాల బారిన పడుతున్నారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో మున్సిపల్ కార్మికుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చినప్పటికీ, ఇప్పటివరకు అమలు చేయలేదని విమర్శించారు. కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 26న హైదరాబాద్ చలో కార్యక్రమంలో భాగంగా రాష్ట్రవ్యాప్త పోరాటానికి తెలంగాణ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపునిచ్చిందని తెలిపారు. ఈ పోరాటంలో పాల్గొనేందుకు అనుమతి ఇవ్వాలని మున్సిపల్ మేనేజర్‌ను కోరినట్లు చెప్పారు. డిమాండ్లను పరిష్కరించకపోతే భవిష్యత్తులో పెద్దఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు పుష్ప, రాములు, అనిత, అశోక్‌తో పాటు పలువురు మున్సిపల్ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మెరుగైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యం

- మంత్రి వాకిటి శ్రీహరి

**ఆత్మకూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** ఆత్మకూరు పట్టణంలో 28 కోట్ల వ్యయంతో నిర్మిస్తున్న 50 పడకల ఆసుపత్రి నిర్మాణ పనులను మంత్రి వాకిటి శ్రీహరి శనివారం పరిశీలించారు. నిర్మాణ పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు సైతం మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు. ఆధునిక వైద్య సదుపాయాలతో ఆసుపత్రి అందుబాటులోకి వస్తే ఆత్మకూరు పరిసర ప్రాంతాల ప్రజలకు ఎంతో ప్రయోజనం కలుగుతుందన్నారు. అత్యవసర వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన ఇబ్బందులు తగ్గి, స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. ప్రజల ఆరోగ్యానికి ప్రాధాన్యతనిస్తూ, మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి వాకిటి శ్రీహరి స్పష్టం చేశారు. ఆసుపత్రి నిర్మాణాన్ని నిర్ణీత ప్రమాణాలతో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. అనంతరం ఆత్మకూరు పట్టణంలో 60 లక్షల వ్యయంతో నూతన మార్కెట్ యార్డ్ భవన నిర్మాణాన్ని మంత్రి వాకిటి శ్రీహరి పరిశీలించారు, త్వరగా నిర్మాణాన్ని చేసి నిర్ణీత ప్రమాణాలతో పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా అడిషనల్ కలెక్టర్ కీమ్యా నాయక్, ఆర్డీఓ సుబ్రహ్మణ్యం, ఎమ్మార్వో చాంద్ పాషా , ఎంపీడీవో, మార్కెట్ యార్డ్ చైర్మన్ రహమతుల్లా, మున్సిపల్ చైర్మన్ జి నాగమణి , వైస్ చైర్మన్ నల్గొండ శ్రీనివాసులు , డిసిసి జిల్లా కార్యదర్శి తులసి రాజ్ యాదవ్, కాంగ్రెస్ మండల అధ్యక్షులు నాగేష్, టౌన్ అధ్యక్షులు ఇర్లదిన్నె శ్రీనివాసులు , కౌన్సిలర్లు ,ప్రభుత్వ శాఖల అధికారులు మండలంలోని గ్రామ సర్పంచ్లు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం

- వనపర్తిలో పోలీసు అమరవీరుల స్మారక బైక్ ర్యాలీ



**వనపర్తి, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా వనపర్తి పట్టణంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. జిల్లా పోలీసు కార్యాలయం నుంచి కేడీఆర్ పాలిటెక్నిక్ కళాశాల వరకు జిల్లా ఎస్పీ డి. సునీత రెడ్డి,ఆధ్వర్యంలో ఈ ర్యాలీ కొనసాగింది. విధి నిర్వహణలో ప్రాణాలర్పించిన పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకోవడంతో పాటు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్పీ డి. సునీత రెడ్డి మాట్లాడుతూ ప్రజల ధన, మాన, ప్రాణాల రక్షణ కోసం విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసు అమరవీరుల సేవలు, త్యాగాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. వారి త్యాగాలు పోలీసు శాఖకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తాయని తెలిపారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది అమరవీరుల ఆశయాలకు అనుగుణంగా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని సూచించారు. అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన బైక్ ర్యాలీ ద్వారా పోలీసుల సేవలు, బాధ్యతలపై ప్రజలకు అవగాహన కల్పించడమే ప్రధాన ఉద్దేశమని ఆమె తెలిపారు. ప్రజల సహకారంతో శాంతిభద్రతల పరిరక్షణకు, సమాజ భద్రతకు పోలీసు శాఖ నిరంతరం కృషి చేస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాయుధ దళ అదనపు ఎస్పీ వీరారెడ్డి, వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, వనపర్తి సీఐ సుగంధ రత్నం, కొత్తకోట సీఐ రమేష్, ఆత్మకూరు సీఐ శివకుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ నరేష్, రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు అప్పలనాయుడు, శ్రీనివాస్, జిల్లాలోని ఎస్సైలు, పోలీసు సిబ్బంది, యువకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా
- వ్యక్తిగత సమాచారం భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత
- డిజిటల్ అరెస్ట్, నకిలీ ప్రొఫైల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలి
- సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** సైబర్ మోసాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అన్నారు. శనివారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులకు సైబర్ నేరాల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, జిల్లా ఎస్పీ డి. జానకి, ఐపీఎస్ సైబర్ భద్రతపై పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ ప్రస్తుత డిజిటల్ యుగంలో సైబర్ నేరాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. స్మార్ట్‌ఫోన్లు, బ్యాంకు ఖాతాలు, క్రెడిట్, డెబిట్ కార్డులు, వివిధ డిజిటల్ సేవలను వినియోగించే సమయంలో వ్యక్తిగత సమాచారం భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. యాప్‌ల నిబంధనలను చదవకుండా అంగీకరించడం వల్ల వ్యక్తిగత గోప్యతకు భంగం కలిగే అవకాశం ఉందన్నారు. ఆధార్, పాన్ కార్డు వివరాలు, బ్యాంకు ఖాతా సమాచారం, ఓటీపీలు ఇతరులతో పంచుకోవద్దని, అనుమానాస్పద లింకులను తెరవవద్దని సూచించారు. ప్రభుత్వ అధికారులు, ఉన్నతాధికారుల పేరుతో ఫోన్ చేసి బెదిరించడం, డిజిటల్ అరెస్ట్ పేరుతో భయాందోళనలకు గురిచేయడం వంటి మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద కాల్స్ వచ్చినప్పుడు తొందరపడి స్పందించకుండా సంబంధిత వ్యక్తులను సంప్రదించి వాస్తవాలను నిర్ధారించుకోవాలని పేర్కొన్నారు. సైబర్ భద్రతపై కార్యాలయాల్లోని అన్ని స్థాయుల సిబ్బందితో పాటు వారి కుటుంబ సభ్యులకు కూడా అవగాహన కల్పించాలని కలెక్టర్ కోరారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించి సైబర్ నేరాల నివారణకు సహకరించాలని తెలిపారు. ఈ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న పోలీసు శాఖను ఆమె అభినందించారు.



సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలి

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డి.జానకి సూచించారు. నేషనల్ సైబర్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ ద్వారా జిల్లాలో సైబర్ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అందుతున్నాయని తెలిపారు. సైబర్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి పలువురు తమ కష్టార్జితాన్ని కోల్పోతున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయి శివాని, రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, జిల్లా రెవెన్యూ అధికారి నిర్మల, సైబర్ క్రైమ్ డీఎస్పీ గురుకుమార్, వివిధ శాఖల అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్‌నినో నేపథ్యంలో విద్యుత్ పొదుపు చేయాలి

◻ జయశంకర్ భూపాలపల్లి కలెక్టర్ రాహుల్ శర్మ



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉన్నందున విద్యుత్ వినియోగాన్ని తగ్గించి పొదుపుగా వాడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ అధికారులకు, ఉద్యోగులకు సూచించారు. ఈ మేరకు శనివారం అన్ని శాఖలకు సర్క్యులర్ జారీ చేశారు. విద్యుత్ వృథాను అరికట్టడం ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించి ప్రభుత్వ కార్యాలయాల నుంచే పొదుపు కార్యక్రమాన్ని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. కలెక్టరేట్ తో పాటు డివిజన్, మండల కార్యాలయాల్లో పగటిపూట తగినంత సహజ వెలుతురు ఉన్నా లైట్లు వాడటం, గదుల్లో ఎవరూ లేకున్నా లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు ఆన్ లో ఉంచడం గమనించినట్లు పేర్కొంటూ దీనిని వెంటనే నివారించాలని స్పష్టం చేశారు. పగటిపూట సహజ వెలుతురును వినియోగించుకోవాలని, భోజన విరామం, సమావేశాలు, క్షేత్ర పర్యటనల సమయంలో గదులు ఖాళీగా ఉన్నప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఏసీలు, కంప్యూటర్లను తప్పనిసరిగా ఆఫ్ చేయాలని సూచించారు. ఏసీలను అవసరమైనప్పుడు మాత్రమే 24 నుంచి 26 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలో ఉంచి వాడాలని, ఏసీ పనిచేసేటప్పుడు తలుపులు, కిటికీలు మూసి ఉంచాలని, విధులు ముగిసిన వెంటనే అన్ని పరికరాలను పూర్తిగా ఆఫ్ చేయాలని, స్టాండ్ బై మోడ్ లో ఉంచరాదని తెలిపారు. ప్రతి శాఖ అధికారి తమ కార్యాలయంలో విద్యుత్ పొదుపు నిబంధనలు అమలయ్యేలా చూడాలని, ఎల్‌నినో నేపథ్యంలో నీరు, విద్యుత్ వంటి వనరులను పొదుపుగా వాడటం ద్వారా ప్రజలకు ఆదర్శంగా నిలవాలని పిలుపునిచ్చారు. కార్యాలయాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని, నిబంధనలు ఉల్లంఘించి విద్యుత్ వృథా చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# పునర్నిర్మాణ పనులు వేగవంతం చేయాలి

◻ దేవదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు



**కాళేశ్వరం, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకుని జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని కాళేశ్వరంలో పుష్కరఘాట్ల అభివృద్ధి పనులతో పాటు శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం పునర్నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయాలని రాష్ట్ర దేవాదాయ శాఖ కమిషనర్ హనుమంతరావు అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. శనివారం జయశంకర్ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి కాళేశ్వరం క్షేత్రంలో పర్యటించిన కమిషనర్ దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ తదితర శాఖల ఆధ్వర్యంలో చేపడుతున్న అభివృద్ధి పనుల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేపట్టిన అన్ని పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, నిర్మాణ నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న నిర్మాణ పనులను కమిషనర్ ప్రత్యేకంగా పరిశీలించారు. అన్ని నిర్మాణ పనులను సమాంతరంగా చేపట్టి, అవసరమైనంత మంది కార్మికులను నియమించి షిఫ్టుల వారీగా పనులు నిర్వహించాలని కాంట్రాక్టర్‌కు సూచించారు. అక్షరాభ్యాస మండపం, అద్దాల మండపం నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు.ఆలయ పునర్నిర్మాణాన్ని రూపొందించిన ప్రణాళికకు, సంప్రదాయ వాస్తు నిబంధనలకు అనుగుణంగా చేపట్టాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో ఎలాంటి మార్పులు, వ్యత్యాసాలు చోటుచేసుకోకుండా సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షించాలన్నారు. నిర్మాణ పనుల్లో నాణ్యతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని కమిషనర్ స్పష్టం చేశారు. ముఖ్యంగా కాంక్రీట్ పనుల్లో వైబ్రేటర్లను వినియోగించాలని, గోనె సంచులు, వరి గడ్డితో తగిన విధంగా వాటర్ క్యూరింగ్ చేపట్టాలని సూచించారు. ప్రతి నిర్మాణ పనిని సాంకేతిక ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టి పటిష్ఠంగా పూర్తి చేయాలన్నారు. వచ్చే నెల 4వ తేదీన రాష్ట్ర మంత్రి శ్రీధర్ బాబు కాళేశ్వరం పర్యటనకు రానున్న నేపథ్యంలో అప్పటిలోగా పనుల్లో గణనీయమైన పురోగతి సాధించాలని, నిర్మాణాలు స్పష్టమైన రూపు సంతరించుకునేలా చర్యలు తీసుకోవాలని కమిషనర్ ఆదేశించారు.గోదావరి పుష్కరాలకు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. తాగునీరు, రహదారులు, పార్కింగ్, వీఐపీ ఘాట్లు తదితర మౌలిక సదుపాయాల పనులను వేగవంతం చేయాలన్నారు. గత పుష్కరాల సందర్భంగా ఎదురైన సమస్యలను దృష్టిలో ఉంచుకొని ఈసారి మరింత పటిష్ఠమైన కార్యాచరణ రూపొందించాలని తెలిపారు. పుష్కరాల సమయంలో భక్తుల రద్దీని సమర్థంగా నియంత్రించేందుకు అవసరమైన ప్రాంతాల్లో వాచ్ టవర్లు, చెక్‌పోస్టులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పుష్కరఘాట్లకు ఇరువైపులా ర్యాంపుల నిర్మాణం చేపట్టాలని, గోదావరిలో పుష్కర స్నానాలు ఆచరించే భక్తుల భద్రతకు అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేస్తూ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కాళేశ్వరంలో ఆలయ పునర్నిర్మాణ పనులతో పాటు గోదావరి పుష్కరాల అభివృద్ధి పనులను నిరంతరం పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసుకుంటూ పనులను వేగవంతం చేసి నిర్దేశిత గడువులోగా పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. ఈ పర్యటనలో కాటారం సబ్ కలెక్టర్ సౌరవ్ శర్మ, దేవాదాయ, నీటిపారుదల, రోడ్లు భవనాలు, పంచాయతీరాజ్ శాఖల ఇంజినీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# 27 నుంచి ఆర్ట్స్ కళాశాలలో క్రీడా పోటీలు



**హనుమకొండ ప్రతినిధి అక్టోబర్ 24 (జనం సాక్షి) :** హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఈ నెల 27వ తేదీ నుంచి అంతర్ కళాశాల బాలుర క్రీడా పోటీలను నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య సుంకరి జ్యోతి తెలిపారు. ఈ పోటీల్లో కాకతీయ విశ్వవిద్యాలయం పరిధిలోని వివిధ డిగ్రీ కళాశాలలకు చెందిన క్రీడాకారులు పాల్గొననున్నారని ఆమె పేర్కొన్నారు.పోటీల్లో పాల్గొనే విద్యార్థులు తమ తమ కళాశాలల నుంచి జారీ చేసిన గుర్తింపు పత్రాలను తప్పనిసరిగా వెంట తీసుకురావాలని, నిర్ణీత క్రీడా నిబంధనలను పాటిస్తూ పోటీల్లో పాల్గొనాలని ప్రిన్సిపాల్ సూచించారు. క్రీడాకారులకు అవసరమైన సౌకర్యాలు కల్పించడంతోపాటు పోటీల నిర్వహణకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను పూర్తి చేసినట్లు ఆమె వెల్లడించారు.ఈ నెల 27వ తేదీ ఉదయం 10 గంటలకు ప్రారంభ సమావేశం నిర్వహించనున్నట్లు ఆచార్య జ్యోతి తెలిపారు. ఈ కార్యక్రమానికి కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య కర్నాటి ప్రతాపరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య రామచంద్రం, ఓఎస్‌డీ ఆచార్య వెంకటరామిరెడ్డి, కాకతీయ విశ్వవిద్యాలయం క్రీడా విభాగం సంచాలకులు డాక్టర్ శాస్త్రి, కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ప్రసాద్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. ప్రారంభ సమావేశానికి తాను అధ్యక్షత వహించనున్నట్లు ఆమె తెలిపారు. విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తి, క్రమశిక్షణ, నాయకత్వ లక్షణాలను పెంపొందించడంతోపాటు వివిధ కళాశాలల విద్యార్థుల మధ్య స్నేహభావం, పరస్పర సహకారాన్ని ప్రోత్సహించేందుకు ఈ పోటీలు దోహదపడతాయని ప్రిన్సిపాల్ జ్యోతి పేర్కొన్నారు.

# జోడేఘాట్‌లో పటిష్ట భద్రతా ఏర్పాట్లు



**కెరమెరి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** కొమురం భీం 86 వ వర్ధంతి సందర్భంగా కెరమెరి మండలంలోని జోడేఘాట్ లో నిర్వహించే కార్యక్రమానికి పటిష్ట భద్రతా ఏర్పాట్లు చేసినట్లు జిల్లా ఎస్పీ నితికా పంత్ తెలిపారు. జోడేఘాట్ ప్రాంతంలో సుమారు 600 మంది పోలీసు సిబ్బందితో భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు ఆమె వెల్లడించారు. గిరిజన మహానేత కొమురం భీం వర్ధంతికి రాష్ట్రం నలుమూలల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు, గిరిజనులు తరలివస్తారని, ఈ నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. శనివారం ఎస్పీ స్వయంగా జోడేఘాట్ కు చేరుకుని భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, భక్తులు, ప్రజల రద్దీ నియంత్రణపై అధికారులకు పలు సూచనలు చేశారు. చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేయాలని ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. ప్రజలు పోలీసులకు సహకరించాలని, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ కోరారు. భద్రతా పరంగా ఎలాంటి లోటుపాట్లు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని భరోసా ఇచ్చారు. వారితో పాటు డిఎస్పి అశోక్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ సతీష్, వాంకిడి సీఐ వేణుగోపాల్, కెరమెరీ ఎస్సై రాజు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.




## మధ్యవర్తిత్వంతో పరిష్కారం సులువు..

◻ సీనియర్ సివిల్ జడ్జి మహతి వైష్ణవి

**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి, (జనంసాక్షి):** వ్యక్తిగత రాగద్వేషాలు, ప్రతీకార చర్యలతో కేసుల బారిన పడటం వ్యర్థమని, మధ్యవర్తిత్వం ద్వారా సమస్యలు పరిష్కరించుకోవడం ఉత్తమమని జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి తాదూరు మహతి వైష్ణవి అన్నారు. శనివారం ట్రైనింగ్ పొందిన మీడియేటర్లు, కమ్యూనిటీ మీడియేటర్లు, పారా లీగల్ వాలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఏళ్ల తరబడి కోర్టుల చుట్టూ తిరగడం వల్ల కలిగే నష్టాన్ని ప్రజలకు వివరించి మధ్యవర్తిత్వంపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో మీడియేటర్లు ఆనందరావు, కవిత, రవీందర్, రాజ్ కుమార్ తదితరులు, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

# నీటి సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలి



నెక్కొండ, అక్టోబర్ 24 (జనం సాక్షి): నెక్కొండ మండల కేంద్రంలోని వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ప్రతి నీటి బొట్టును సంరక్షించాలని, నీటిని వృథా చేయకుండా భవిష్యత్తు అవసరాలకు వినియోగించుకునేలా ప్రజలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. నెక్కొండ మండలంలోని పత్తిపాక గ్రామాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించి, విబి - జి రామ్ జి పథకం కింద నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. ఈ తనిఖీలో డి ఆర్ డి ఓ నాగ పద్మజ, జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి (సీఈఓ ) వసంత పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉపాధి పనుల్లో పాల్గొంటున్న కూలీలు, గ్రామ రైతులతో మాట్లాడి వారి సమస్యలు, పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ఎల్‌నినో ప్రభావంతో వర్షపాతం సాధారణం కంటే తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్న నేపథ్యంలో, రాబోయే రోజుల్లో నీటి లభ్యతపై ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ సత్య శారద దేవి సూచించారు. ప్రతి ఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించడం, సామూహిక సోక్ పిట్స్ ఏర్పాటు చేయడం, బోర్‌వెల్ రీఛార్జ్ నిర్మాణాలు చేపట్టడం, వ్యవసాయ క్షేత్రాల్లో ఫార్మ్ పాండ్స్ ఏర్పాటు చేయడం, భవనాలపై పడే వర్షపు నీటిని ఒడిసిపట్టి నిల్వ చేసుకునేందుకు రూఫ్‌టాప్ రెయిన్‌వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టడం వంటి చర్యలకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. అలాగే, పశువుల కోసం గ్రామాల్లో నీటి తొట్టెలను ఏర్పాటు చేయాలని, వేసవి మరియు వర్షాభావ పరిస్థితుల్లో వాటికి తాగునీటి ఇబ్బందులు కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలని కోరారు. విద్యుత్‌ను కూడా అవసరమైన మేరకే వినియోగిస్తూ పొదుపు చర్యలు పాటించాలని తెలిపారు. అనంతరం పత్తిపాక ప్రాథమిక పాఠశాల, ప్రీ-ప్రైమరీ పాఠశాలలను జిల్లా కలెక్టర్ సందర్శించి, అక్కడి సౌకర్యాలను పరిశీలించారు. పాఠశాలల్లో విద్యార్థులకు సరిపడా బెంచీలు లేకపోవడం, లైటింగ్ సదుపాయాలు తగిన విధంగా లేకపోవడాన్ని గమనించారు. విద్యార్థులకు మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు అవసరమైన బెంచీలు సమకూర్చడంతో పాటు లైటింగ్ సదుపాయాలను మెరుగుపరచాలని నెక్కొండ ఎంపీడీవోను ఆదేశించారు. వర్షాభావ పరిస్థితులను ఎదుర్కొనేందుకు నీటి సంరక్షణ, తక్కువ నీటితో పంటల సాగు, పశువులకు తాగునీరు మరియు పశుగ్రాసం అందుబాటులో ఉంచడం, ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామీణాభివృద్ధి, ప్రభుత్వ పాఠశాల్లో మౌలిక సదుపాయాల మెరుగుదలపై సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో నెక్కొండ ఎంపీడీవో మండల అధికారులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభంపై నుంచి పడి ప్రైవేటు ఎలక్ట్రిషియన్ మృతి

**పాలకుర్తి, అక్టోబరు 24 (జనంసాక్షి) :** ఓ ప్రైవేటు ఎలక్ట్రిషియన్ విద్యుత్ స్తంభంపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి మృతి చెందిన ఘటన శనివారం మండలంలోని మంచుప్పలలో చోటు చేసుకుంది. ఎస్సై సృజన్ కుమార్ తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన మాంకాళి ఉప్పలయ్య (40) అనే వ్యక్తి గ్రామంలో ప్రైవేటు ఎలక్ట్రిషియన్గా పని చేస్తున్నాడు. అయితే గ్రామానికి చెందిన ఓరుగంటి రామగిరిస్వామి ఇంటిలోకి విద్యుత్ సరఫర కాలేదు. దీంతో ఉప్పలయ్య ట్రాన్స్ఫార్మర్ వద్దకు వెళ్లి విద్యుత్ సరఫరా నిలిపివేశాడు. ఈ క్రమంలో విద్యుత్ స్తంభం పైకి నిచ్చెన వేసి ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు స్తంభం పై నుంచి జారి కిందపడ్డాడు.. గాయపడిన బాధితుడిని చికిత్స నిమిత్తం వరంగల్ ఎంజీఎంకు తరలించి అందిస్తుండగా మృతి చెందినట్లు తెలిపారు.

# బాధిత ఎస్సీ, ఎస్టీలకు పరిహారం త్వరగా అందించేవిధంగా చర్యలు చేపట్టాలి

◻ హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి



**హనుమకొండ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 (జనంసాక్షి) :** బాధిత ఎస్సీ, ఎస్టీలకు పరిహారం త్వరగా అందించేవిధంగా చర్యలు చేపట్టాలని హనుమకొండ జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి అన్నారు. శనివారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లాస్థాయి ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ సమావేశంలో జిల్లాలో నమోదైన ఎస్సీ, ఎస్టీ కేసులు, భూ సమస్యలు, బాధితులకు పరిహారం చెల్లింపు, తదితర అంశాలతో రూపొందించిన ఎజెండా అంశాలపై మానిటరింగ్ కమిటీ సభ్యులు, ఆర్డీవోలు, పోలీస్ అధికారులు, తహసీల్దార్లు, ఇతర శాఖల అధికారులతో అదనపు కలెక్టర్ సమీక్షించారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ ఎన్. రవి మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీలో తీర్మానించిన ప్రతిపాదనలను సంబంధిత ప్రభుత్వ శాఖలు త్వరితగతిన పరిష్కరించాలన్నారు. ప్రతి నెల 30వ తేదీన సివిల్ రైట్స్ డే ను నిర్వహించాలని తహసీల్దార్లను ఆదేశించారు. ప్రతి మూడు నెలలకోసారి నిర్వహించే ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశానికి సంబంధిత జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సభ్యులు ఈ.వి.శ్రీనివాస్ రావు, పుట్ట రవి, చుంచు రాజేందర్, సింగారపు రవిప్రసాద్, రడపాక పరంజ్యోతి, నూనవత్ జవహర్ లాల్, ఎస్సీ వెల్ఫేర్ డీడీ నిర్మల, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు వెంకటేష్, డీఎస్. వెంకన్న, ఏసీపీలు నరసింహారావు, సతీష్ బాబు,తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ శాఖల నిర్మాణాలకు ఆమోదిత ఇసుకను మాత్రమే వాడాలి

◻ జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



**నిర్మల్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** జిల్లాలో వివిధ ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే నిర్మాణాలన్నింటికీ ప్రభుత్వ ఆమోదిత ఇసుక మాత్రమే వినియోగించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, వివిధ శాఖల అభివృద్ధి పనులు, నిర్మాణాలలో ఇసుక వినియోగంపై సంబంధిత శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో చేపట్టే ప్రతి పనికి చట్ట ప్రకారం మాత్రమే ఇసుకను పొందాలన్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి పడే విధంగా ఇతర మార్గాల్లో ఇసుక సేకరించి వాడటాన్ని పూర్తిస్థాయిలో నిర్మూలించాలని అన్నారు. నిర్మాణ పనులకు ఇసుకను పొందే మార్గాలపై ఆయా శాఖల ఉన్నతాధికారులు పర్యవేక్షణ ఉంచాలని అన్నారు. నాసిరకం ఇసుక వాడటం వల్ల నిర్మాణాల్లో నాణ్యత లోపాలు తలెత్తుతాయని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలకు కూడా పారదర్శకంగా ఇసుక పొందాలని చెప్పారు. ఆయా నిర్మాణ పనుల్లో ఇసుక కొరత తలెత్తకుండా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు రాథోడ్ రమేష్, వెంకట మాధవ రావు, మైనింగ్ అధికారి తిరుపతి రావు, ఆర్ అండ్ బి, నీటిపారుదల శాఖల ఈఈ లు సుభాష్, అనిల్, హౌసింగ్ పిడి శ్రీనివాస్, సిపిఓ గంగారెడ్డి, ఈడబ్ల్యుఐడిసి డిప్యూటీ ఈఈ గంగాధర్ గౌడ్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీ నిధులు గోల్‌మాల్?

◻ కార్యదర్శితో సర్పంచ్ భర్త కుమ్మక్కు
◻ ఉపసర్పంచ్ సంతకం ఫోర్జరీ
◻ రూ. 2 లక్షల నిధులు స్వాహా
◻ కలెక్టర్ కు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం
◻ అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేంటి




**వెంకటాపూర్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని ఓ గ్రామ పంచాయతీలో నిధులు గోల్ మాల్ అయిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. గ్రామ అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన నిధులను సర్పంచ్ భర్త తమ సొంత ప్రయోజనాలకు వాడుకున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపుతున్నాయి. గతంలో సదరు గ్రామంలో విధులు నిర్వహించిన పంచాయతీ కార్యదర్శితో కుమ్మక్కైన సర్పంచ్ భర్త అదే గ్రామ ఉపసర్పంచ్ కు తెలియకుండా ఆయన సంతకాన్ని ఫోర్జరీ చేసి, పంచాయతీ ఉమ్మడి ఖాతా నుండి ఏకంగా రూ. 2 లక్షల రూపాయలను డ్రా చేసినట్లు తెలిసింది. ఈ ఘటన జరిగి దాదాపు 7 నెలలు కావస్తున్నప్పటికీ ఆలస్యంగా వెలుగు చూడడంతో ప్రస్తుతం ఈ అంశం మండలంలో చర్చనీయాంశంగా మారింది. అవినీతి, అక్రమాలకు అలవాటు పడ్డ సదరు సర్పంచ్ భర్త దౌర్జన్యాన్ని, ఆగడాలను తట్టుకోలేకనే తక్కువ సమయంలో ఎక్కువ మంది కార్యదర్శులు అక్కడ విధులు నిర్వహించలేక వెళ్లిపోయినట్లు సమాచారం. కాగా, నిధుల దుర్వినియోగంపై ప్రశ్నించినందుకే ప్రస్తుత కార్యదర్శిపై సర్పంచ్ భర్త దౌర్జన్యానికి పాల్పడ్డాడా అంటే అవుననే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

### పంచాయతీరాజ్ చట్టానికి తూట్లు

గ్రామ పంచాయతీలలో ఏదైనా అభివృద్ధి నిధులు డ్రా చేయాలంటే తప్పనిసరిగా సర్పంచ్ తో పాటు ఉపసర్పంచ్ లేదా కార్యదర్శి సంయుక్త సంతకం ఉండాలనేది పంచాయతీరాజ్ చట్టంలోని ప్రధాన నిబంధన. అట్టి నిబంధనను సదరు సర్పంచ్ భర్త ఉల్లంఘించారు. గతంలో ఇక్కడ పనిచేసి బదిలీపై వెళ్లిన ఓ పంచాయతీ కార్యదర్శితో సర్పంచ్ భర్త లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకున్నాడు. అంతటితో ఆగకుండా ఏకంగా ఉపసర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసిన సర్పంచ్ భర్త రూ. 2 లక్షల గ్రామ పంచాయతీ నిధులను విత్ డ్రా చేశారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. గ్రామ అభివృద్ధి కోసం మంజూరైన సదరు డబ్బుల నుంచి ఒక్క పైసా కూడా గ్రామ అభివృద్ధికి ఖర్చు చేయకుండా సొంత అవసరాలకు వాడుకున్నారని సదరు గ్రామ ఉపసర్పంచ్ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### ఉపసర్పంచ్ ఫిర్యాదుతో వెలుగులోకి

తన సంతకం ఫోర్జరీ అయిందని, తన ప్రమేయం లేకుండా మార్చి నెలలో భారీ మొత్తంలో నగదు డ్రా అయిందని ఆలస్యంగా తెలుసుకున్న సదరు గ్రామ ఉపసర్పంచ్ తీవ్ర ఆందోళనకు గురయ్యారు. వెంటనే ములుగు జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా పంచాయతీ అధికారి దృష్టికి తీసుకెళ్లి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిసింది. కలెక్టర్ ఆదేశానుసారం ఫిర్యాదు అందుకున్న జిల్లా పంచాయతీ అధికారులు ఇటీవల హడావుడిగా సదరు గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సందర్శించినట్లు సమాచారం. ఈ సందర్భంగా పంచాయతీకి సంబంధించిన బ్యాంక్ రికార్డులు, చెక్ బుక్, విత్ డ్రా స్లిప్ లు, పంచాయతీ తీర్మానాల పుస్తకాన్ని పరిశీలించి విచారణ చేపట్టినట్లు తెలిసింది. విచారణ చేపట్టి రోజులు గడుస్తున్నప్పటికీ బాధ్యులపై ఇప్పటికీ ఎలాంటి శాఖాపరమైన చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు ఉన్నాయి. కలెక్టర్ కు ఫిర్యాదు చేసిన సదరు ఉపసర్పంచ్ కు కనీసం విచారణ నివేదిక కాపీ కూడా ఇప్పటికీ ఇవ్వలేదని తెలుస్తోంది.

### బూతు పురాణం వెనుక అసలు కారణం ఇదేనా..!

ఈ ఫోర్జరీ వ్యవహారం జరిగిన తర్వాత ఆ గ్రామానికి నూతనంగా వచ్చిన గ్రామ పంచాయతీ కార్యదర్శి నిబంధనల ప్రకారం విధులు నిర్వహిస్తున్నారని తెలిసింది. గతంలో జరిగిన అవకతవకలకు సంబంధించిన రికార్డులు అడగడం, ప్రతి బిల్లుకు సరైన తీర్మానం, అంచనాలు ఉండాలని పట్టుబట్టడం సర్పంచ్ భర్తకు నచ్చలేదని సమాచారం. తన అవినీతి, అక్రమాలకు కొత్త కార్యదర్శి అడ్డు వస్తున్నాడనే కోపంతోనే ఆయనపై సర్పంచ్ భర్త ఇటీవల అసభ్య పదజాలంతో దూషించినట్లు సమాచారం. ఈ క్రమంలోనే మండలంలోని కార్యదర్శులంతా వెంకటాపూర్ పోలీస్ స్టేషన్ లో సదరు సర్పంచ్ భర్తపై ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

### అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేంటి..?

సర్పంచ్ భర్త తన సంతకం ఫోర్జరీ చేసి రూ. 2 లక్షల నిధులు స్వాహా చేశారంటూ మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కలెక్టర్ కు ఫిర్యాదు చేసినప్పటికీ నేటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. నామమాత్రంగా విచారణ చేపట్టిన అధికారులు ప్రస్తుతం మౌనం వహించడం వెనుక ఆంతర్యం ఏమిటని పలువురు చర్చించుకుంటున్నారు. రాజకీయ ఒత్తిడి ఏమైనా ఉందా అనే కోణంలో తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా ములుగు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకుని, సదరు సర్పంచ్ భర్తపై చర్యలు తీసుకోవడంతో పాటు సదరు గ్రామ సర్పంచ్ ను సైతం తక్షణమే సస్పెండ్ చేయాలని పలువురు కోరుతున్నారు. అదేవిధంగా ఫోర్జరీకి పాల్పడి డ్రా చేసిన నిధులను సైతం రికవరీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

జనంసాక్షి
www.janamsakshi.org
ఆదివారం
25 అక్టోబర్ 2026

# మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యత

- డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క



**చింతకాని, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి, ప్రజలకు మెరుగైన మౌలిక సదుపాయాల కల్పనే ప్రజా ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. గ్రామాల్లో రహదారులు, విద్యుత్, త్రాగునీటి సదుపాయాలను మెరుగుపరుస్తూ ప్రజల అవసరాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామని పేర్కొన్నారు. చింతకాని మండలంలో శనివారం డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క పర్యటించారు. జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్., ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డిలతో కలిసి మండలంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసి, పూర్తయిన పనులను ప్రారంభించారు. చింతకాని మండలం పొద్దుటూరు గ్రామంలో రూ. 3.5 కోట్లతో చేపట్టనున్న 33/11 కేవీ సబ్‌స్టేషన్ నిర్మాణ పనులకు, తిమ్మినేని పాలెం గ్రామంలో రూ. 8.25 కోట్లతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు రామకృష్ణాపురం గ్రామంలో రామకృష్ణాపురం నుంచి కొత్తగూడెం వరకు దేవరపల్లి హైవేను కలుపుతూ రూ. 3 కోట్లతో చేపట్టనున్న బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, రామకృష్ణాపురం నుంచి పెద్దగోపతి రోడ్డు వరకు రూ. 50 కోట్లతో చేపట్టనున్న రహదారి విస్తరణ, బలోపేతం పనులకు, కొదుమూరు గ్రామంలో వెంకటపాలెం నుంచి చింతకాని రోడ్డు వరకు రూ. 60 కోట్లతో నాలుగు వరుసల రహదారిగా చేపట్టనున్న విస్తరణ, బలోపేతం పనులకు డిప్యూటీ సీఎం శంకుస్థాపన చేశారు. తిమ్మినేని పాలెం ఎస్సీ కాలనీలో రూ. 62 లక్షలతో నిర్మించిన అంతర్గత సీసీ రోడ్లను, గాంధీనగర్ ఎస్సీ కాలనీలో రూ. 46 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం సమగ్రంగా అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌళిక సదుపాయాలను కల్పిస్తూ గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో రవాణా సౌకర్యాలను మెరుగుపరిచేందుకు రహదారుల నిర్మాణం, విస్తరణ పనులు చేపడుతున్నామని తెలిపారు. మెరుగైన రహదారుల వల్ల గ్రామాల మధ్య రాకపోకలు సులభతరమౌతుందని పేర్కొన్నారు. ప్రజలకు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు విద్యుత్ మౌళిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నామని తెలిపారు. నూతన సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా వ్యవస్థ మెరుగుపడేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. గ్రామీణ ప్రజలకు త్రాగునీటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన పంపిణీ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనులను నాణ్యతా ప్రమాణాలతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని, సంబంధిత అధికారులు పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం ముందుకు సాగుతోందని, ప్రజలకు అభివృద్ధి పనుల ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, కొదుమూరు శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయ కమిటీ చైర్మన్ వేముల సతీష్, ప్రజాప్రతినిధులు, సంబంధిత జిల్లా అధికారులు, స్థానిక నాయకులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## చంద్రుగొండ ప్రధాన సెంటర్‌లో ఆర్టీసీ బస్సులు ఆపాలి

- ఇబ్బందులు పడుతున్న వృద్ధులు, మహిళలు



**చంద్రుగొండ, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** చంద్రుగొండ మండల కేంద్రంలోని ప్రధాన సెంటర్‌లో ఆర్టీసీ బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకోవాలని కోరుతూ పలువురు గ్రామస్తులు శనివారం కొత్తగూడెం డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రధాన సెంటర్‌లో బస్సులు ఆపకపోవడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు తెలిపారు. ముఖ్యంగా వృద్ధులు, లగేజీతో ప్రయాణించేవారు ప్రధాన సెంటర్ నుంచి బస్టాండ్ వరకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రధాన సెంటర్‌లో బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకున్న అనంతరం బస్టాండ్‌లోకి వెళ్లి అక్కడి ప్రయాణికులను కూడా ఎక్కించుకోవాలని డిపో మేనేజర్‌ను కోరారు. ఇతర ప్రాంతాల్లో బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో బస్సులు నిలిపి ప్రయాణికులను ఎక్కించుకుంటున్న విషయాన్ని ఈ సందర్భంగా ప్రస్తావించారు. ఈ కార్యక్రమంలో బోడెపూడి విజయలక్ష్మి, వారాధి సత్యనారాయణ, పిచ్చయ్య, కుంచపు కన్నయ్యతో పాటు ఆటో నాయకులు, ఇతరులు పాల్గొన్నారు.

## పట్టపగలే చోరీ..

- 8 తులాల బంగారు నగలు మాయం!
- ఇంట్లో ఎవరూ లేని సమయంలో బీరువా లూటీ చేసిన గుర్తుతెలియని దొంగలు



**బూర్గంపహాడ్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం అంజనపురం గ్రామంలో పట్టపగలే చోరీ ఘటన కలకలం రేపింది. లకావత్ బాల్య ఇంట్లో ఎవరూ లేని సమయాన్ని అదునుగా తీసుకున్న గుర్తుతెలియని దొంగలు ఇంట్లోకి చొరబడి బీరువాలో ఉన్న సుమారు 8 తులాల బంగారు నగలు, వెండి వస్తువులతో పాటు కొంత నగదును అపహరించి పరారయ్యారు. ఈ ఘటన శనివారం మధ్యాహ్నం చోటుచేసుకున్నట్లు తెలిసింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చోరీకి పాల్పడటంతో బాధితులు ఆందోళనకు గురయ్యారు. చోరీకి గురైన బంగారు నగలు, వెండి వస్తువులు, నగదు విలువ ఎంత ఉంటుందనే వివరాలు తెలియాల్సి ఉంది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. చోరీకి పాల్పడిన గుర్తుతెలియని వ్యక్తులను గుర్తించేందుకు విచారణ కొనసాగిస్తున్నారు. పట్టపగలే చోటుచేసుకున్న ఈ ఘటనతో గ్రామంలో చర్చనీయాంశంగా మారింది.

## చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తాం

- మాసానిపల్లిలో ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం
- ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ.2,461 సన్న రకం ధాన్యానికి అదనంగా రూ.500 బోనస్
- ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌బాబు



**జోగిపేట, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** రైతులు పండించిన ధాన్యాన్ని చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని ఐకేపీ జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రమేష్‌బాబు తెలిపారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. శనివారం అందోల్ మండలం మాసానిపల్లి గ్రామంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్‌బాబు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి క్వింటాలుకు రూ. 2,461, సాధారణ రకం ధాన్యానికి రూ. 2,441 మద్దతు ధర చెల్లిస్తోందని తెలిపారు. సన్న రకం ధాన్యానికి అదనంగా రూ. 500 బోనస్ అందజేస్తున్నట్లు పేర్కొన్నారు. రైతులు దళారులను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యాన్ని విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. గ్రామ సర్పంచ్ సత్యనారాయణ మాట్లాడుతూ.. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా కొనుగోలు కేంద్రం ద్వారా సేవలు అందించాలని సూచించారు. ధాన్యం విక్రయించేందుకు అవసరమైన పత్రాలతో కేంద్రాన్ని సంప్రదించాలని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవేందర్, సీసీలు సత్యనారాయణ, రాములు, వీవోఏ లాయక్ అలీ, గ్రామ సమాఖ్య అధ్యక్షులు అంజమ్మ, మంజుల, ఉపసర్పంచ్ రొయ్యల రాజు, వార్డు సభ్యులు, మండల సీనియర్ పార్టీ నాయకులు అశోక్, కృష్ణ, రైతులు పాల్గొన్నారు.

## మైనర్ బాలిక మృతి కేసులో నిందితుడి అరెస్ట్

- సూర్యాపేట రూరల్ సీఐ జి.రాజశేఖర్



**సూర్యాపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** ఆత్మకూర్ (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలో మైనర్ బాలిక మృతికి సంబంధించిన కేసులో నిందితుడిని 24 గంటల్లో అరెస్ట్ చేసి, రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించారు. శనివారం సూర్యాపేట రూరల్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయంలో కేసుకు సంబంధించిన వివరాలను సూర్యాపేట రూరల్ సీఐ జి.రాజశేఖర్ వెల్లడించారు. ప్రేమ పేరుతో మైనర్ బాలికను వేధింపులకు గురిచేసిన ఘటనలో వేధింపులు భరించలేక బాలిక ఈ నెల 22వ తేదీ రాత్రి మృతిచెందినట్లు కేసు నమోదైందని తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టి, నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. మైనర్ బాలికలపై వేధింపులకు పాల్పడటం తీవ్రమైన నేరమని, మహిళలు, బాలికల భద్రతకు పోలీసు శాఖ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. ఈ కేసులో వాంకుడోతు నరేష్ ను అరెస్ట్ చేసి, తదుపరి చట్టపరమైన చర్యల్లో భాగంగా రిమాండ్‌కు పంపించినట్లు తెలిపారు. ఈ కేసు దర్యాప్తు, నిందితుడి అరెస్ట్ ప్రక్రియలో ఆత్మకూర్ (ఎస్) ఎస్ఐతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## డిఫాల్ట్ రైస్ మిల్లర్లకు 45 రోజుల గడువు



**సూర్యాపేట, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** జీఓ ఎంఎస్ నెం. 17 ప్రకారం డిఫాల్ట్ మిల్లర్లు బాకీ పడిన సీఎంఆర్ బియ్యాన్ని 45 రోజుల్లోపు ప్రభుత్వానికి చెల్లించాలి. బియ్యాన్ని సన్న బియ్యం రూపంలో ఇవ్వాలి లేదా దానికి సరిపడా ధరను 25శాతం పెనాల్టీ, 12శాతం వడ్డీతో కలిపి చెల్లించాలి. సివిల్ సప్లైస్ కమిషనర్ ఆదేశాల మేరకు శనివారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ అధ్యక్షతన డిఫాల్ట్ రైస్ మిల్లర్లతో రివ్యూ మీటింగ్ ను నిర్వహించారు. ఈ సమావేశంలో సివిల్ సప్లైస్ టాస్క్ ఫోర్స్ ఓఎస్డి ప్రభాకర్, అడిషనల్ కలెక్టర్ బి.హరి సింగ్ పాల్గొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన 45 రోజుల గడువును సద్వినియోగం చేసుకుని బాకీ ఉన్న సీఎంఆర్ బియ్యాన్ని అప్పగించాలని మిల్లర్లకు సూచించారు. గడువులోపు చెల్లించని మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు హెచ్చరించారు. రెవెన్యూ రికవరీ యాక్ట్, 1864 ప్రకారం వారి ఆస్తులను జప్తు చేస్తామని స్పష్టం చేశారు. జిల్లా సివిల్ సప్లైస్ అధికారులు, టాస్క్ ఫోర్స్ బృందం బకాయిలు చెల్లించని మిల్లులను ఇప్పటికే సందర్శిస్తున్నారు. మిల్లు యజమానుల, వారి కుటుంబ సభ్యుల ఆస్తి వివరాలను సేకరించడం ప్రారంభించారు. ఈ సమావేశం ముగిసిన వెంటనే ధనలక్ష్మి రైస్ మిల్ యజమాని గంగిరెడ్డి ఆదినారాయణ రెడ్డి తమ బాకీ మొత్తాన్ని చెల్లించారు. ఆ మొత్తానికి చెక్కును సివిల్ సప్లైస్ జిల్లా మేనేజర్ వి.శ్రీధర్ రెడ్డికి అందజేశారు. ఈ సమావేశంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మోహన్ బాబు, డిప్యూటీ తహసీల్దార్లు, టాస్క్ ఫోర్స్ బృందం పాల్గొన్నారు.

## అనుమానం చిచ్చు.. భార్యను కడతేర్చిన భర్త



**మర్రిగూడ, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** నమ్మకంతో సాగాల్సిన భార్యాభర్తల బంధాన్ని అనుమానం బలితీసుకుంది. నల్లగొండ జిల్లా మర్రిగూడ మండలం శివన్నగూడ గ్రామంలో సుంకరి రజిత (38)ను భర్త ఇంద్రయ్య (40) మటన్ కొట్టే కత్తితో మెడపై దాడి చేసి హతమార్చాడు. శనివారం ఉదయం 10:30 గంటల ప్రాంతంలో ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం. భార్యకు గ్రామానికి చెందిన వ్యక్తితో వివాహేతర సంబంధం ఉందనే అనుమానంతోనే హత్య చేసినట్లు ఇంద్రయ్య తెలిపినట్లు తెలుస్తోంది. హత్య అనంతరం పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. భార్యపై చేసిన ఆరోపణల్లో వాస్తవాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం అందుకున్న నాంపల్లి సీఐ దూది రాజు, మర్రిగూడ ఎస్సై రాంబాబు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. నల్లగొండ నుంచి వచ్చిన క్లూస్‌టీం ఆధారాలు సేకరించింది. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. గత ఏడాది పెద్ద కుమారుడు ఆత్మహత్య చేసుకోగా, తాజాగా తల్లి హత్యకు గురికావడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్న ఈ కుటుంబాన్ని వరుస విషాదాలు కుదిపేశాయి. అనుమానాలు ప్రాణాలు తీసే స్థాయికి చేరడం గ్రామస్తులను కలచివేసింది.

## కూలిన బ్రిడ్జి..

- పట్టించుకోని అధికారులు
- ప్రాణాలు పోతేనే మేల్కొంటారా? అంటూ వాహనదారుల ఆవేదన



**అన్నపురెడ్డిపల్లి, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** మండల పరిధిలోని అబ్బుగూడెం నుంచి కట్టుగూడెం వెళ్లే ప్రధాన రహదారిపై బ్రిడ్జి కూలిపోయి ప్రమాదకరంగా మారినా సంబంధిత ఆర్ అండ్ బీ అధికారులు పట్టించుకోవడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమస్యపై పలుమార్లు పత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ అధికారులు స్పందించకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రాణనష్టం జరిగితేనే అధికారులు స్పందిస్తారా అంటూ ప్రశ్నిస్తున్నారు. ఈ రహదారి మీదుగా ఎర్రగుంట నేషనల్ హైవేకు వెళ్లే వాహనదారులు నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. బ్రిడ్జి కూలిపోవడంతో ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రహదారిపై ప్రమాదకర పరిస్థితులు నెలకొనడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. ప్రజల రాకపోకలకు కీలకంగా ఉన్న ఈ రహదారిపై బ్రిడ్జి దుస్థితిని అధికారులు ప్రత్యక్షంగా పరిశీలించి, తక్షణమే మరమ్మతులు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తాత్కాలిక భద్రతా చర్యలు చేపట్టి, శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే బ్రిడ్జి నిర్మాణ పనులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.

## ఎండిపోయిన వరి పంటను పరిశీలించిన మాజీ మంత్రి లక్ష్మారెడ్డి



**మిడ్జిల్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** మండలంలోనీ మంగలిగడ్డ తండా గ్రామపంచాయతీ పరిధిలోని తుల్జానాయక్ తండాలో ఎండిపోయిన వరి పంటను మాజీ మంత్రి డా. సి. లక్ష్మారెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం, కరువు పరిస్థితులు, భూగర్భ జలాలు అడుగంటడంలో వోల్టేజీ విద్యుత్ సమస్యలతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పాలమూరు - రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని పూర్తి చేసి ఉంటే ఈ పరిస్థితి వచ్చేది కాదని, కరివెన రిజర్వాయర్ వరకు నీటిని తీసుకురాగలిగే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని విమర్శించారు.

## ప్రభుత్వ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**సూర్యాపేట, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యతో పాటు మౌలిక వసతులు పక్కాగా అందాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆత్మకూర్(ఎస్) మండలం మిడ్తనపల్లి గ్రామంలోని ప్రభుత్వ హైస్కూల్, ప్రైమరీ స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లోకి వెళ్లిన కలెక్టర్, విద్యార్థులతో నేరుగా సంభాషించారు. పాఠ్యాంశాలపై వారిని పలు ప్రశ్నలు అడిగి, వారి సందేహాలను ఎంతో ఓపిగ్గా నివృత్తి చేశారు. బాగా చదువుకుని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం పాఠశాలలోని వంట గదిని పరిశీలించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యత, పారిశుద్ధ్య ప్రమాణాలను అడిగి తెలుసుకున్నారు. మెనూ ప్రకారం పరిశుభ్రమైన, పౌష్టికాహారాన్ని మాత్రమే వడ్డించాలని, వంటకాల తయారీలో ఎలాంటి అలసత్వం వహించవద్దని నిర్వాహకులకు స్పష్టం చేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు రిజిస్టర్లను, రికార్డులను తనిఖీ చేశారు. విద్యార్థుల హాజరు శాతాన్ని పెంచేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పాఠశాలలో ఏవైనా మౌలిక సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ అధికారి విశాల్, తహసిల్దార్ అమీన్ సింగ్, ఎంఈఓ ధారాసింగ్ ఉపాధ్యాయులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# నాణ్యతతో తరగతి గదుల నిర్మాణం పూర్తి కావాలి

- రూ. 1.30 కోట్లతో పాఠశాల నూతన భవన నిర్మాణానికి మంత్రి తుమ్మల శంకుస్థాపన
- ప్రతి 2, 3 వారాలకోసారి పనుల పురోగతిని సమీక్షించాలి
- వైఎస్సార్ కాలనీలో ప్రతి ఇంటికీ విద్యుత్ మీటర్, ఇంటి పన్ను రశీదు ఇవ్వాలి
- డబుల్ బెడ్‌రూం ఇళ్ల పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలి



**ఖమ్మం, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** పాఠశాలల్లో నిర్మించే అదనపు తరగతి గదుల పనులను నాణ్యతా ప్రమాణాలతో మూడు నెలల గడువులోగా పూర్తి చేయాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అధికారులను స్పష్టంగా ఆదేశించారు. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 8వ డివిజన్ వైఎస్సార్ కాలనీలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల (ఎంపీపీఎస్)లో సుడా నిధులు రూ. 1.30 కోట్లతో చేపట్టనున్న 5 అదనపు తరగతి గదుల నిర్మాణ పనులకు ఆయన ఘనంగా శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. భవన నిర్మాణాల్లో నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. అధికారులు కేవలం కార్యాలయాలకే పరిమితం కాకుండా ప్రతి రెండు, మూడు వారాలకోసారి క్షేత్రస్థాయికి వెళ్లి పనుల పురోగతిని నిశితంగా పరిశీలించాలని సూచించారు. వైఎస్సార్ కాలనీలోని ప్రతి నివాసానికి ప్రభుత్వ నిబంధనల ప్రకారం నూతన విద్యుత్ మీటర్లను అందించేలా విద్యుత్ శాఖ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. ఎవరూ కూడా అనధికారికంగా విద్యుత్ వాడకుండా, ప్రతి ఇంటికీ సరైన మీటర్ ఏర్పాటు చేసి అధికారికంగా సేవలు పొందేలా చూడాలన్నారు. అలాగే కాలనీవాసులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన ఇంటి పన్ను ధృవీకరణ పత్రాలను జారీ చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు.

### డబుల్ బెడ్‌రూం ఇళ్ల సమస్యలకు సత్వర పరిష్కారం

2023లో మంజూరైన డబుల్ బెడ్‌రూం ఇళ్లకు సంబంధించి ఇంకా పెండింగ్‌లో ఉన్న సమస్యలన్నింటినీ వెంటనే గుర్తించి, యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అర్హులైన లబ్ధిదారులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గాప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్య, వివిధ శాఖల ఉన్నతాధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# హామీలు నెరవేర్చాలి

- నవంబర్ 5లోగా వెబ్‌సైట్ ప్రారంభించాలి
- లేదంటే 10న ఆమరణ నిరాహార దీక్ష
- ఉద్యమకారులకు నిరసన

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర చైర్మన్ భోగే పద్మ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కరీంనగర్ కలెక్టరేట్ పరిసర ప్రాంతంలో మీడియాతో మాట్లాడుతూ, ఉద్యమకారులను గుర్తించి వారికి న్యాయం చేయడంలో ప్రభుత్వం జాప్యం చేస్తోందని విమర్శించారు.ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ఉద్యమకారులను గుర్తించి, వారికి న్యాయం చేస్తామని కాంగ్రెస్ నాయకులు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడిచినా ఆ హామీల అమలులో ఆశించిన పురోగతి లేదని అన్నారు.ప్రభుత్వం వెంటనే స్పందించి, ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు.నిర్దేశించిన గడువులోగా వెబ్‌సైట్‌ను ప్రారంభించి గుర్తింపు ప్రక్రియ చేపట్టకపోతే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇంటిని ముట్టడిస్తామని భోగే పద్మ హెచ్చరించారు. అలాగే నవంబర్ 10న కరీంనగర్‌లో తెలంగాణ ఉద్యమ కారులతో కలిసి ఆమరణ నిరాహార దీక్ష చేపడతామని స్పష్టం చేశారు..

# డీజే ఆపమన్నందుకు దాడి

– ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ కేసు,విచారణ

ముస్తాబాద్ అక్టోబర్ 24 (జనంసాక్షి):డీజే సౌండ్ తగ్గించమన్నందుకు ఓ వ్యక్తితో పాటు అతని కుటుంబసభ్యులపై దాడి చేసిన ఘటన ముస్తాబాద్ మండలం తెర్లుమద్దిలో చోటుచేసుకుంది. బాధితుడు కొమ్మట మధు తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న రాత్రి గ్రామ బొడ్రాయి వద్ద డీజే నడుస్తుండగా, శబ్దం ఎక్కువగా ఉండటంతో ఆపాలని మధు కోరాడు. దీంతో ఆగ్రహం చెందిన గ్రామానికి చెందిన ఆరుగురు వ్యక్తులు మధు ఇంటికి వెళ్లి అతడితో పాటు ఆయన భార్య, అన్నపై విచక్షణారహితంగా దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఈనెల 23న ఎస్సై జ్యోతి ఆరుగురిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేశారు. ఈ ఘటనపై శనివారం సిరిసిల్ల డీఎస్పీ నాగేంద్రచారి తెర్లుమద్ది గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. బాధితుల నుంచి వివరాలు సేకరించి, నిందితులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.



# అంతా అపరిశుభ్రత.. ఆపై నిర్లక్ష్యం

## కల్లులో టిన్నర్ వాసన.. చెత్తాచెదారం - భిక్కనూరు కల్లు దుకాణాల్లో నెలకొన్న దుర్గంధం





**భిక్కనూరు, అక్టోబర్ 24 (జనంసాక్షి):** కామారెడ్డి జిల్లా భిక్కనూరు మండల కేంద్రంలోని కల్లు విక్రయ కేంద్రాల నిర్వహణపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక శ్రీరేణుకాదేవి ఆలయ ఆవరణలోని కల్లు దుకాణంలో శుక్రవారం రాత్రి కల్లులో టిన్నర్ వాసనతోపాటు చెత్తాచెదారం రావడంతో వినియోగదారులు నిర్వాహకులను నిలదీశారు. సమాచారం అందుకున్న సొసైటీ ప్రతినిధులు అక్కడికి వచ్చి, వినియోగదారుల వ్యతిరేకతతో కల్లును పారబోశారు. ఈ ఘటన కల్లు విక్రయ కేంద్రాల్లో పరిశుభ్రత, నాణ్యతపై అనుమానాలను పెంచింది.

**మూడు రకాలుగా కల్లు విక్రయాలు**

కల్లు సీసాల పరిశుభ్రత, నిల్వ విధానంపై నిర్లక్ష్యం కనిపిస్తోందని వినియోగదారులు ఆరోపిస్తున్నారు. రోజువారీ కూలి పనులు చేసుకునే సామాన్యులు సేదతీరేందుకు కల్లు తాగుతుండగా, వారి ఆరోగ్యాన్ని పట్టించుకోకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎరుపు రంగు సీసా రూ.10, ఆకుపచ్చ సీసా రూ.15, తెలుపు సీసా రూ.20 చొప్పున మూడు రకాలుగా కల్లు విక్రయిస్తున్నారని స్థానికులు చెబుతున్నారు. కల్లు నాణ్యతపై ప్రశ్నిస్తే నిర్వాహకులు పొంతనలేని సమాధానాలు ఇస్తున్నారని యువకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**అధికారులు స్పందించాలి**

కల్లు విక్రయ కేంద్రాలపై ఎక్సైజ్ శాఖ అధికారులు నామమాత్రపు తనిఖీలతో సరిపెట్టుకుంటున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు. ఉన్నతాధికారులు తక్షణమే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, కల్లు నాణ్యత, సీసాల శుభ్రత, నిల్వ విధానాన్ని పరిశీలించాలని కోరుతున్నారు. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజారోగ్యాన్ని కాపాడేలా అధికారులు స్పందిస్తారా లేదా అన్నది వేచి చూడాల్సి ఉంది.



# పుష్కరాలపై ప్రత్యేక పర్యావేక్షణ

- ఏర్పాట్లకు అవసరమైన అన్ని పనులు చేపట్టాలి
- పుష్కరాల ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు
- మంథనిలోని ప్రముఖ ఆలయాల సందర్శన



**మంథని, అక్టోబర్ 24(జనంసాక్షి):** 2027లో నిర్వహించనున్న గోదావరి పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని భక్తులకు అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేందుకు ముందస్తు ప్రణాళికతో అవసరమైన పనులన్నీ చేపట్టాలని పుష్కరాల ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు అధికారులను ఆదేశించారు. శనివారం పెద్దపల్లి జిల్లా మంథనిలోని గోదావరి పుష్కర ఘాట్ వద్ద పుష్కరాల ఏర్పాట్ల పురోగతిని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష తో కలిసి పుష్కరాల ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు హనుమంతరావు పరిశీలించారు. ఈ సందర్భంగా పుష్కరాల ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు మాట్లాడుతూ..పుష్కరాల సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఘాట్ల అభివృద్ధి, భద్రత, పారిశుద్ధ్యం, తాగునీరు, విద్యుత్, రహదారులు, రాకపోకలకు సంబంధించిన ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. పుష్కర ఘాట్ల వద్ద భక్తుల రద్దీకి అనుగుణంగా స్నానఘట్టాలు, రాకపోకల మార్గాలు, అవసరమైన ఇతర సదుపాయాలను ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి చేయాలని తెలిపారు. చేపట్టాల్సిన పనులను గుర్తించి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేసి, అవసరమైన అనుమతులు పొందుతూ పనులు సకాలంలో పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పుష్కరాల ఏర్పాట్లను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం పుష్కరాల ప్రత్యేక అధికారి, డైరెక్టర్ ఆఫ్ ఎండోమెంట్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మంథనిలోని గౌతమేశ్వర స్వామి ఆలయం, ఓంకారేశ్వర స్వామి ఆలయం, సురబండేశ్వర స్వామి ఆలయం, మహాలక్ష్మి ఆలయం, లక్ష్మీనారాయణ ఆలయాలను సందర్శించారు. ఆలయాల పరిస్థితి, భక్తులకు కల్పిస్తున్న సదుపాయాలను పరిశీలించి, అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మంథని మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ , వైస్ చైర్మన్ సయేందర్ రెడ్డి,సీఈ దుర్గాప్రసాద్, దేవాదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, ఆర్డీఓ సురేష్, మున్సిపల్ కమిషనర్ మనోహర్ , తహసీల్దార్ ఆరిఫోద్దీన్, ఈఓ రాజ్‌కుమార్, ప్రజాప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

### జాతీయ స్థాయి రీజినల్ గణిత ఒలింపియాడ్‌కు

# 'పారమిత' విద్యార్థి ఎంపిక

**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** స్థానిక పద్మనగర్ పారామిత హెరిటేజ్ పాఠశాల విద్యార్థి అద్భుత ప్రతిభ కనబరిచాడు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న విద్యార్థి పబ్బతి విద్వాన్ రెడ్డి ప్రతిష్ఠాత్మక జాతీయ స్థాయి 'రీజినల్ మ్యాథమెటికల్ ఒలింపియాడ్' కు ఎంపికయ్యాడు. సెప్టెంబర్ 6న దేశవ్యాప్తంగా నిర్వహించిన ఇండియన్ ఒలింపియాడ్ క్వాలిఫైయర్ ఇన్ మ్యాథమెటిక్స్ పరీక్షలో అతను అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పరీక్షకు అర్హత సాధించడాన్ని పాఠశాల ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ తెలిపారు. తెలంగాణలోని 33 జిల్లాల నుండి సుమారు 8,000 మంది విద్యార్థులు ఈ పోటీ పరీక్షలో పాల్గొనగా, వారిలో అత్యంత ప్రతిభ కనబరిచిన మొదటి 200 మంది విద్యార్థులు మాత్రమే తదుపరి దశ అయిన ఆర్ఎమ్ఓ (ఆర్ ఎం ఓ)కు అర్హత సాధించారు. వారిలో విద్వాన్ రెడ్డి ఒకడిగా నిలవడం విశేషం. కాగా, ఈ రీజినల్ గణిత ఒలింపియాడ్ (ఆర్ ఎం ఓ) జాతీయ స్థాయి పరీక్షను నవంబర్ 15న నిర్వహించనున్నారు.ఈ సందర్భంగా అత్యంత ప్రతిభ చాటిన మాస్టర్ పి. విద్వాన్ రెడ్డిని గైడ్ టీచర్లు సంపత్, ప్రదీప్, అకడమిక్ కోఆర్డినేటర్ నాగరాజుల నిరంతర కృషిని, మార్గదర్శకత్వాన్ని పారామిత విద్యాసంస్థల ఛైర్మన్ డా. ఇ. ప్రసాద్ రావు, డైరెక్టర్స్ ప్రసూన, అనుకర్ రావు, రష్మిత, రాకేశ్, వి. యు. మ్ ప్రసాద్, వినోద్ రావు, హన్మంత రావు, ప్రధానోపాధ్యాయులు గోపీకృష్ణ ప్రత్యేకంగా అభినందినీచారు.



# ఉత్తమ వైద్య సేవలతో ఉన్నత స్థానాలకు ఎదగాలి

**సామాజిక సేవలో భాగంగా కొందరికైనా ఉచిత వైద్యం చేయాలి : రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్**



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** వైద్య కళాశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు డాక్టర్లుగా ఉత్తమ వైద్య సేవలు అందించాలని, ఉన్నత స్థానాలకు ఎదగాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ఆకాంక్షించారు.రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో (వైట్ కోట్ సెర్మనీ) శనివారం నిర్వహించగా,ముఖ్య అతిథిగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే హాజరయ్యారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు వైద్య విద్యార్థులకు వైట్ కోట్ లు అందజేసి అభినందించారు. అనంతరం నిర్వాహకులు జిల్లా కలెక్టర్, ఎస్పీని శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. సమాజంలో వైద్యం, విద్యకు అత్యంత ప్రాధాన్యత ఉందని తెలిపారు. వైద్య విద్య అభ్యసించేందుకు చాలా కష్ట పడాల్సి ఉంటుందని, నీట్ పరీక్షలో ఉత్తీర్ణత సాధిస్తేనే ఈ అవకాశం వస్తుందని వివరించారు. ప్రతి విద్యార్థి విజయం వెనుక వారి తల్లిదండ్రుల శ్రమ, ప్రోత్సాహం ఉంటుందని పేర్కొన్నారు.వైద్యుల సేవలు చాలా కీలకమని స్పష్టం చేశారు. గర్భిణులు, పిల్లలు, వివిధ రోగాలతో బాధ పడే వారికి వైద్యులు ఎంతో ఓపికతో సేవలు అందిస్తారని కొనియాడారు. వైద్యులు తాము ఎంచుకున్న విభాగంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో భాగంగా వైద్యులు కొందరికైనా ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. దీంతో ఆత్మ సంతృప్తి ఉంటుందని తెలిపారు. వైద్యం, సేవల్లో మిగతా వారికి ఆదర్శంగా నిలవాలని ఆకాక్షించారు. వైద్యులు తమ ఆరోగ్యం, ఆహారం శ్రద్ధ పెట్టాలని సూచించారు.సిరిసిల్ల వైద్య కళాశాల, బాలికల, బాలుర హాస్టల్ నిర్మాణ పనులను తాను పలుమార్లు సందర్శించానని గుర్తు చేశారు. ప్రస్తుతం బాలికల హాస్టల్ వినియోగంలోకి వచ్చిందని తెలిపారు. మెడికల్ కాలేజీ,బాలుర హాస్టల్ నిర్మాణ పనుల్లో వేగం పెంచి,త్వరలోనే వినియోగంలోకి తీసుకువచ్చేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో రాజన్న సిరిసిల్ల ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ రాజేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ నిర్విష, తహసీల్దార్ మహేష్ కుమార్, వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# జనగామ గ్రామ సమస్యలన్నీ పరిష్కరించాలి

**నగర మేయర్ మహంకాళి స్వామి..**

**గోదావరిఖని, జనంసాక్షి:**నిర్ణీత కాలవ్యవధి లోపు ప్రభావిత ప్రాంతమైన జనగామ గ్రామ సమస్యలన్నీ పరిష్కరించాలని రామగుండం మేయర్ మహంకాళి స్వామి అన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కార్యాలయంలో జనగామ గ్రామస్తులు , సింగరేణి , మునిసిపల్ అధికారులతో అధికారులతో శనివారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనగామ గ్రామస్తులు పలు సమస్యలను దృష్టికి తెచ్చారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ ఎస్ సి సి ఎల్ , ఆర్ జి వన్ జి ఎం కార్యాలయ పరిధిలోనే అనేక సమస్యలు పరిష్కరించడానికి అవకాశం ఉందని అన్నారు. రోడ్డు విస్తరణ పనుల్లో నిరూపయోగమైన పైప్ లైన్ల స్థానంలో సుమారు 500 మీ వరకు కొత్త పైప్ లైన్ వేసినట్లయితే జనగామ లో గతంలో మారదిరిగా నల్లాల ద్వారా ఇంటింటికీ మంచి నీటి సరఫరా చేయడానికి అవకాశం ఉంటుందని అన్నారు. బోర్లను యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు చేయించడంతో పాటు గ్రామంలో ఆర్ ఓ ప్లాంట్ కూడా ఉపయోగంలోకి తీసుకురావాలని అన్నారు. కొత్త బోర్లు కూడా వేయాలని అన్నారు .జి ఎం మాట్లాడుతూ గోదావరి వైపు వెళ్ళే రోడ్డు జనగామ గ్రామ ప్రజలతో పాటు సింగరేణి సంస్థకు కూడా ఉపయోగకరమైనందున అత్యంత ప్రాధాన్యత ఇస్తూ పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. జనగామ గ్రామస్తులు దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను పరిష్కరించడానికి సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పనులు పూర్తి చేస్తామని అన్నారు డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య , కార్పొరేటర్లు ఆవుల శ్యామణి , ముస్తాఫా పలువురు కార్పొరేటర్లతో పాటు సింగరేణి ఆర్ జి వన్ జి ఎం లలిత్ కుమార్ , ఏజెంట్ రమేష్ , డి జి ఎం ఎక్స్ ప్లో రేషన్ రమేష్ బాబు , ఎన్ పి డి సి ఎల్ ఎ డి ఇ గుండు శ్రీనివాస్ , నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి , సెక్రెటరీ మహేశ్వర్ రెడ్డి ,పలువురు జనగామ గ్రామస్తులు , నాయకులు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో 'మానేరు' విద్యార్థికి కాంస్య పతకం



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** వరంగల్ జిల్లాలోని కెమిస్ట్రి భవన్‌లో జరిగిన 70వ రాష్ట్రస్థాయి పాఠశాలల అండర్ 14 జూడో చాంపియన్ షిప్ పోటీల్లో పాల్గొన్న మానేరు విద్యార్థిని కాంస్య పతకం సాధించినట్లు పీఈటీ సిలివేరి మహేందర్ తెలిపారు. 27 కేజీలలోపు విభాగంలో పాల్గొన్న బండారి జాహ్నవి అద్వితీయ ప్రతిభ కనబరిచి కాంస్య పతకం సాధించినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా శనివారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో జాహ్నవి ని విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి అభినందించారు. భవిష్యత్ లో జాతీయ స్థాయి లో పతకం సాధించాలని సూచించారు. మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపల్ సరితా రెడ్డి, పీఈటీలు మహేందర్, తిరుపతి, స్వామి, సాయి, అన్వర్, అఖిలాషతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు అభినందించారు.

# భారత పర్యటనలో పోలండ్ ప్రధాని

వెల్లిన డొనాల్డ్ చలించిపోయారు. తాజాగా భారత్ పర్యటనకు వచ్చిన టుస్క్.. మరోసారి ఆ కేంద్రాన్ని సందర్శించారు. అక్కడి చిన్నారులతో ముచ్చటించారు. అప్పటి చిన్నారులంతా ఇప్పుడు యుక్తవయసుకొచ్చారు. అయినా.. పోలండ్ జాతీయగీతంలోని పదాలను గుర్తుంచుకోవడంపై టుస్క్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు.

# కరీంనగర్‌లో 26న ఎన్‌సీఎస్ నెట్-కామర్స్ సెమినార్

**వ్యాపార అవకాశాలు, అభివృద్ధిపై అవగాహన కల్పించడమే లక్ష్యం**

**కరీంనగర్ టౌన్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** వోల్టెన్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో ఎన్‌సీఎస్ నెట్-కామర్స్ సెమినార్‌ను ఈ నెల 26న సోమవారం కరీంనగర్‌లో నిర్వహించనున్నారు. వ్యాపార రంగంలో నూతన అవకాశాలు, నెట్-కామర్స్ విధానాలు, వ్యాపార అభివృద్ధి, నాయకత్వ నైపుణ్యాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సెమినార్‌లో ముఖ్య వక్తలుగా జేసీ రెడ్డి (గ్లోబల్ ర్యాంక్ నంబర్ 2, ఇండియా టాప్ లీడర్), ములా శ్రీలత (2025, 2026 గోల్డ్ ఎంట్రప్రెన్యూర్, ఇండియా టాప్ 12వ ర్యాంక్) పాల్గొననున్నారు.ఈ నెల 26న మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు డీమార్ట్ రోడ్‌లోని ఎస్ఆర్ఆర్ సిగ్నల్ సమీపంలో ఉన్న ఆర్‌బీ గ్రాండ్ డిలైట్‌లో సెమినార్ జరగనుంది. ఈ కార్యక్రమానికి గరిష్ఠంగా 200 మందికి మాత్రమే ప్రవేశం కల్పించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.వ్యాపార రంగంపై ఆసక్తి ఉన్నవారు, నూతన అవకాశాలను అన్వేషించేవారు ఈ సెమినార్‌లో పాల్గొని వ్యాపార అభివృద్ధికి అవసరమైన అంశాలపై అవగాహన పొందాలని నిర్వాహకులు కోరారు. "ట్రాన్స్‌ఫార్మింగ్ లైవ్స్ గ్లోబల్లీ" అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమం ద్వారా వ్యాపార రంగంలో ముందుకు సాగాలనుకునే వారికి మార్గదర్శనం అందించనున్నట్లు పేర్కొన్నారు.

# అనుమతులు లేకుండా అక్రమ నిర్మాణం

## రైస్‌మిల్‌తో గ్రామానికి కాలుష్య ముప్పు • తొలగించేదాకా వెనక్కి తగ్గేదే లేదంటున్న గ్రామస్తులు

**అడ్లూర్ ఎల్లారెడ్డిలో నిర్మాణ పనులను పరిశీలించిన ఎంపీడీవో సంతోష్ కుమార్**

**సదాశివనగర్ అక్టోబర్ 24 (జనంసాక్షి):**

గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా నిర్మిస్తున్న రైస్ మిల్ గోదాం నిర్మాణ పనులపై అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ఎలాంటి నిర్ణయాలు తీసుకోవద్దని, రైస్ మిల్ నిర్మాణ ప్రతిపాదనను తక్షణమే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం ఎంపీడీవో సంతోష్ నిర్మాణ పనులను పరిశీలించి విచారణ చేపట్టారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. ఇప్పటికే గ్రామంలో కాలుష్య సమస్యలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, బాయిల్డ్ రైస్ మిల్, రా రైస్ మిల్ ఏర్పాటైతే కాలుష్య ముప్పు మరింత పెరిగే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. మిల్లుల వల్ల ప్రజారోగ్యానికి ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని పేర్కొన్నారు. గ్రామస్తుల అభిప్రాయాలకు విరుద్ధంగా నిర్మాణానికి అనుమతులు ఇస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు.



**గ్రామసభ తీర్మానాన్ని పట్టించుకోరా?**

రైస్ మిల్ నిర్మాణాన్ని రద్దు చేయాలని ఇప్పటికే గ్రామసభలో తీర్మానం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. ప్రజల అభ్యంతరాలు, గ్రామసభ తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకుని అధికారులు నిర్ణయం తీసుకోవాలని కోరారు. గ్రామానికి ముప్పుగా మారే నిర్మాణాల విషయంలో నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని, అనుమతులపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆందోళనలను పక్కనపెట్టి ముందుకెళ్తే గ్రామంలో గందరగోళ పరిస్థితులు ఏర్పడతాయని ఆవేదన వ్యక్తం చేశారు.సర్పంచ్ ఎడ్ల నర్సింలు, బోలిపల్లి మహేందర్ రెడ్డి, మోసర్ల శ్రీకాంత్ రెడ్డి, పయ్యావుల చంద్రం, అస మహేష్, పోతరాజు నరేష్, కుమ్మరి శ్రవణ్, ఎలాగారి రాజయ్య, ఎలాగారి రాజేష్, వార్డు సభ్యులు నందు, రేఖ రంజిత్, కవిత సురేందర్, అబ్బాస్, అశోక్, శివ, వేణు, శ్రీకాంత్, పంచాయతీ కార్యదర్శి వెంకట్, కారోబార్ బాలమల్లు తదితరులు పాల్గొన్నారు.

# మ్యూల్ ఖాతాలపై పోలీసుల కొరడా

- కమిషనరేట్ వ్యాప్తంగా 29 కేసులు నమోదు
- 122 మంది నిందితుల గుర్తింపు.. 89 మందిపై చర్యలు



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** సైబర్ మోసాలకు వినియోగిస్తున్న మ్యూల్ బ్యాంకు ఖాతాలపై పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టారు. కమిషనరేట్ వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలో దర్యాప్తులో ఉన్న సైబర్ నేరాలకు సంబంధించి కఠిన చర్యలు చేపట్టారు. ఈ కేసుల వివరాలను పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం వెల్లడించారు. కమిషనరేట్ పరిధిలోని మొత్తం 16 పోలీస్ స్టేషన్లలో ఇప్పటివరకు 29 ఎఫ్ఐఆర్‌లు నమోదు కాగా, 122 మందిని నిందితులుగా గుర్తించినట్లు తెలిపారు. వీరిలో 89 మందికి సంబంధించి అరెస్టులు లేదా చట్టపరమైన నోటీసుల జారీ ప్రక్రియ పూర్తయిందని, మిగిలిన 33 మందిపై చర్యలు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు.

**పోలీస్ స్టేషన్ల వారీగా కేసుల వివరాలు**

కరీంనగర్ ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో 6 కేసులు నమోదు కాగా, 20 మందిని నిందితులుగా గుర్తించారు. వీరిలో 13 మందిపై చర్యలు పూర్తి కాగా, ఏడుగురిపై పెండింగ్‌లో ఉన్నాయి. రెండో పట్టణ పరిధిలో 5 కేసుల్లో 26 మంది నిందితులు ఉండగా, 16 మందిపై చర్యలు తీసుకున్నారు. మరో 10 మందిపై చర్యలు పెండింగ్‌లో ఉన్నాయి. మూడో పట్టణ పరిధిలో 2 కేసుల్లో 12 మంది నిందితులను గుర్తించగా, 10 మందిపై చర్యలు పూర్తి చేశారు. మరో ఇద్దరిపై పెండింగ్‌లో ఉన్నాయి. కరీంనగర్ రూరల్ పరిధిలో ఒక కేసులో ఆరుగురు నిందితులు ఉండగా, ఒకరిపై చర్యలు తీసుకున్నారు. మిగిలిన ఐదుగురి అరెస్టు పెండింగ్‌లో ఉంది.
జమ్మికుంట పట్టణ పరిధిలో 3 కేసుల్లో 15 మంది నిందితులను గుర్తించగా, 11 మందిపై చర్యలు పూర్తి చేశారు. మరో నలుగురిపై పెండింగ్‌లో ఉన్నాయి. హుజూరాబాద్ పట్టణ పరిధిలో 2 కేసుల్లో 10 మంది నిందితులు ఉండగా, తొమ్మిది మందిపై చర్యలు తీసుకున్నారు. కొత్తపల్లి పరిధిలో 2 కేసుల్లో ఐదుగురు నిందితులను గుర్తించి అందరిపై చర్యలు పూర్తి చేశారు. మానకొండూరు పరిధిలో 2 కేసుల్లో ముగ్గురు నిందితులు ఉండగా, ఒకరిపై చర్యలు తీసుకున్నారు. మరో ఇద్దరిపై పెండింగ్‌లో ఉన్నాయి.
చొప్పదండి, ఇల్లందకుంట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఒక్కో కేసులో ఐదుగురు చొప్పున నిందితులను గుర్తించి అందరిపై చర్యలు పూర్తి చేశారు. గంగాధర పరిధిలో ఒక కేసులో ఆరుగురు నిందితులపై చర్యలు తీసుకున్నారు. ఎల్ఎండీ కాలనీ పరిధిలో ఒక కేసులో ఏడుగురు నిందితులు ఉండగా, ఆరుగురిపై చర్యలు పూర్తి చేశారు. సైదాపూర్ పరిధిలో ఒక కేసులో ఒక నిందితుడిపై చర్యలు తీసుకోగా, వీణవంక పరిధిలో ఒక కేసులో ఒక నిందితుడి అరెస్టు పెండింగ్‌లో ఉంది. కేశవపట్నం, రామడుగు పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలాంటి కేసులు నమోదు కాలేదు.

**బ్యాంకు ఖాతాలు అద్దెకిస్తే కఠిన చర్యలు**

సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతాలను అందజేసే వారిపై కఠిన చర్యలు తప్పవని సీపీ గౌష్ ఆలం హెచ్చరించారు. తమ బ్యాంకు ఖాతాలు, ఏటీఎం కార్డులు, ఓటీపీలను ఇతరులకు అద్దెకు ఇవ్వడం, కమీషన్ల ఆశతో ఇతరుల లావాదేవీలకు వినియోగించేందుకు అనుమతించడం నేరమని స్పష్టం చేశారు. సైబర్ నేరగాళ్లకు సహకరించే ఖాతాదారులను సైతం నేరంలో భాగస్వాములుగానే పరిగణించి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అపరిచిత వ్యక్తులకు బ్యాంకు ఖాతాల వివరాలను అందజేయవద్దని ప్రజలకు సూచించారు.



# బిచ్కుందలో వృద్ధురాలి ఇంట్లో చోరీ

- ముగ్గురు నిందితుల అరెస్ట్.. రూ.12 వేల నగదు, ఇనుప రాడ్ స్వాధీనం
- సీసీ కెమెరాలు, స్థానిక సమాచారంతో కేసు ఛేదించిన పోలీసులు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 (జనం సాక్షి) :** బిచ్కుందలో వృద్ధురాలి ఇంట్లో జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించి ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. ఈ నెల 18న అర్ధరాత్రి సమయంలో సుంకరి సాయవ్వ ఇంటి తలుపులు పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు పెట్టెలో దాచిన రూ.15 వేల నగదును అపహరించారు. బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర ఐపీఎస్ ఆదేశాల మేరకు బాన్సువాడ డీఎస్పీ పర్యవేక్షణలో బిచ్కుంద సీఐ రవికుమార్, ఎస్‌హెచ్ఓ రాజు ఆధ్వర్యంలో ప్రత్యేక బృందాలు సీసీ కెమెరాలను పరిశీలించి, స్థానిక సమాచారం సేకరించాయి. ఈ క్రమంలో 23న రాజుల్ల చౌరస్తా, పరమేశ్వర థియేటర్ సమీపంలో అనుమానాస్పదంగా సంచరిస్తున్న దాసరి తిరుపతి (33), చౌహాన్ అర్జున్ (29), చౌహాన్ సురేష్ (34)లను అదుపులోకి తీసుకుని విచారించగా చోరీకి పాల్పడినట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.
నిందితుల నుంచి చోరీ చేసిన నగదులో మిగిలిన రూ.12 వేలతో పాటు చోరీకి ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుల్లో తిరుపతిపై గతంలో బాన్సువాడ పరిధిలో 10 కేసులు, అర్జున్‌పై బిచ్కుంద పరిధిలో 5 కేసులు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. కేసును ఛేదించిన పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ రాజేష్ చంద్ర అభినందించారు.

# బాధిత ప్రజలకు అండగా నిలుస్తాం

**మానవ హక్కుల సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లపెల్లి విజయసాగర్**

**పెద్దపల్లి,అక్టోబర్ 24(జనంసాక్షి) :** వినియోగదారుల మరియు మానవ హక్కుల పరిరక్షణ,ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయంగా జాతీయ స్థాయిలో పనిచేస్తున్న ప్రతిష్టాత్మక సంస్థ ఉపభోక్త ఏవం మానవ అధికార్ రక్షా సమితి తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా కల్లపెల్లి విజయసాగర్ నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ జాతీయ అధ్యక్షులు ఆర్.కె. జైన్ అధికారిక ఉత్తర్వులు జారీ చేశారు. తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ సహారా బాను సూచనలు,సలహాల మేరకు జాతీయ నాయకత్వం ఈ నియామకాన్ని ఖరారు చేసింది. ఈ సందర్భంగా నూతన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కల్లపెల్లి విజయసాగర్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించిన జాతీయ,రాష్ట్ర నాయకత్వానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల గోడును, సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారితో నిరంతరం సమన్వయం చేసుకుంటూ చట్టబద్ధమైన మార్గాల్లో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. వినియోగదారుల హక్కులు, మానవ హక్కులపై క్షేత్రస్థాయిలో ప్రజల్లో విస్తృత అవగాహన కల్పిస్తామని, బాధితులకు న్యాయం జరిగేలా సంస్థ నిరంతరం పోరాడుతుందని ఆయన స్పష్టం చేశారు.

# సర్వేయర్లకు షాక్

## విధుల నుండి 54 మంది డిస్మిస్

- రీ సర్వే పనుల్లో అలసత్వాన్ని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు
- షోకాజ్ నోటీసులకు స్పందించకపోవడంతో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి చర్యలు
- వారి స్థానంలో త్వరలోనే కొత్త సర్వేయర్ల నియామకం



**రంగారెడ్డి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన సర్వేయర్లపై వేటు పడింది. 54 మంది సేవలను జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి రద్దు చేశారు. వారి స్థానంలో త్వరలోనే కొత్త సర్వేల నియామకం చేపట్టనున్నట్లు వెల్లడించారు.. రంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా మొత్తం 281 మంది లైసెన్స్ సర్వేయర్లను నియమించగా, వారిలో 102 మంది విధులకు హాజరుకాకపోవడంపై గతంలో షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిపారు. నోటీసులకు స్పందించిన 48 మంది తిరిగి విధుల్లో చేరగా, ఎలాంటి వివరణ ఇవ్వని మిగిలిన 54 మందిపై చర్యలు తీసుకుంటూ వారి సేవలను రద్దు చేసినట్లు స్పష్టం చేశారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీ-సర్వే కార్యక్రమంలో లైసెన్స్‌డ్ సర్వేయర్ల పాత్ర అత్యంత కీలకమని అదనపు కలెక్టర్ పేర్కొన్నారు. అధికారుల ఆదేశాలను పాటించకపోవడం, విధుల పట్ల నిర్లక్ష్యం వహించడాన్ని ఏమాత్రం ఉపేక్షించబోమని హెచ్చరించారు. సర్వేయర్లందరూ నిర్దేశిత లక్ష్యాలను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధ్యతాయుతంగా పనిచేయాలని సూచించారు. అదేవిధంగా సేవలు రద్దయిన సర్వేయర్ల స్థానంలో వెంటనే కొత్త లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి, జిల్లాలో రీ-సర్వే పనులు ఎలాంటి ఆటం కం లేకుండా నిరంతరాయంగా కొనసాగేలా చర్యలు తీసుకుంటున్నట్లు అదనపు కలెక్టర్ వివరించారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే నా ధ్యేయం

- దశాబ్ద కాల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం..
- సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య



**గోదావరిఖని, జనంసాక్షి :** రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ 41వ డివిజన్లో కొన్ని సంవత్సరాలుగా పేరుకుపోయిన మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం దిశగా అడుగులు వేస్తూ శిశు మందిర్ మెయిన్ లైన్ నుండి వెనుక లైన్ లోకి ఇంటర్ లింకు ద్వారా నూతన మున్సిపల్ పైప్లైన్ చేయడానికి పనులు ప్రారంభించడం జరిగింది ఈ సందర్భంగా బట్టి పెద్ద మనుషులంతా కొబ్బరికాయలు కొట్టి పనులు ప్రారంభించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ ఫ్లోర్ లీడర్ మార్కపురి సూర్య హాజరై మాట్లాడుతూ “41వ డివిజన్ అభివృద్ధికి కట్టుబడి నిరంతరం ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని తెలిపారు గత కొన్ని సంవత్సరాలుగా మంచినీటి సమస్యను ఎదుర్కొంటున్న మహిళలు బస్తీ పెద్దలు సమస్య తన దృష్టికి తీసుకురాగా మున్సిపల్ అధికారులతో మాట్లాడి ఈరోజు నూతన మున్సిపల్ లైన్ వేయడానికి నిర్మాణ పనులు ప్రారంభించామని తెలిపారు ఎన్నికల వాగ్దానాలు చేయడమే కాకుండా ఎన్నికల అనంతరం ప్రజలకు 24 గంటలు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని డివిజన్లో ప్రజలు ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే శక్తి వంచన లేకుండా సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు ఈ సందర్భంగా బస్తీ పెద్దలు కొండపర్తి సంజీవ్ కుమార్, శ్రీనివాస్ రెడ్డి, పల్లే ఐలయ్య, ఆనందం, పరశురాములు, వెంకన్న, కొమురయ్య, వంశీ మున్సిపల్ లైన్మెన్ సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

# జీజీహెచ్‌లో వసతుల మెరుగుదలకు కలెక్టర్ ఆదేశాలు

- మరమ్మతుల నాణ్యతపై క్షేత్రస్థాయి పరిశీలన
- రూ.6.5 కోట్ల క్రిటికల్ కేర్ సెంటర్ వినియోగంపై సమీక్ష
- రోగులకు మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్ చిత్రా మిశ్రా



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే రోగులకు నాణ్యమైన వైద్యంతోపాటు పరిశుభ్రమైన వాతావరణం, మెరుగైన మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. శనివారం కరీంనగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)ను సందర్శించి వివిధ వార్డులు, ఓపీ, ఎంఎన్‌డబ్ల్యూ యూనిట్, సర్జికల్ విభాగాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వైద్య సేవలు, అందుబాటులో ఉన్న సదుపాయాలపై వివరాలు తెలుసుకున్నారు. వైద్యులు, సిబ్బంది బాధ్యతగా విధులు నిర్వహిస్తూ రోగులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని, పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. ఆసుపత్రిలో చేపడుతున్న మరమ్మతు పనులను పరిశీలించిన కలెక్టర్.. ప్యాచ్‌వర్క్‌లు, మరుగుదొడ్లు, గదులు, కిటికీల మరమ్మతులను నాణ్యతా ప్రమాణాలతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పనుల వల్ల వైద్య సేవలకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సుమారు రూ.6.5 కోట్లతో ఏర్పాటు చేసిన క్యాత్‌ల్యాబ్ యంత్రాలు, క్రిటికల్ కేర్ సెంటర్‌ను పరిశీలించి వాటిని పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకొచ్చేందుకు అవసరమైన చర్యలపై వైద్యాధికారులతో సమీక్షించారు. ఆధునిక వైద్య సదుపాయాలు ప్రజలకు అందేలా శాఖల మధ్య సమన్వయం ఉండాలని సూచించారు. మాతా శిశు ఆరోగ్య కేంద్రం ఆవరణలో రోగుల సహాయకుల కోసం రూ.35 లక్షలతో నిర్మించనున్న విశ్రాంతి షెడ్డు పనులను కూడా కలెక్టర్ పరిశీలించారు. వారికి ఉపయోగపడేలా అవసరమైన వసతులు కల్పించాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు, సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా అధికారులు పనిచేయాలని స్పష్టం చేశారు. ఈ పర్యటనలో జీజీహెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, ఆర్ఎంఓ నవీన, వైద్య సిబ్బంది, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# శంషాబాద్ విమానాశ్రయంలో రూ.1.56 కోట్ల విదేశీ కరెన్సీ స్వాధీనం



**శంషాబాద్,అక్టోబర్24(జనంసాక్షి) :** శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో రూ.1.56 కోట్ల విలువైన అమెరికన్ డాలర్లను డీఆర్ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. హైదరాబాద్ నుంచి కౌలాలంపూర్ వెళ్లేందుకు సిద్ధమైన ఇద్దరు ప్రయాణికుల వద్ద నల్లటి ప్లాస్టిక్ కవర్లలో చుట్టి తరలిస్తున్న విదేశీ కరెన్సీని గుర్తించారు. ఈ ఘటనలో ఓ మహిళతో పాటు మరో ప్రయాణికుడిని అరెస్ట్ చేసి, కరెన్సీ మూలాలు, అక్రమ రవాణా వెనుక ఉన్నవారి వివరాలపై దర్యాప్తు చేస్తున్నారు.





# ఫ్లై ఓవర్ పనులు వేగవంతం చేయండి : స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

**వికారాబాద్ జిల్లా బ్యూరో అక్టోబర్ 24 (జనం సాక్షి):** ఫ్లైఓవర్ రోడ్డు పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోపు పూర్తి చేయాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం వికారాబాద్ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న ఫ్లైఓవర్ రోడ్డు పనులను జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ, ప్రజా ప్రతినిధులు, అధికారులతో కలిసి శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... ఫ్లైఓవర్ రోడ్డు పనుల్లో ఎలాంటి జాప్యం జరగకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. నిర్మాణ పనులను నిరంతరం పర్యవేక్షిస్తూ, నాణ్యతా ప్రమాణాలను పాటిస్తూ పనులు త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు సూచించారు. ప్రజలకు రవాణా పరంగా ఇబ్బందులు కలగకుండా చూడటంతో పాటు, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పనుల పురోగతిపై ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆయన అధికారులకు సూచించారు. ఫ్లైఓవర్ రోడ్డు పనులు పూర్తయితే ప్రజలకు రాకపోకలు సులభతరం కావడంతో పాటు ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయని ఆయన పేర్కొన్నారు. ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యాలు కల్పించే దిశగా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి పనులను త్వరగా పూర్తి చేయాలని శాసనసభ సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశించారు. ఫ్లైఓవర్ రోడ్డు నిర్మాణం చేపట్టేందుకు సహకరించి ఆస్తులు కోల్పోయిన వారికి వారం రోజుల్లోగా నష్టపరిహారం చెల్లించేందుకు తగు చర్యలు తీసుకున్నట్లు శాసనసభ సభాపతి ఈ సందర్భంగా గుర్తు చేశారు. శాసనసభ సభాపతి పర్యటనలో ఆర్డీఓ వాసు చంద్ర, డిసిసిబి డైరెక్టర్ కిషన్ నాయక్, మున్సిపల్ వైస్ చైర్మన్ అర్ద సుధాకర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ చాపల శ్రీనివాస్ ముదిరాజ్, ఆర్ అండ్ బి ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీధర్ రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

# థాంగ్-టా విజేతలకు కలెక్టర్ అభినందన

**జాతీయ స్థాయికి సనా తబసూమ్, మనోజ్ కార్తి ఎంపిక**

**సుల్తానాబాద్,అక్టోబర్ 24(జనంసాక్షి) :** రాష్ట్రస్థాయి థాంగ్-టా మార్షల్ ఆర్ట్స్ పోటీల్లో ఇండియన్ పబ్లిక్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. వివిధ విభాగాల్లో పతకాలు సాధించి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అభినందించారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన సనా తబసూమ్, మనోజ్ కార్తిని ప్రత్యేకంగా ప్రశంసించారు. ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ రాష్ట్రస్థాయి థాంగ్-టా పోటీల్లో అండర్-17 బాలుర విభాగంలో మనోజ్ కార్తి (-48 కిలోలు) బంగారు పతకం సాధించాడు. సంప్రీత్ (-52 కిలోలు), అద్వైత్ (-56 కిలోలు), సాత్విక్ (-75 కిలోలు) రజత పతకాలు గెలుచుకున్నారు.

అండర్-17 బాలికల విభాగంలో కృషిక (-75 కిలోలు) రజతం, శ్రీ వర్షిణి (-48 కిలోలు) కాంస్య పతకం సాధించారు. అండర్-14 బాలికల విభాగంలో సనా తబసూమ్ (-41 కిలోలు) బంగారు పతకం కైవసం చేసుకుంది. విద్యార్థుల విజయాల పై పాఠశాల చైర్మన్ మాట్లాడి సంజీవ్ కుమార్, ప్రిన్సిపల్ కృష్ణప్రియ ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. జాతీయస్థాయి లోనూ రాణించి మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ కృష్ణప్రియ,వ్యాయామ ఉపాధ్యాయులు సత్యనారాయణ,సతీష్,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధం

- నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలి
- విపత్తు వేళ ప్రతిపక్షాలు బాధ్యతగా వ్యవహరించాలి
- స్వచ్ఛంద సంస్థలు సహకరించాలి
- సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి




**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** ఎల్‌నినో ప్రభావంతో తలెత్తే పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని సుడా మాజీ చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉంటూ నీరు, విద్యుత్తును పొదుపుగా వినియోగించాలని పిలుపునిచ్చారు. ముకరంపురలోని తన కార్యాలయంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రపంచవ్యాప్తంగా ఎల్‌నినో ప్రభావంతో పలు దేశాలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వర్షాభావ పరిస్థితులతో నీటి కొరత, విద్యుత్తు సమస్యలు తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. ఇలాంటి సమయంలో ప్రజలు ప్రభుత్వానికి సహకరించాలని, స్వచ్ఛంద సంస్థలు కూడా విపత్తును ఎదుర్కొనేందుకు ముందుకు రావాలని కోరారు. ప్రభుత్వానికి సహకరించాల్సిన ప్రతిపక్షాలు.. కరువు కాంగ్రెస్ ప్రభుత్వమే తెచ్చినట్లు ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాయని విమర్శించారు. గతంలో కరోనా సమయంలో కాంగ్రెస్ బాధ్యతగా వ్యవహరించలేదా? అని ప్రశ్నించారు.
నామినేటెడ్ పదవుల అంశంపై స్పందిస్తూ.. మూడు దశాబ్దాలకు పైగా కాంగ్రెస్ పార్టీలో నిబద్ధతతో పనిచేస్తున్నానని నరేందర్‌రెడ్డి తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో టికెట్ ఆశించినప్పటికీ, అధిష్ఠానం నిర్ణయానికి కట్టుబడి పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేశానన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తనకు సుడా చైర్మన్‌గా అవకాశం కల్పించినందుకు కృతజ్ఞతతో ఉన్నానని, ఆ పదవిలో నిబద్ధతతో పనిచేశానని పేర్కొన్నారు. సుడాకు ఆదాయం సమకూర్చి, ఆ నిధులతో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. మిగిలిన పనులను పూర్తి చేసేందుకే పదవీకాలం పునరుద్ధరణకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. కొందరు ఉద్దేశపూర్వకంగా లేనివి ఉన్నట్లు చిత్రీకరిస్తూ తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో మైనారిటీ సెల్ జిల్లా చైర్మన్ ఎండీ తాజ్, గుండాటి శ్రీనివాస్‌రెడ్డి, లాయక్, షబానా మహమ్మద్, అస్థాపురం రమేష్, జీడీ రమేష్, మామిడి సత్యనారాయణరెడ్డి, సాయిరాం, బషీర్, భారీ, జిలుకర రమేష్, హనీఫ్ తదితరులు పాల్గొన్నారు.

# వైద్యపరమైన రికార్డులను జాగ్రత్తగా భద్రపర్చాలి

- అర్థమయ్యే రీతిలో ప్రిస్క్రిప్షన్ ఉండాలి
- వైద్యరంగ నిపుణుల అవగాహన సదస్సులో జిల్లా జడ్జి



**నిజామాబాద్ జిల్లా ప్రతినిధి అక్టోబర్ 24 జనం సాక్షి:** వైద్య వృత్తిలో కొనసాగుతున్న వారు వైద్యపరమైన రికార్డులను సక్రమంగా నిర్వహిస్తూ, వాటిని జాగ్రత్తగా భద్రపర్చాలని జిల్లా జడ్జి జీ.వీ.ఎన్.భరతలక్ష్మి సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ప్రధాన సమావేశ మందిరంలో శనివారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులకు, వైద్య రంగ నిపుణులకు వివిధ అంశాలపై న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా జడ్జి ముఖ్య అతిథిగా విచ్చేయగా, కలెక్టర్ ఇలా త్రిపాఠి, అదనపు డీ.సీ.పీ శుభం నగ్రాలే తదితరులు పాల్గొన్నారు. వైద్యుల హక్కులు, వైద్య సేవల్లో చట్టపరమైన బాధ్యతలపై జిల్లా జడ్జి, కలెక్టర్, ఇతర వక్తలు ముఖ్య సూచనలు చేశారు. హెల్త్ కేర్ ప్రొఫెషనల్స్ అండ్ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్స్ (ప్రివెన్షన్ ఆఫ్ వయలెన్స్) చట్టం--2025, వైద్య రికార్డుల నిర్వహణ, వాటి చట్టపరమైన ప్రాముఖ్యత, న్యాయపరమైన విచారణల్లో వాటి ప్రామాణికత తదితర అంశాలపై ఈ సదస్సులో అవగాహన కల్పించారు. వైద్య సేవలందించే సమయంలో చట్టపరమైన నిబంధనలను పాటించడం, వైద్య రికార్డులను సక్రమంగా నిర్వహించడం, వృత్తిపరమైన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించడం ద్వారా వైద్యులు, రోగుల హక్కులను పరిరక్షించడంతో పాటు న్యాయ ప్రక్రియకు సహకారం అందించిన వారు అవుతారని ఈ సందర్భంగా అవగాహన కల్పించారు. న్యాయవ్యవస్థలో వైద్యులు భాగస్వాములుగా వ్యవహరించాల్సిన ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఎస్.నారాయణ, నాల్గవ అదనపు జిల్లా న్యాయమూర్తి డి.దుర్గాప్రసాద్, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి నీలిమ ముద్దసాని, ట్రైనీ కలెక్టర్ సురేష్, బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎన్.సుభాష్ రెడ్డి, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారిణి డాక్టర్ రాజశ్రీ, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎ.విశాల్, డీసీహెచ్ఎస్ డాక్టర్ శ్రీనివాస్ ప్రసాద్, రాష్ట్ర వైద్య మండలి జిల్లా ఇన్‌చార్జి, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ దీపక్ రాథోడ్, రాజ్ కుమార్ సుబేదార్, ప్రభుత్వ, ప్రైవేట్ వైద్యులు, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్య విద్యకు ప్రాధాన్యం.. అల్ఫోర్స్‌లో అంతర్జాతీయ కరిక్యులం

- వెస్ట్ ఆస్ట్రేలియా విద్యా విధానంతో కొత్త పాఠశాల
- నర్సరీ నుంచి రెండో తరగతి వరకు తరగతులు
- ఎనిమిదో తరగతి నుంచే నచ్చిన సబ్జెక్టుల ఎంపిక
- మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి వద్దు: నరేందర్‌రెడ్డి



**కరీంనగర్ బ్యూరో, అక్టోబర్ 24 (జనంసాక్షి):** భారతీయ విద్యా వ్యవస్థలో నైపుణ్య ఆధారిత విద్యకు మరింత ప్రాధాన్యమివ్వాలని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత వి. నరేందర్‌రెడ్డి సూచించారు. విజయదశమి సందర్భంగా ఆస్ట్రేలి యా పర్యటన విశేషాలను వెల్లడించిన ఆయన.. పశ్చిమ ఆస్ట్రేలియా విద్యా విధానం, కరిక్యులం, ఉపాధి అవకాశాలను పరిశీలించినట్లు తెలిపారు. అక్టోబర్ 17 నుంచి 22 వరకు వివిధ రాష్ట్రాలకు చెందిన 12 మంది విద్యారంగ ప్రముఖులతో కలిసి అక్కడి యూనివర్సిటీలు, పాఠశాలలను సందర్శించినట్లు వివరించారు.
మన దేశంలో డాక్టర్లు, సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లుగా ఎదగడంపైనే అధిక దృష్టి ఉండటంతో ఇతర రంగాల్లో నైపుణ్యాలకు తగిన ప్రోత్సాహం లభించడం లేదన్నారు. ఆస్ట్రేలియాలో సాంకేతిక, వృత్తి విద్యతో పాటు వ్యవసాయం, సంగీతం, క్రీడలు, కళలు తదితర రంగాలకు సమాన ప్రాధాన్యమిస్తున్నారని పేర్కొన్నారు. అక్కడ నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే విద్యా విధానం అమల్లో ఉందని, అంతర్గత పరీక్షలకు 50 శాతం మార్కులు కేటాయించడం ద్వారా విద్యార్థులపై పరీక్షల ఒత్తిడిని తగ్గిస్తున్నారని తెలిపారు. ఎనిమిదో తరగతి నుంచే విద్యార్థులు తమ ఆసక్తికి అనుగుణంగా వివిధ సబ్జెక్టులను ఎంచుకునే అవకాశం ఉందన్నారు. మైనర్ల ఫొటోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేయడంపై అక్కడ చట్టపరమైన ఆంక్షలు ఉన్నాయని వివరించారు.
తల్లిదండ్రుల ఆసక్తికి అనుగుణంగా అల్ఫోర్స్‌లో వెస్ట్ ఆస్ట్రేలియా కరిక్యులంతో అంతర్జాతీయ పాఠశాలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రభుత్వ అనుమతుల ప్రక్రియ తుది దశలో ఉందని, వచ్చే విద్యా సంవత్సరం నుంచి నర్సరీ మొదలుకొని రెండో తరగతి వరకు తరగతులు ప్రారంభిస్తామని వెల్లడించారు. మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి చేయకుండా ఐఐటీ, వైద్య విద్యతో పాటు క్లాట్, సీఏ, వ్యవసాయం, క్రీడలు వంటి విభిన్న రంగాల్లో రాణించేలా ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. విద్యాసంస్థల్లో మౌలిక వసతులు, డిజిటల్ బోర్డులు, ప్రయోగశాలలను ఆధునికీకరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

### ముషీరాబాద్ ఆర్టీసీ భూముల
# స్వాధీన జీవోను నిలిపివేయాలి
### టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్

**ముషీరాబాద్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** టీజీఎస్ఆర్టీసీకి చెందిన ముషీరాబాద్లోని ఆరెకరాల 15 గుంటల భూములను ప్రభుత్వ అవసరాల కోసం స్వాధీనం చేసుకునేందుకు జారీ చేసిన జీవో నంబర్ 206ను తక్షణమే నిలిపివేయాలని టీజీఎస్ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ నాయకులు ఎస్. బాబు, ఈ. వెంకన్న ప్రభుత్వ చర్యను తీవ్రంగా ఖండించారు. ఆర్టీసీ కార్మికులు ఎన్నో ఏళ్లుగా కష్టపడి సమకూర్చుకున్న ఆస్తులను ఇతర అవసరాలకు వినియోగిస్తే సంస్థ మనుగడకు ప్రమాదం ఏర్పడుతుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ భూములను ఇందిరమ్మ ఇళ్ల వంటి పథకాలకు వినియోగించాలి తప్ప ఆర్టీసీ భూములను కేటాయించడాన్ని అంగీకరించబోమన్నారు. ఆర్టీసీ కార్మికులకు నివాస గృహాలు కల్పించేందుకు ఈ భూములను వినియోగించాలని సూచించారు. తక్షణమే జీవోను వెనక్కి తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా కార్మికులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఆర్టీసీ ఆస్తుల పరిరక్షణ కోసం అన్ని కార్మిక సంఘాలు కలిసి రావాలని యూనియన్ రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి పాటి అప్పారావు కోరారు.

# ముదిరాజ్ కాలనీలో 18 ఎకరాల ప్రభుత్వ భూమికి రక్షణ కవచం

- సర్వే నంబర్ 255లో ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు..
- భారీ పోలీసు బందోబస్తు మధ్య రెవెన్యూ అధికారుల చర్యలు

**హయత్ నగర్, అక్టోబర్ 24 (జనం సాక్షి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని హయత్‌నగర్ సర్కిల్, హయత్‌నగర్ డివిజన్ ముదిరాజ్ కాలనీలో సర్వే నంబర్ 255లో ఉన్న 18 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడేందుకు రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూమి అక్రమ ఆక్రమణలకు గురికాకుండా ఉండేందుకు అధికారుల పర్యవేక్షణలో ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేసి రక్షణ చర్యలు చేపట్టారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించడమే లక్ష్యంగా భారీ పోలీసు బందోబస్తు మధ్య ఈ పనులు నిర్వహించారు. ప్రభుత్వ భూమి వద్ద ఆందోళన చేపట్టేందుకు ప్రయత్నించిన రైతులు, స్థానిక ప్రజాప్రతినిధులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ఎల్బీనగర్ జోన్ పరిధిలోని హయత్‌నగర్, వనస్థలిపురం, ఎల్బీనగర్, సరూర్‌నగర్, నాగోల్ తదితర పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు, సిబ్బందితో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. వనస్థలిపురం ఏసీపీ తాండ్ర కరుణాకర్ ఆధ్వర్యంలో భద్రతా ఏర్పాట్లు చేపట్టారు.

ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ సర్వే నంబర్ 255లోని 18 ఎకరాల ప్రభుత్వ భూమిని అక్రమ ఆక్రమణల నుంచి కాపాడేందుకు ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వం నిరుపేదల కోసం ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టే లక్ష్యంతో ఈ స్థలాన్ని ఎంపిక చేసిందని పేర్కొన్నారు. అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల స్థలాలు కేటాయించడంతోపాటు ఇళ్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ భూమిని పరిరక్షించి, నిరుపేదలకు ఉపయోగపడేలా చర్యలు చేపడుతున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో హయత్‌నగర్ ఎమ్మార్వో జానకి, హయత్‌నగర్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ రవిబాబు, నాగోల్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ, హయత్‌నగర్ ఆర్ఐ రవికుమార్‌తో పాటు ఎల్బీనగర్, సరూర్‌నగర్ తదితర పోలీస్ స్టేషన్లకు చెందిన అధికారులు, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వానికి చెందిన 18 ఎకరాల భూమిని పరిరక్షించేందుకు ప్రీకాస్ట్ వాల్ ఏర్పాటు చేయడంతో పాటు పోలీసు బందోబస్తు మధ్య రక్షణ చర్యలు చేపట్టారు.

### అనారోగ్యంతో ఉరేసుకొని
# వివాహిత మృతి

**గోదావరిఖని, జనంసాక్షి :**
రామగుండం నగర పాలక సంస్థ పరిధిలోని ఎన్టిపిసి పి టిఎస్ లో నివాసముంటున్న దాడి రోహిణి (36) గత కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు, కడుపు నొప్పి, తలనొప్పితో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందినప్పటికీ ఆరోగ్యం మెరుగుపడ లేదు. ఈ క్రమంలో శనివారం తన ఇంటిలోని బెడ్‌రూమ్‌లో సీలింగ్ ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మృతురాలికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.మృతురాలి తమ్ము డు కరేటి రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ వెంకట్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# పకడ్బందీగా పీఎం రాహత్

- జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి ఆదేశం
- రోడ్డు ప్రమాద బాధితులకు రూ.1.50 లక్షల వరకు ఉచిత వైద్యం




**రంగారెడ్డి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** రోడ్డు ప్రమాద బాధితులకు సత్వర వైద్య సహాయం అందించి, వారి ప్రాణాలను కాపాడేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం రాహత్ పథకాన్ని జిల్లాలో పకడ్బందీగా అమలు చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పీఎం రాహత్ పథకం అమలుపై సమీక్షించారు. ఈ సందర్భంగా పథకం ద్వారా అందించే సేవలు, అనుసరించాల్సిన విధివిధానాలపై ఆదేశాలు జారీ చేశారు. ఈ పథకం కింద అర్హులైన రోడ్డు ప్రమాద బాధితులకు ప్రమాదం జరిగిన తేదీ నుంచి ఏడు రోజుల వరకు ఒక్కొక్కరికి గరిష్ఠంగా రూ.1.50 లక్షల వరకు నగదు రహిత వైద్య చికిత్స అందించనున్నామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నమోదయ్యే రోడ్డు ప్రమాద కేసులను వెంటనే సంబంధిత ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని, బాధితుల వివరాల ధ్రువీకరణ విషయంలో పోలీసులు తక్షణమే స్పందించాలని సీఎస్ సూచించారు. ఆసుపత్రుల క్లెయిమ్‌లను కలెక్టర్లు క్రమం తప్పకుండా పరిశీలించి, సకాలంలో బిల్లుల చెల్లింపులు జరిగేలా పర్యవేక్షించాలన్నారు.

నెక్స్ట్‌జెన్ ఎం-పరివాహన్ మొబైల్ యాప్ ద్వారా రోడ్డు ప్రమాదాల సమాచారాన్ని నమోదు చేయడం, పథకం క్లెయిమ్‌ల స్థితిని తెలుసుకోవడంపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాలని కోరారు. ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరిస్తూ, జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ద్వారా సాంకేతిక సహకారం తీసుకోవాలన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ సి. నారాయణ రెడ్డి అధికారులతో మాట్లాడుతూ.. ప్రమాదాలు అధికంగా జరిగే బ్లాక్ స్పాట్లను గుర్తించి నివారణ చర్యలు చేపట్టాలన్నారు. అంబులెన్స్‌లు, ఆసుపత్రులు, ట్రామా సెంటర్ల సేవలను సమీక్షించి, సిబ్బందికి అవసరమైన శిక్షణ ఇచ్చి ప్రక్రియను వ వారంలోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. రవాణా, పోలీస్, వైద్య ఆరోగ్య, ఆర్ అండ్ బి, ఎన్‌హెచ్ఏఐ శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలాల వారీగా పెండింగ్ కేసులు, క్లెయిమ్‌లపై నెలవారీ పురోగతి నివేదికలు అందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ డాక్టర్ కె. కిరణ్మయి, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి, ఆర్ అండ్ బి, రవాణా తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణకు ఈటల చొరవ





- సీఆర్ఐడీఏఐ, డీర్ పార్క్ వద్ద అండర్‌పాస్‌ల ప్రతిపాదన
- రసాయన వ్యర్థాల దుర్వాసన సమస్య పరిష్కారానికి విజ్ఞప్తి
- ట్రాఫిక్ ఇబ్బందుల తొలగింపుపై ప్రత్యేక దృష్టి
- బీజేపీ డివిజన్ ప్రధాన కార్యదర్శి కొత్ర దామోదర్ గౌడ్

**హయత్‌నగర్, అక్టోబర్ 24 (జనంసాక్షి):** మన్సూరాబాద్ నుంచి కుంట్లూరు చౌరస్తా వరకు పాత పోచంపల్లి రోడ్డు పునరుద్ధరణ, ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, స్థానిక కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి చొరవ చూపుతున్నారని బీజేపీ మన్సూరాబాద్ డివిజన్ ప్రధాన కార్యదర్శి కొత్ర దామోదర్ గౌడ్ తెలిపారు. రహదారి అభివృద్ధితో పాటు స్థానికులు ఎదుర్కొంటున్న పర్యావరణ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. పాత పోచంపల్లి రోడ్డు పరిసరాల్లో రసాయన వ్యర్థాల నుంచి వెలువడుతున్న దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని దామోదర్ గౌడ్ తెలిపారు. ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణ దృష్ట్యా సంబంధిత అధికారులు సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు. రోడ్డు పునరుద్ధరణ ఆవశ్యకతను ఎంపీ ఈటల రాజేందర్ కేంద్ర మంత్రుల దృష్టికి తీసుకెళ్లినట్లు వివరించారు. ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు సీఆర్ఐడీఏఐ ప్రాంతం వద్ద ఒకటి, డీర్ పార్క్ సమీపంలో మరొకటి చొప్పున రెండు అండర్‌పాస్‌ల నిర్మాణానికి ప్రతిపాదిం చినట్లు వెల్లడించారు. ఈ పనులు కార్యరూపం దాల్చితే రాకపోకలు సులభతరమవడంతో పాటు ప్రయాణికులకు సౌకర్యం కలుగుతుందన్నారు. రహదారి అభివృద్ధి, అండర్‌పాస్‌ల నిర్మాణం, రసాయన వ్యర్థాల సమస్య పరిష్కారంపై సంబంధిత శాఖలు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని కోరారు.

# పవర్‌గ్రిడ్ కార్యాలయంలో ఫోన్ కలకలం

### మహిళల వాష్‌రూమ్‌లో రహస్యంగా మొబైల్ ఫోన్..ఫ్లోర్ అటెండెంట్ అరెస్ట్

**ముషీరాబాద్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** కవాడిగూడలోని పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ కార్యాలయంలో మహిళల వాష్‌రూమ్‌లో రహస్యంగా మొబైల్ ఫోన్ అమర్చిన ఘటన కలకలం రేపింది. ఈ ఘటనపై నమోదైన కేసులో ఫ్లోర్ అటెండెంట్ భరత్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. తదుపరి విచారణ నిమిత్తం కేసును సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. వివరాల్లోకి వెళితే.. పవర్‌గ్రిడ్ కార్యాలయంలోని ఆరో అంతస్తులో ఉన్న మహిళల వాష్‌రూమ్‌లో వాష్‌బేసిన్ కింద గోడకు డబుల్ సైడెడ్ టేప్‌తో అతికించిన మొబైల్ ఫోన్‌ను ఓ మహిళా ఉద్యోగిని గుర్తించారు. ఫోన్‌కు అడ్డుగా తెల్లటి కాగితం వంటి వస్తువు ఉండటంతో అనుమానం వచ్చిన ఆమె పరిశీలించగా విషయం వెలుగులోకి వచ్చింది. ఫోన్ ఎవరిదని అదే అంతస్తులో పనిచేస్తున్న ఫ్లోర్ అటెండెంట్ భరత్‌ను ప్రశ్నించగా, అతడు ఫోన్‌ను తీసుకుని అక్కడి నుంచి వెళ్లేందుకు ప్రయత్నించినట్లు బాధితురాలు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో సహోద్యోగులు, హెచ్ఆర్ విభాగం, భద్రతా సిబ్బందికి సమాచారం అందించి అతడిని పట్టుకున్నారు. ఫోన్‌లోని వీడియోలను పరిశీలించేందుకు ప్రయత్నించగా, పిన్‌తో లాక్ చేసిన ఫోల్డర్ కనిపించినట్లు బాధితురాలు తెలిపారు. పిన్ వివరాలు అడిగిన సమయంలో భరత్ ఫోన్‌ను లాక్కొని నేలకేసి కొట్టినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫోన్‌లోని సమాచారాన్ని వెలికితీసి, ఈ ఘటనలో మరెవరైనా భాగస్వాములుగా ఉన్నారా అనే కోణంలో సమగ్ర దర్యాప్తు చేయాలని ఆమె కోరారు.

ఈ ఘటనపై గత నెల 13న గాంధీనగర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. అనంతరం తదుపరి విచారణ కోసం కేసును సిటీ సైబర్ క్రైమ్ పోలీసులకు బదిలీ చేశారు. ఫోన్‌లోని సమాచారాన్ని పరిశీలించి ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను వెలికితీసే దిశగా దర్యాప్తు కొనసాగుతోంది.

# స్మశానవాటికలో అక్రమ నిర్మాణాలు తొలగించాలి

- కబ్జా యత్నాలను అడ్డుకోవాలి.. అధికారులకు కాంగ్రెస్ నేత అశోక్ యాదవ్ డిమాండ్
- చర్యలు తీసుకోకుంటే గ్రామస్థులే తొలగిస్తారు



**రాజేంద్రనగర్, అక్టోబర్ 23 (జనంసాక్షి):** నార్సింగి సర్కిల్ పరిధిలోని కాస్తాల స్మశానవాటిక స్థలంలో చేపడుతున్న నిర్మాణాలను తొలగించి, ఆ స్థలాన్ని గ్రామస్థుల అంత్యక్రియల కోసం అందుబాటులో ఉంచాలని నార్సింగి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు క్యాతం అశోక్ యాదవ్ అధికారులను డిమాండ్ చేశారు. బఫర్ జోన్ హద్దులు నిర్ణయించినప్పటికీ, స్మశానవాటిక స్థలంలో రెండు షెడ్లు నిర్మించడంపై గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని తెలిపారు.

శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. నిజాం కాలంలో గ్రామ పెద్ద ఫక్రుద్దీన్ సుమారు ఎకరం భూమిని గ్రామస్థుల అంత్యక్రియల కోసం కేటాయించినట్లు పేర్కొన్నారు. అప్పటి నుంచి ఆ స్థలం స్మశానవాటికగా వినియోగంలో ఉందన్నారు. గత రెండేళ్లుగా కేడియా రియల్టర్స్ సంస్థ ఈ భూమిని ఆక్రమించేందుకు ప్రయత్నిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం అక్కడ షెడ్లు, కంటైనర్లు ఏర్పాటు చేయడం ద్వారా స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని విమర్శించారు. రాజేంద్రనగర్ ఆర్డీవో, గండిపేట మండల తహసీల్దార్ శ్రీనివాస్‌రెడ్డి వెంటనే స్థలాన్ని పరిశీలించి, అక్రమ నిర్మాణాలను తొలగించాలని అశోక్ యాదవ్ కోరారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుని స్మశానవాటిక స్థలాన్ని గ్రామస్థులకు అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. అధికారులు స్పందించకపోతే గ్రామస్థులతో కలిసి నిర్మాణాలను తామే తొలగించాల్సి వస్తుందని హెచ్చరించారు.

# జవహర్ నగర్ అభివృద్ధికి రూ.35 కోట్ల నిధులు మంజూరు

- 115 అభివృద్ధి పనులకు శ్రీకారం.. సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలకు నిధుల కేటాయింపు
- మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు కాంగ్రెస్ శ్రేణుల కృతజ్ఞతలు



**జవహర్ నగర్: అక్టోబర్ 24: (జనంసాక్షి) :**
జవహర్ నగర్, అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం భారీగా నిధులు మంజూరు చేసింది. జవహర్ నగర్ డివిజన్ పరిధిలో మౌలిక వసతుల కల్పనకు రూ.35 కోట్ల నిధులు మంజూరు కావడంతో స్థానిక కాంగ్రెస్ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి, ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ప్రత్యేక చొరవతో ఈ నిధులు మంజూరైనట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

ఈ నిధులతో మొత్తం 115 అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. ముఖ్యంగా కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణం, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు వంటి మౌలిక వసతుల పనులకు ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ పనులు పూర్తయితే స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న రహదారులు, మురుగునీటి పారుదల సమస్యలకు పరిష్కారం లభించడంతో పాటు కాలనీల అభివృద్ధికి మరింత ఊతం లభించనుంది. ఈ భారీ నిధుల మంజూరులో కీలక పాత్ర పోషించిన మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్ యాదవ్‌కు జవహర్ నగర్, డివిజన్ల కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి అభివృద్ధి పనులకు నిధులు కేటాయించేందుకు కృషి చేసిన మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుకు ధన్యవాదాలు తెలియజేశారు.

ఈ సందర్భంగా జవహర్ నగర్ మాజీ మేయర్, జవహర్ నగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దొంతగాని శాంతి కోటేష్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు బల్లి శ్రీనివాస్, పార్టీ ప్రధాన కార్యదర్శి గజ్వేల్ శంకర్, నాయకుడు డి.ఎస్.ఎస్. వెంకటేష్ తదితరులు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మౌలిక వసతుల అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ నిధులు కేటాయించడం అభినందనీయమన్నారు. రూ.35 కోట్లతో చేపట్టనున్న 115 అభివృద్ధి పనులు పూర్తయితే జవహర్ నగర్, చంద్రాపురి ప్రాంతాల్లో రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడి ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించి, కాలనీలను అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేస్తారని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

### ప్రభుత్వం ద్వారా వచ్చే పథకాలు ప్రతి లబ్ధిదారునికి అందేలా చూడాలి

**వికారాబాద్ జిల్లా డిపిఓ జయసుధ**

**చౌడాపూర్ :** గ్రామంలో నూతన పెన్షన్ వెరిఫికేషన్ వికారాబాద్ జిల్లా డిపిఓ జయసుధ పరిశీలించడం జరిగింది మరియు వివో బిల్డింగ్ పనులు ఎంతవరకు వచ్చాయని స్థానిక నాయకులను ఆరా తీయడం జరిగింది ప్రభుత్వం ద్వారా వచ్చేటటువంటి సంక్షేమ పథకాలు ప్రతి పేదవాడికి అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి అందేలా చూడాలన్నారు బిల్డింగ్ ముందల వాష్ రూమ్ కోసం రూములు కట్టాలన్నారు అదేవిధంగా రాబోయే రోజుల్లో ఎలినినో ప్రభావం వల్ల ప్రజలకు గ్రామంలో ఉన్నటువంటి నీటి సమస్యలు పొదుపు చేసుకొని పొదుపుగా వాడుకోవాలని అన్నారు ప్రతి ఒక్కరూ ఇంటిదగ్గర ఇంకుడు గుంతలు నిర్మించునెల చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. వివో బిల్డింగ్ దగ్గర ఇంకుడు గుంత కోసం పనులు మొదలు చేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో చౌడాపూర్ మండల ఎంపీడీవో ఇన్చార్జి వెంకన్న గౌడ్, ఎంపీఓ శ్రీనివాసరెడ్డి, స్థానిక సర్పంచ్ పరిగి నవీన్ కుమార్, చౌడాపూర్ గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ రాథోడ్ ఫీల్డ్ అసిస్టెంట్ కిషన్ నాయక్, వార్డు మెంబర్లు బంద్యయ్య,నర్సింలు,శ్రీను, గ్రామ ప్రజలు సేవ్వ యాదయ్య గ్రామ పెద్దలు ,మొగులయ్య, యాదయ్య ,తదితరులు పాల్గొనడం జరిగింది.

# నారీ శక్తికి సాంకేతిక' సాధికారత

### సీనియర్ సివిల్ జడ్జి రీటాలాల్ చందు

**రంగారెడ్డి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** నేటి ఆధునిక సాంకేతిక ప్రపంచంలో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ఏమాత్రం వెనుకబడకుండా వేగంగా ప్రగతి సాధించాలని ఇబ్రహీంపట్నం ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ కోర్టు జడ్జి జస్టిస్ రీటాలాల్ చందు ఆకాంక్షించారు. అంతర్జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా నాగన్ పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలు ఎం. నందిత అధ్యక్షతన ప్రత్యేక అవగాహన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. సమాజంలో నేటికీ ఎదురవుతున్న వివక్ష, అణచివేతలను తుడిచిపెట్టాలన్నారు. ఆడపిల్లలను కూడా మగపిల్లలతో సమానంగా పెంచి వారిలో మనోధైర్యాన్ని నింపాలని పిలుపునిచ్చారు. బాలబాలికల హక్కుల రక్షణకు భారత రాజ్యాంగం, న్యాయస్థానాలు ఎల్లవేళలా అండగా ఉంటాయని భరోసా ఇచ్చారు. పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తూ, నేరాల దుష్ఫలితాలను జడ్జి వివరించారు. ప్రతిరోజూ ఉదయం యోగాసనాలు సాధన చేయడంతో పాటు ఆత్మరక్షణ కోసం కరాటే విద్యను నేర్చుకుని స్వశక్తితో ఎదగాలని విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్, కె. రవీందర్, జాంగిర్, మహేష్, రామోజీ ఫిలింసిటీ ప్రతినిధులు, కోర్టు సిబ్బంది బి. రమాదేవి, జి. ప్రేమలత, ఎం. ఆనంద్, ఎ. పప్పీ, పాఠశాల అటెండర్లు తదితరులు పాల్గొన్నారు.

# కారు బోల్తా.. బీఆర్ఎస్ నేత పి.టి. స్వామి మృతి

### గుండెపోటుతో కన్నుమూత.. పలువురు నాయకుల సంతాపం



**గోదావరిఖని, అక్టోబర్ 24 (జనంసాక్షి):** గోదావరిఖనికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పి.టి. స్వామి (పీటీ స్వామి) మృతి చెందారు. పెద్దపల్లి నుంచి గోదావరిఖనికి కారులో వస్తుండగా పాలకుర్తి మండలం బసంత్‌నగర్ సమీపంలో వాహనం బోల్తా పడింది. ప్రమాదంలో గాయపడిన ఆయనను గోదావరిఖని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతున్న సమయంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లు వైద్యులు వెల్లడించారు. పి.టి. స్వామి గోదావరిఖనిలో వాణి విద్యా విహార్ పాఠశాలను స్థాపించి ఎంతోమంది విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించారు. పలువురు ఉపాధ్యాయులను తీర్చిదిద్దడంతో గురువులకు గురువుగా గుర్తింపు పొందారు. రాజకీయాల్లోనూ చురుగ్గా వ్యవహరించిన ఆయన మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కు అనుచరుడిగా బీఆర్ఎస్‌లో కీలకంగా పనిచేశారు. సీనియర్ సిటిజన్ సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడిగా, వీర్లపల్లిలోని ఈశ్వర కృప వృద్ధాశ్రమం ద్వారా వృద్ధులకు సేవలందించారు. ఇటీవల బీఆర్ఎస్, సింగరేణి కార్మిక గర్జన కార్యక్రమంలోనూ పాల్గొన్నారు.

ఆయన మృతి పట్ల మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్, రామగుండం మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. బీజేపీ సీనియర్ నాయకుడు ఊర్ల లక్ష్మీనారాయణ కూడా సంతాపం ప్రకటిస్తూ, పి.టి. స్వామి మరణం తీరని లోటని పేర్కొన్నారు. ఆయన మృతి వార్తతో గోదావరిఖని ప్రాంతంలో విషాదం నెలకొంది.

# యువత అభ్యున్నతికి, భూ రీసర్వే వేగవంతానికి ప్రాధాన్యం

- అగ్నివీర్, ఎస్ఎస్‌సీ జీడీ అభ్యర్థులకు ఉచిత వైద్య శిబిరం
- నవంబర్ 1న సీతమ్మలొద్ది ట్రెక్కింగ్
- వారసత్వ సంపద పరిరక్షణపై యువతకు అవగాహన
- 70 రెవెన్యూ గ్రామాల్లో భూ రీసర్వే వేగవంతం చేయాలి: సీసీఎల్ఏ కమిషనర్




**పెద్దపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి):** యువతకు ఉపయోగపడే కార్యక్రమాలను ప్రోత్సహించడంతో పాటు జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక వారసత్వ సంపదను పరిరక్షించేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. శనివారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అగ్నివీర్, ఎస్ఎస్‌సీ జీడీ అభ్యర్థుల కోసం నిర్వహించనున్న ఉచిత వైద్య శిబిరం, 'మన జిల్లా--మన ఖిల్లా' కార్యక్రమంలో భాగంగా చేపట్టనున్న సీతమ్మలొద్ది ట్రెక్కింగ్ పోస్టర్లను ఆవిష్కరించారు.

ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీకి హాజరయ్యే అభ్యర్థులతో పాటు ఎస్ఎస్‌సీ జీడీ అభ్యర్థులకు ఉపయోగపడేలా యువశక్తి-పెద్దపల్లి ఆధ్వర్యంలో అక్టోబర్ 31న పెద్దపల్లి బస్టాండ్ సమీపంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. శారీరక పరీక్షల అనంతరం వైద్య పరీక్షల్లో ఎదురయ్యే సమస్యలను ముందుగానే గుర్తించి, అవసరమైన సలహాలు, చికిత్స పొందేందుకు ఈ శిబిరం ఉపయోగపడుతుందని నిర్వాహకులు తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు పోస్టర్‌లోని క్యూఆర్ కోడ్ ద్వారా నమోదు చేసుకోవాలని, వివరాలకు 7780543055, 9182691655 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

'మన జిల్లా-మన ఖిల్లా' కార్యక్రమంలో భాగంగా నవంబర్ 1న సీతమ్మలొద్ది ప్రాంతంలో ట్రెక్కింగ్ నిర్వహించనున్నారు. ఇప్పటికే 250 మంది రన్నర్లు, వాకర్లు పేర్లు నమోదు చేసుకున్నారు. సుమారు వెయ్యి నుంచి 1,200 ఏళ్ల నాటి ప్రాచీన చిత్రాలున్న గుహలు, ఆదిమానవుల ఆనవాళ్లు కలిగిన ఈ ప్రాంతంతో పాటు పిడుగుతొర్ర, భీమన్న దేవాలయాన్ని సందర్శించే అవకాశం కల్పించనున్నారు. యువతలో ఫిట్‌నెస్, పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంచడంతో పాటు మాదకద్రవ్యాల దుష్ప్రభావాలను వివరించనున్నారు. 'ఎస్ ఫర్ లైఫ్-సే నో టు డ్రగ్స్' నినాదంతో ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవాలని నిర్వాహకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డీఎంవో ప్రవీణ్‌రెడ్డి, మాజీ సైనికుడు, అంతర్జాతీయ పర్వతారోహకుడు లెంకల మహిపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మరోవైపు భూ రీసర్వే మొదటి దశ పనులను వేగవంతం చేసి, ఎంపిక చేసిన గ్రామాల్లో సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్‌కుమార్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. భూ రీసర్వే పురోగతిపై నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడుతూ ప్రతి జిల్లాలో మొదటి దశకు ఎంపిక చేసిన 70 రెవెన్యూ గ్రామాల్లో పనులకు ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అవసరమైన అదనపు బృందాలను ఏర్పాటు చేసి, సిబ్బంది, యంత్ర పరికరాలు, సాంకేతిక సదుపాయాలను సమకూర్చుకోవాలని తెలిపారు. భూ సరిహద్దులు, రికార్డుల్లో వ్యత్యాసాలు, క్షేత్రస్థాయి సమస్యలను వెంటనే పరిష్కరించాలని, గ్రామాల వారీగా పురోగతిని నిరంతరం సమీక్షించాలని ఆదేశించారు. సర్వే వివరాలను భూ రికార్డులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కలెక్టర్ కోయ శ్రీహర్ష, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీరాములు, ఏడీ సర్వేయర్ సోమేశ్వర్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# సోమాజిగూడ బార్‌లో తుపాకీతో వీరంగం

- బిల్లు డబ్బులు తిరిగివ్వాలంటూ కాల్చేస్తానని బెదిరింపులు
- కస్టమర్లు, బౌన్సర్లలో తీవ్ర భయాందోళనలు
- రివాల్వర్, థార్ వాహనం స్వాధీనం.. నిందితుడి అరెస్టు



**అమీర్‌పేట్ / సోమాజిగూడ, అక్టోబర్ 25 (జనంసాక్షి):** హైదరాబాద్‌లోని సోమాజిగూడ హెడ్‌క్వార్టర్స్ బార్ అండ్ రెస్టారెంట్‌లో రివాల్వర్‌తో ఓ వ్యక్తి హల్‌చల్ చేశాడు. బిల్లు డబ్బులు తిరిగి ఇవ్వాలని, లేకపోతే కస్టమర్లు, బౌన్సర్లను కాల్చి చంపుతానంటూ బెదిరించినట్లు ఫిర్యాదు అందింది. ఈ ఘటనతో బార్‌లో తీవ్ర కలకలం రేగింది. అక్టోబర్ 24 అర్ధరాత్రి 12.30 గంటల సమయంలో బార్ రెండో అంతస్తులో కస్టమర్ల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. పరిస్థితి అదుపు తప్పకుండా బౌన్సర్లు జోక్యం చేసుకుని ఇరువర్గాలను బయటకు పంపించారు. ఈ క్రమంలో మహీంద్రా థార్‌లో వచ్చిన ఓ వ్యక్తి రివాల్వర్‌తో తిరిగి రెస్టారెంట్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా సిబ్బంది అడ్డుకుని సెల్లార్ ప్రాంతానికి తరలించారు. కొద్దిసేపటి తర్వాత అక్కడున్న కస్టమర్లు, బౌన్సర్లపై రివాల్వర్ చూపిస్తూ బెదిరించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో భయాందోళనకు గురైనవారు అక్కడి నుంచి పరుగులు తీశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. హైదరాబాద్‌లోని ఒవైసీ కాలనీ, అచిరెడ్డినగర్‌కు చెందిన మహమ్మద్ షానవాజ్ (24)గా అతడిని గుర్తించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. రివాల్వర్‌ను స్వాధీనం చేసుకుని, థార్ వాహనంతో సహా పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఫిర్యాదుదారుడు బచ్చు బంటీ ఫిర్యాదు మేరకు చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు

# పత్రికా స్వేచ్ఛ, ప్రజాస్వామ్యం పరస్పర ఆధారితాలు




- పత్రికా స్వేచ్ఛ ఉంటేనే ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది
- మహిళా జర్నలిస్టుల స్వేచ్ఛను కాపాడాలి: మంత్రి సీతక్క
- ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ ఆధ్వర్యంలో జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు ప్రారంభ సభలో మంత్రి సీతక్క

**హైదరాబాద్, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** 'మన గణతంత్రం, మన పత్రికా రంగం రెండూ కలిసే ఎదుగుతాయి.. లేదా కలిసే పతనమవుతాయి" అన్న ప్రముఖ పాత్రికేయుడు జోసెఫ్ పులిట్జర్ మాటలు స్వేచ్ఛాయుత మీడియా, ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యం మధ్య ఉన్న విడదీయలేని సంబంధాన్ని స్పష్టం చేస్తున్నాయని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి డా. ధనసరి అనసూయ సీతక్క అన్నారు. సీఈసీ జ్ఞానేష్ కుమార్ రాజీనామా విషయంలో అధికారాన్ని ప్రశ్నించే మహిళా జర్నలిస్టులను శత్రువులుగా చూడటం ప్రజాస్వామ్యానికి ప్రమాదకరమని పేర్కొన్నారు. ప్రశ్నలను అణచివేయడంలో కాకుండా, వాటికి సమాధానం చెప్పే ధైర్యంలోనే ప్రజాస్వామ్య బలం ఉంటుందని స్పష్టం చేశారు. శనివారం బేగంపేటలోని టూరిజం ప్లాజాలో ఇండియన్ జర్నలిస్ట్స్ యూనియన్ (ఐజేయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ మహిళా జర్నలిస్టుల సదస్సు (నేషనల్ కాన్ఫరెన్స్ ఆఫ్ ఉమెన్ జర్నలిస్ట్స్)ను మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి పెద్ద సంఖ్యలో మహిళా జర్నలిస్టులు, మీడియా ప్రతినిధులు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ, మహిళా జర్నలిస్టులు తమ వృత్తిపరమైన బాధ్యతలను భయం లేకుండా నిర్వర్తించగలగాలని, నిజాలను వెలుగులోకి తీసుకురావడం, అధికారాన్ని ప్రశ్నించడం వారి వృత్తిపరమైన హక్కులని అన్నారు. జర్నలిస్టుల చేతిలోని మైక్రోఫోన్‌ను శత్రుత్వానికి చిహ్నంగా చూడకూడదని, అసౌకర్యం కలిగించే ప్రశ్నలు అడిగినంత మాత్రాన వారిని ప్రజాస్వామ్యానికి ముప్పుగా పరిగణించకూడదని పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా జరిగిన నిరసనలను కవర్ చేస్తున్న మహిళా జర్నలిస్టులపై దాడులు, లైంగిక వేధింపులు జరిగినట్లు వచ్చిన ఆరోపణలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయని సీతక్క అన్నారు. ఈ ఘటనలకు సంబంధించి మహిళా జర్నలిస్టులపై కేసులు నమోదైనట్లు వచ్చిన నివేదికలను కూడా నిష్పక్షపాతంగా పరిశీలించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు ఈ కార్యక్రమంలో హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి రాధా రాణి, మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ సుమతి, తెలంగాణ ప్రెస్ అకాడమీ చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, కర్ణాటక మీడియా అకాడమీ చైర్‌పర్సన్ అయిషా కనుమ్, ఐజేయూ జాతీయ అధ్యక్షుడు బల్వీందర్ సింగ్ జమ్మూ, జర్నలిస్టు ఉద్యమ నేతలు దేవులపల్లి అమర్, విరాహత్ అలీ, సోమసుందర్, అరుణ తదితరులు పాల్గొన్నారు.



# గచ్చిబౌలిలో లెదర్ కామన్ ఫెసిలిటీ సెంటర్

- డిజైనింగ్ నుంచి బ్రాండింగ్ వరకు ఆర్టిజన్లకు మార్గనిర్దేశం
- రుక్మాపూర్ లో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాలు
- టీజీఎల్ఐపీసీ సమీక్షా సమావేశంలో మంత్రి శ్రీధర్ బాబు



**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీని మరింత బలోపేతం చేయడంతో పాటు, ఔత్సాహిక ఎస్సీ పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు గచ్చిబౌలిలో ప్రత్యేకంగా కామన్ ఫెసిలిటీ సెంటర్ (సీఎఫ్‌సీ)ను ఏర్పాటు చేయనున్నట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు తెలిపారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలం రుక్మాపూర్ లో సుమారు వేయి మందికి ఉపాధి కల్పించేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో పర్యావరణహిత చర్మశుద్ధి కర్మాగారాల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. శనివారం డా.బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో తెలంగాణ లెదర్ ఇండస్ట్రీస్ ప్రమోషన్ కార్పోరేషన్(టీజీఎల్ఐపీసీ) ఉన్నతాధికారులతో ఆయన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాష్ట్రంలో లెదర్ ఇండస్ట్రీ అభివృద్ధికి, ఆర్టిజన్లను ప్రోత్సహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... ఎస్సీ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ సంకల్పమన్నారు. అంతర్జాతీయ హంగులతో గచ్చిబౌలీలో హబ్ అండ్ స్పోక్ విధానంలో మూడున్నర ఎకరాల విస్తీర్ణంలో అభివృద్ధి చేయనున్న సీఎఫ్‌సీ ద్వారా రాష్ట్రంలోని ఆర్టిజన్ల ఉత్పత్తులకు అదనపు విలువ(వాల్యూ యాడెడ్)ను జోడిస్తామన్నారు. డిజైనింగ్ మొదలు బ్రాండింగ్ వరకు వారికి మార్గనిర్దేశం చేస్తామన్నారు. హుజురాబాద్ నియోజకవర్గం జమ్మికుంట, ఆర్మూర్ లో మైక్రో స్మాల్ ఎంటర్ ప్రైజెస్ క్లస్టర్ డెవలెప్ మెంట్ ప్రోగ్రాం (ఎంఎస్ఈసీడీపీ) కింద ప్లగ్ అండ్ ప్లే విధానంలో ఫ్లాటెడ్ ఫ్యాక్టరీ కాంప్లెక్స్ ను అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. గతంలో లిడ్ క్యాప్ కు ఎక్కడెక్కడ భూములు కేటాయించారు... వాటి ప్రస్తుత పరిస్థితి ఏంటనే అంశంపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన నివేదిక అందజేయాలని సంబంధిత ఉన్నతాధికారులను ఆదేశించారు. సమావేశంలో పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి కృష్ణ ఆదిత్య, పరిశ్రమల శాఖ కమిషనర్ నిఖిల్ చక్రవర్తి, టీజీఎల్ఐపీసీ వీసీ అండ్ ఎండీ ప్రశాంత్ కుమార్, తెలంగాణ స్టేట్ లెదర్ ఇండస్ట్రియల్ ప్రమోషన్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ప్రెసిడెంట్ డా.ఆరేపల్లి రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

## నానక్‌రామ్‌గూడ, కోకాపేటలో నిర్మాణ ప్రాజెక్టులపై

# టీజీపీసీబీ కొరడా!

- 19 నిర్మాణ ప్రాజెక్టులపై టాస్క్‌ఫోర్స్ సమీక్ష..
- ఉల్లంఘనల సవరణకు 10 రోజుల గడువు
- రెండు ఆర్ఎంసీ ప్లాంట్ల మూసివేతకు సిఫారసు..
- ఉల్లంఘనలకు పర్యావరణ పరిహారం, బ్యాంకు గ్యారంటీల జప్తునకు నిర్ణయం

**సనత్ నగర్ / అమీర్‌పేట్, అక్టోబర్ 24 (జనం సాక్షి):** నానక్‌రామ్‌గూడ, కోకాపేట ప్రాంతాల్లో నిర్మాణ ప్రాజెక్టుల వల్ల వాయు కాలుష్యం పెరుగుతోందంటూ అందిన ఫిర్యాదులపై తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) చర్యలు చేపట్టింది. నిర్మాణ ప్రాజెక్టుల్లో పర్యావరణ నిబంధనల అమలు, వాయు కాలుష్య నియంత్రణ చర్యలను పర్యవేక్షించేందుకు రోలింగ్ టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా అక్టోబర్ 24న టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో నానక్‌రామ్‌గూడ, కోకాపేట ప్రాంతాల్లోని 19 నిర్మాణ ప్రాజెక్టుల పర్యావరణ నిబంధనల అమలు తీరును కమిటీ పరిశీలించింది. ఆయా ప్రాజెక్టుల ప్రతినిధులు సమావేశానికి హాజరయ్యారు. ప్రాజెక్టుల వారీగా ఉల్లంఘనలను సమీక్షించిన టాస్క్‌ఫోర్స్ కమిటీ.. తీవ్రమైన ఉల్లంఘనలకు పాల్పడిన ప్రాజెక్టులపై పర్యావరణ పరిహారం విధించాలని, తక్కువ తీవ్రత కలిగిన ఉల్లంఘనలకు సంబంధించి ఆయా సంస్థలు సమర్పించిన బ్యాంకు గ్యారంటీలను జప్తు చేయాలని సిఫారసు చేసింది. టీజీపీసీబీ నుంచి కార్యకలాపాల నిర్వహణ అనుమతి (కన్సెంట్ టు ఆపరేట్- -సీటీఓ) పొందకుండా పనిచేస్తున్న రెండు నిర్మాణ ప్రాజెక్టులకు అనుబంధంగా ఉన్న రెడీ మిక్స్ కాంక్రీట్ (ఆర్ఎంసీ) ప్లాంట్లను మూసివేయాలని సూచించింది. నిబంధనలను ఉల్లంఘించిన ప్రాజెక్టులు లోపాలను సరిదిద్దుకునేందుకు 10 రోజుల గడువు విధించాలని సిఫారసు చేసింది. కమిటీ సిఫారసుల మేరకు పర్యావరణ పరిహారం విధించడం, బ్యాంకు గ్యారంటీల జప్తు, నిబంధనల అమలుకు ఆదేశాలు జారీ చేయడం, అనుమతులు లేని రెండు ఆర్ఎంసీ ప్లాంట్ల మూసివేతకు సంబంధించి టీజీపీసీబీ తదుపరి చర్యలు చేపట్టనుంది.

### బాసర ట్రిపుల్ ఐటీ విద్యార్థులకు 26 నుంచి ఆన్‌లైన్ క్లాసులు షురూ

**నిర్మల్ (జనంసాక్షి) :** నిర్మల్ జిల్లాలోని ప్రసిద్ధ బాసర రాజీవ్ గాంధీ సాంకేతిక విజ్ఞాన విశ్వవిద్యాలయం అధికారుల నుంచి విద్యార్థులకు కీలక ప్రకటన వెలువడింది. యూనివర్సిటీలో విద్యాబోధనకు సంబంధించి అకడమిక్ షెడ్యూల్‌ను అధికారులు ఇవాళ ప్రకటించారు. ఈ మేరకు అక్టోబర్ 26 నుంచి విద్యార్థులందరికీ ఆన్‌లైన్ తరగతులను ప్రారంభించనున్నట్లుగా పేర్కొన్నారు. పీయూసీ-1 (ఖ్రజ-1) నుంచి ఇంజనీరింగ్ నాలుగో సంవత్సరం (జు-4) వరకు ఉన్న విద్యార్థులందరికీ ఈ ఆన్‌లైన్ క్లాసులు కొనసాగుతాయి. ఇక నిర్దేశిత విద్యా సమయాన్ని సద్వినియోగం చేసుకునేలా నవంబర్ 17 నాటికి సిలబస్‌ను పూర్తిగా ముగించాలని విశ్వవిద్యాలయ యంత్రాంగం లక్ష్యంగా పెట్టుకుంది.పీయూసీ-1, పీయూసీ-2 చదువుతున్న విద్యార్థులు నవంబర్ 10 నాటికి తిరిగి క్యాంపస్‌కు చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. ఆన్‌లైన్ తరగతులకు సంబంధించి విద్యార్థులకు అవసరమైన ఆన్‌లైన్ లింక్స్, డీటెయిల్స్ వర్సిటీ పోర్టల్ ద్వారా అందజేయనున్నట్లుగా అధికారులు వెల్లడించారు.

### మహిళలు అన్నిరంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలి

- రాష్ట్ర మంత్రి సీతక్క

**హైదరాబాద్ (జనంసాక్షి) :** మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ఎదిగి అన్ని రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క ఆకాంక్షించారు. మహిళలు రాజకీయాల్లో ఎదిగే క్రమంలో ఎదురయ్యే వివక్ష, అడ్డంకులకు భయపడకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. మాదాపూర్‌లోని ఓ ప్రైవేట్ హోటల్‌లో శనివారం నిర్వహించిన "పంచాయతీ నుంచి పార్లమెంట్ వరకు.. మహిళా రాజకీయ నాయకత్వాన్ని ముందుకు తీసుకెళ్లడం" అనే అంశంపై జరిగిన సదస్సుకు మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో ఏఐసీసీ కార్యదర్శి గురుదీప్ సింగ్ సప్పాల్, ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నేరెళ్ల శారద, కర్ణాటక మాజీ ఎమ్మెల్యే అంజలి, సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి కోట నీలిమతో పాటు, ఇప్పుడు రాష్ట్రాలకు చెందిన కాంగ్రెస్ మహిళా నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ తన జీవితం ఎన్నో కష్టాలు, పోరాటాలతో నిండిందని, చిన్నతనంలో ఆకలి బాధలు సహా అనేక సమస్యలను ఎదుర్కొన్నానని తెలిపారు. ములుగు వంటి అటవీ ప్రాంతంలోని పేద కుటుంబంలో జన్మించిన తనకు ఎలాంటి రాజకీయ నేపథ్యం లేదని చెప్పారు.

# వనపర్తి విద్యాభివృద్ధికి రూ.680 కోట్లు



- మామిడిమడ పాఠశాల అభివృద్ధికి రూ.కోటి కార్పస్ ఫండ్
- పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

**వనపర్తి బ్యూరో అక్టోబర్24 (జనంసాక్షి) :** వనపర్తి నియోజకవర్గంలో విద్యాభివృద్ధికి ఇప్పటికే రూ.680 కోట్ల నిధులు తీసుకొచ్చామని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి తెలిపారు. ఖిల్లా ఘణపురం మండలం మామిడిమడ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం నిర్వహించిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం, పాదపూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. తాను చదువుకున్న పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం ఎంతో సంతృప్తినిస్తోందని పేర్కొన్నారు. మామిడిమడ ఉన్నత పాఠశాల అభివృద్ధి కోసం రూ.కోటి కార్పస్ ఫండ్‌ను సమకూర్చనున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు పాఠశాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. ఆయన పిలుపుతో కార్యక్రమానికి హాజరైన పలువురు అక్కడికక్కడే విరాళాలు ప్రకటించగా, సుమారు రూ.20 లక్షలు సమకూరాయి.వనపర్తి నియోజకవర్గంలో మొదటి విడతగా నాలుగు ఉన్నత పాఠశాలలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. పెద్దమందడి మండలం వెల్టూరు గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని వివరించారు. వందేమాతరం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు రవీందర్ మాట్లాడుతూ, విద్యార్థుల చదువులు, ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. విద్యాభివృద్ధికి ఇంతటి ప్రాధాన్యమిచ్చే ఎమ్మెల్యే ఉండటం వనపర్తి ప్రజల అదృష్టమని పేర్కొన్నారు. అనంతరం పాఠశాలలో నూతనంగా ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని, శుద్ధి నీటి కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు అధ్యక్షుడు నవనీత క్యామ రాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చెన్నప్ప, విజయ భాస్కర్ రెడ్డి, వెంకట్రావు, సర్పంచ్ లింగం, సాయిచరణ్ రెడ్డి, మండలాధ్యక్షుడు కృష్ణయ్య, ఉపసర్పంచ్ భద్రయ్య, మాజీ సర్పంచ్ మోహన్ జి, జితేందర్ రెడ్డి, శ్యాంసుందరరావు, ఎంఈఓ జయశంకర్, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# పత్తి చేలలో పిల్లలతో పని చేయిస్తే కేసులు

- పత్తి చేల బాట పట్టిన 86 మంది విద్యార్థులకు విముక్తి
- మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, ఎస్సై రమేష్ హెచ్చరిక



**తెలకపల్లి, అక్టోబర్ 24 (జనంసాక్షి) :** పాఠశాలలకు వెళ్లాల్సిన బాలలను పత్తి చేలలో పనులకు తీసుకెళ్తే సంబంధిత వ్యక్తులపై కేసులు నమోదు చేస్తామని మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి, తెలకపల్లి ఎస్సై రమేష్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని లింగాల-తెలకపల్లి ప్రధాన రహదారిలో పశువుల సంత సమీపంలో పత్తి చేల పనులకు వెళ్తున్న 86 మంది విద్యార్థులను అధికారులు గుర్తించి, వారిని తిరిగి పాఠశాలలకు పంపించారు. ఇటీవల దసరా సెలవుల నేపథ్యంలో పాఠశాలలకు సెలవులు ఉండటంతో పలువురు విద్యార్థులు పత్తి చేల పనులకు వెళ్లారు. సెలవులు ముగిసి పాఠశాలలు పునఃప్రారంభమైనప్పటికీ, కొందరు విద్యార్థులు బడికి వెళ్లకుండా పత్తి చేల పనులకు వెళ్తున్న విషయాన్ని కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో శనివారం జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్, విద్యాశాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, పోలీసు శాఖ సంయుక్తంగా తనిఖీలు నిర్వహించాయి. ఈ సందర్భంగా పత్తి చేల పనులకు వెళ్తున్న 86 మంది విద్యార్థులను గుర్తించి, వారిని పనులకు వెళ్లకుండా నిలిపివేశారు. అనంతరం విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, వాహన డ్రైవర్లకు కౌన్సెలింగ్ నిర్వహించి, పిల్లలను తిరిగి పాఠశాలలకు పంపించేలా చర్యలు తీసుకున్నారు. కొల్లాపూర్, మల్లచింతలపల్లి, నార్లాపూర్, సాతాపూర్, పెద్దకార్పాముల, మరికల్, రాయిపాకుల, ఆలేరు, బొప్పల్లి, గౌరెడ్డిపల్లి, పెద్దకొత్తపల్లి తదితర గ్రామాల నుంచి విద్యార్థులు వివిధ వాహనాల్లో పత్తి చేల పనులకు వెళ్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. తల్లిదండ్రులు తమ పిల్లలను పత్తి చేల పనులకు పంపకుండా పాఠశాలలకు పంపించాలని సూచించారు. ముఖ్యంగా పదో తరగతి విద్యార్థులు రాబోయే పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాలంటే ప్రతిరోజూ పాఠశాలకు హాజరై చదువుపై దృష్టి సారించాలని తెలిపారు. పిల్లలను పత్తి చేల పనులకు తీసుకెళ్లే వారితో పాటు వాహన డ్రైవర్లపై కూడా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం తెలకపల్లి ఎస్సై రమేష్ మాట్లాడుతూ.. 18 సంవత్సరాల లోపు పిల్లలను పనులకు తరలించరాదని స్పష్టం చేశారు. వాహనాల సామర్థ్యానికి మించి ప్రయాణికులను తరలిస్తే సంబంధిత వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. బాలల విద్యకు ఆటంకం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గౌరెడ్డిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు శివప్రసాద్, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 ప్రతినిధి యశ్వంత్, ఎస్సై రమేష్, ఏఎస్ఐ శంకర్ రెడ్డి, కానిస్టేబుళ్లు శ్రీను, నాగరాజు, కోనేరు స్వచ్ఛంద సంస్థ ప్రాజెక్టు కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఏరియా కోఆర్డినేటర్లు జాకీర్ హుస్సేన్, శ్రీనివాసులు, సోషల్ వర్కర్ శివుడు, సీఆర్పీ శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో ఎక్కడా లేని విధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ తీసుకొచ్చాం

- టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్



**హైదరాబాద్ (జనంసాక్షి) :** గాంధీ భవన్‌లోని ఇందిరా భవన్‌లో టీపీసీసీ లీగల్ సెల్ కార్యవర్గ సమావేశం లీగల్ సెల్ చైర్మన్ అశోక్ గౌడ్ అధ్యక్షతన ప్రారంభమైంది. ఈ సమావేశానికి టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, ఏఐపీసీ చైర్మన్, మాజీ ఎంపీ మధు యాష్కీ గౌడ్, ఎమ్మెల్యేలు మధుసూదన్ రెడ్డి, నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఈరవత్రి అనిల్, ఎమ్మెల్సీ అభ్యర్థి సామ రామ్మోహన్ రెడ్డితో పాటు పలువురు పార్టీ నాయకులు, లీగల్ సెల్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ అడ్వకేట్ వృత్తి ఎంతో గౌరవప్రదమైనదని, అదే సమయంలో ఎన్నో సవాళ్లతో కూడుకున్నదని పేర్కొన్నారు. న్యాయవాద వృత్తి నుంచి రాజకీయాల్లోకి వచ్చిన అనేక మంది నాయకులు రాణించారని తెలిపారు. తాను కూడా అడ్వకేట్ కావాలనుకున్నప్పటికీ ఆ అవకాశం దక్కలేదని గుర్తుచేసుకున్నారు. దేశంలో రాజ్యాంగబద్ధ సంస్థలు నిర్వీర్యమవుతున్నాయని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. కొన్ని న్యాయస్థానాల తీర్పులు ఆశ్చర్యం కలిగిస్తున్నాయని పేర్కొంటూ, ఎన్నికల సంఘాన్ని కేంద్ర ప్రభుత్వం తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటోందని ఆరోపించారు. సీబీఐ, ఈడీ వంటి దర్యాప్తు సంస్థలను కూడా కేంద్రం ఇష్టానుసారంగా వినియోగిస్తోందని విమర్శించారు. న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. న్యాయవాదులకు స్టైఫండ్ పెంపుతో పాటు వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను తీసుకొచ్చామని పేర్కొన్నారు. న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి సంక్షేమానికి సంబంధించిన అంశాలపై నవంబర్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రత్యేకంగా చర్చించనున్నట్లు వెల్లడించారు.

# 1800 గజాల పార్కు స్థలాన్ని కాపాడిన హైడ్రా

**హైదరాబాద్, అక్టోబర్ 24(జనంసాక్షి) :** సికింద్రాబాద్ పరిధిలోని అల్వాల్, మచ్చబొల్లారం జొన్నబండ ప్రాంతంలో ఉన్న శ్రీ గణేష్ ఎన్‌క్లేవ్ కాలనీలో సుమారు 1800 చదరపు గజాల పార్కు స్థలాన్ని హైడ్రా కాపాడింది. సర్వే నంబర్లు 17, 33, 34 పరిధిలో ఉన్న శ్రీ గణేష్ ఎన్‌క్లేవ్ కాలనీలో గ్రామ పంచాయతీ ఆమోదించిన లేఅవుట్ ప్రకారం ప్రజా అవసరాల కోసం 1800 చదరపు గజాల స్థలాన్ని కేటాయించారు. అయితే కొందరు వ్యక్తులు ఈ స్థలాన్ని ఆక్రమించి, పక్కనే ఉన్న సర్వే నంబర్లతో కలిపి తమ పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో కాలనీకి చెందిన వారు లేఅవుట్ అనుమతి పత్రాలు, 1969 నాటి లింక్ డాక్యుమెంట్లు, 1981 నాటి జీపీఏ పత్రాలు, భువన్ శాటిలైట్ చిత్రాలు, సర్వే రికార్డులతో హైడ్రాను ఆశ్రయించారు. ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు సంబంధిత రికార్డులు, లేఅవుట్ పత్రాలను పరిశీలించి పార్కు స్థలాన్ని ఆక్రమణల నుంచి పరిరక్షించారు. ప్రజల కోసం కేటాయించిన స్థలాలు అన్యాక్రాంతం కాకుండా చర్యలు చేపట్టారు. పార్కు స్థలాన్ని కాపాడుతూ హైడ్రా ఫెన్సింగ్ వేశారు.



Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370